


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




మంగళవారం | 29-10-2019 | పేజీలు: 14 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 193 | విజయవాడ సిటీ*

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: విదియ తె. 3.49 తదుపరి తదియ; నక్షత్రం: విశాఖ రా. 11.12 తదుపరి అనూరాధ; వర్జ్యం: శే. ఉ. 7.40, తె. 3.00-4.31; దుర్ముహూర్తం: ఉ. 8.33-9.19, రా. 9.50-10.39; అమృతఘడియలు: మ. 3.03-4.32; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.42

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



సాగునీటి ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష జరుపుతున్న ముఖ్యమంత్రి జగన్

# జలం కోసం రుణం!

## 'సాగునీటి'కి ప్రత్యేక కార్పొరేషన్

**నిధుల సేకరణకు సర్కారు వ్యూహం**

**30వేల కోట్లు దాటిన ప్రాజెక్టులన్నీ కార్పొరేషన్ పరిధిలోనే**

**జల వనరుల శాఖపై సీఎం సమీక్ష**

**ప్రాధాన్య జాబితాపై అసంతృప్తి**

**వరదొచ్చినా ప్రాజెక్టులు నిండలేదేం?**

**అధికారులపై జగన్ మండిపాటు**

**40 రోజుల్లో నింపాలని గడువు**

**'ఆంధ్రజ్యోతి' కథనాలపై చర్చ**

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భారీ ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు సేకరించేందుకు వీలుగా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. రూ.30,000 కోట్లకు పైబడి వ్యయమయ్యే ప్రాజెక్టులను కార్పొరేషన్ ద్వారా చేపట్టడమే మంచిదన్నారు. రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో పెద్దఎత్తున సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని జల వనరుల శాఖకు సూచించారు. ఈ నిర్మాణాలకు ఎంత ఖర్చవుతుందో అంచనా వేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే

మిగతా 11వ పేజీలో...

### గోదావరి జలాలను.. బానకచర్లకు ఎత్తిపోద్దాం!

14

**గోదావరి-కృష్ణా మహా సంగమం!**

**అంచనా వ్యయం 60 వేల కోట్లు**

**బొల్లాపల్లి వద్ద భారీ రిజర్వాయర్**

**ముఖ్యమంత్రి వద్ద ప్రాథమిక సమీక్ష**

**ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'**

# పనికొచ్చేది రంగులకే

## ఇసుక కొరత జగన్ గిఫ్ట్

**పాలనకు వైసీపీ పనికిరాదు**

**సీఎం ప్రకటిస్తున్న వరాలకు, ఆర్థిక పరిస్థితికి పొంతన లేదు**

**కార్మికుల ఆత్మహత్యలపై సీఎం స్పందనారాహిత్యం దారుణం: కన్నా**



తూర్పు గోదావరి జిల్లా మలికిపురంలో రాట్నంపై నూలు వడుకుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వైసీపీ ప్రభుత్వం తీరుపై ట్విటర్ వేదికగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. "రంగులేసుకోవడానికి, ఆర్భాటం చేయడానికి తప్ప రాష్ట్రాన్ని రూలింగ్ చేయడానికి పనికిరాని పార్టీ వైసీపీ. 151 సీట్లు ఇచ్చినందుకు రిటర్న్ గిఫ్ట్‌గా ఇసుక కృత్రిమ కొరత సృష్టించి రూ.150 కూలి కూడా రాని పరిస్థితికి భవన నిర్మాణ కార్మికులను తీసుకువచ్చిన ఇంత అసమర్థ ప్రభుత్వాన్ని నేను ఇంత వరకూ చూడలేదు" అని ట్వీట్ చేశారు. తన ట్వీట్‌కు వైసీపీ రంగులేసిన పంచాయతీ, పాఠశాల భవనాలు, నీళ్ల ట్యాంకు, బోరు, స్వాగత ద్వారం చిత్రాలను ట్యాగ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన గాంధీ సంకల్ప యాత్రలో ఆయన

మిగతా 11వ పేజీలో...



# కక్ష సాధింపుతో కష్టాలు

## మా వాళ్ల కోసమే రాజీనామా: వంశీ

**పార్టీకి, పదవికి కూడా.. క్రియాశీల రాజకీయాలకూ గుడ్‌బై**

**తొలి నుంచీ పలు పోరాటాలు చేశా.. వెనక్కివెళ్లే తత్వం కాదు**

**కానీ నమ్మక ద్రోహులతోనే ఇబ్బంది.. బాబుకు ఎమ్మెల్యే లేఖ**

**రాజీనామా చేసినా కక్షసాధింపు ఆగదు.. అండగా నిలుస్తా: బాబు**

**బుజ్జగింపు బాధ్యత కేశినేని, కొనకళ్లకు.. నేడు చర్చలు!**

14

# టార్గెట్ బాబు!

## ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసే వ్యూహం

### ఆరుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే పదవి పోయినట్టే!!

**వంశీ వైదొలగితే ఇక ఐదుగురే!**

**బలహీనతలున్నవారిపై వైసీపీ కన్ను**

**ఉప ఎన్నికలతో 'అసంతృప్తి'కి చెక్?**

*151 స్థానాల్లో గెలిచిన వైసీపీకి ఇంకేం కావాలి? మరికొందరు ఎమ్మెల్యేల అవసరం ఏమిటి? ఈ ప్రశ్నకు రాజకీయ వర్గాలు చెబుతున్న సమాధానం! చంద్రబాబు విపక్షనేత హోదా పోగొట్టడం! 'ప్రజల్లో అసంతృప్తి' ఉందనే అభిప్రాయాన్ని పోగొట్టుకోవడం!*



అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాసన సభలో తిరుగులేని బలం! రికార్డు స్థాయిలో విజయం! అయినా... తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు లక్ష్యంగా వైసీపీ వ్యూహం రచిస్తున్నట్లు చెబుతున్నారు. ఆయనకు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేయడం, ప్రభుత్వంపై ఐదు నెలల్లోనే అసంతృప్తి నెలకొందన్న అభిప్రాయానికి చెక్ పెట్టడమే లక్ష్యంగా వైసీపీ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబుకు ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడి హోదా ఉంది. అసెంబ్లీ సభ్యుల సంఖ్యలో కనీసం 10 శాతం ఎమ్మెల్యేలు ఉన్న పార్టీ నేతకే ఈ హోదా దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం సంఖ్యాబలం 175. అంటే... ప్రధాన ప్రతిపక్షానికి కనీసం 18 మంది సభ్యులు ఉండాలి. విపక్ష నేతకు కేబినెట్ హోదా ఉంటుంది. కేబినెట్ మంత్రికి ఉండే సౌకర్యాలన్నీ ఉంటాయి. శాసనసభలో ప్రధాన ప్రతిపక్షానికి కేటాయించే గదులు, సౌకర్యాలు వేరుగా ఉంటాయి. ఇతర విపక్షాలకు తక్కువగా ఉంటాయి. ఇప్పుడు తెలుగుదేశం పార్టీకి 23 మంది ఎమ్మెల్యేలున్నారు. ఇందులో ఆరుగురు రాజీనామాలు చేస్తే చాలు.. ఆ పార్టీకి ప్రతిపక్షంగా, చంద్రబాబుకు

మిగతా 14వ పేజీలో...

# ఆస్పత్రి కిట కిట

**కారిడార్‌లో కనుచూపు మేరా జనం!** ఓపీ చీటీ కోసం, మందుల కోసం బారులు బారులుగా జనం! ఇది అనంతపురం సర్వజన ఆస్పత్రిలో సోమవారం కనిపించిన దృశ్యం! జ్వరాలు, కీళ్ల నొప్పులు, ఇతర సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నవారు పెద్దసంఖ్యలో ఈ ఆస్పత్రికి తరలి వచ్చారు. గంటలకొద్దీ క్యూల్లో నిల్చోలేక నీరసించారు. తీరా కౌంటర్‌లో చీటీ ఇచ్చాక మందుల కొరత వెక్కిరించింది. ఇంత పెద్దసంఖ్యలో రోగులు రావడంతో సేవలు అందించలేక సిబ్బంది సతమతమయ్యారు.




# తల్లి గుండెలపై కూర్చుని.. మెడకు చున్నీ బిగించి..!



2

**చెడు తిరుగుళ్లు వద్దన్నందుకు దారుణంగా చంపిన కూతురు**

ప్రియుడితో కలిసి ఇంట్లోనే ఘాతుకం

శవం ఉండగానే ప్రియుడితో 3 రోజులు

కార్లో తీసుకెళ్లి రైలు పట్టాలపై పడవేత

తండ్రిపైనే కేసు పెట్టిన కిలాడీ కూతురు



# ఐఎస్ అధిపతి హతం

**బగ్దాదీని మట్టుపెట్టిన అమెరికా**

**కలుగులో ముగిసిన 'ఉగ్ర' కథ**

**రాత్రికి రాత్రి 'ఆపరేషన్ కెలా ముల్లర్'**

**ఎనిమిది హెలికాప్టర్లలో కమెండోలు**

**ప్రహరీ బద్దలుకొట్టి ఆవరణలోకి**

**అడ్డొచ్చిన ఉగ్రవాదుల కాల్చివేత**

**వెంటాడిన మిలిటరీ జాగిలాలు**

12

**సొరంగంలోకి పరుగు తీసిన బగ్దాదీ**

**బాంబులు పేల్చుకుని 'ఆత్మాహుతి'**

# అమ్మకానికి 'ఆప్తాల్మిక్'

'కంటి వెలుగు'లో మరో దోషం.. కాంట్రాక్ట్ సంస్థలో దళారుల హవా

పోస్టుకు రూ. 1.50 లక్షల డిమాండ్.. అభ్యర్థులతో నేరుగా బేరం

14









9

డిసెంబరు ఆఖరుకు

**బంగారం ధర 42,000**

భారీగా పెరుగుతుందని అంచనా

ఆగిన కమ్యూనిస్టు కలం

# సీనియర్ ఎడిటర్ రాఘవాచారి కన్నుమూత



2



పరంజ్యోతి

# హరిహరులకు ప్రీతికరం.. కార్తికం..!



తెలుగు మాసాల్లో ఒక్కో నెలకు ఒక్కో విశిష్టత ఉంది. ఇందులో కార్తికమాసం అత్యంత పవిత్రమైనది. ఈ నెలలో పూర్ణిమ రోజున చంద్రుడు కృత్తికా నక్షత్రం సమీపంలో తిరుగుతూ ఉండడం వల్ల ఈ మాసానికి కార్తికం అనే పేరు వచ్చింది. ఖగోళ విజ్ఞానంలో.. భూగోళ జీవరాశికి ఉన్న అవినాభావ సంబంధానికి కార్తికం ఒక అద్భుత ఉదాహరణ. శ్వేత వరాహకల్పపు వైవస్వత మన్వంతరంలో ఇది 28వ మహాయుగం. కృతయుగం వైశాఖ తదియ నాడు, త్రేతాయుగం కార్తిక శుద్ధ నవమి నాడు, ద్వాపరం భాద్రపద కృష్ణ త్రయోదశి నాడు, కలియుగం మాఘ పూర్ణిమ నాడు ప్రారంభమయ్యాయని ఖగోళ విజ్ఞాన వేత్తల ఉవాచ.

"న కార్తిక సమో మాసః" అని స్కాంధపురాణం చెప్పినట్లు.. కార్తికంతో సరితూగే నెల లేదు. శివకేశవులిద్దరికీ ఇష్టమైన నెల ఇది. ఈ మాసంలో మహా విష్ణువును తులసీ దళాలు, జాజి పూలతో.. పరమశివుడిని మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మారేడు దళాలు, జిల్లేడు పూలతో పూజిస్తే విశేష ఫలితం ఉంటుంది. ఆరుగురు కృత్తికలు తల్లులై పాలివ్వడంతో.. ఆరు ముఖాల కుమార స్వామిని కార్తికేయుడని అంటారు. ఆయన ఆధిపత్యం ఉన్న నెల కావడం వల్లే ఈ మాసానికి కార్తికం అని పేరు వచ్చింది. ఈ నెలలో కృత్తికా నక్షత్రం, బృహస్పతి గ్రహం, సోమవారం కలిసి వస్తే.. దాన్ని పరమ పవిత్ర దినంగా గుర్తించాలని వేదం ఘోషిస్తోంది. ఈ మాసంలో శుద్ధ చవితిని నాగుల చవితిగా, శుద్ధ ఏకాదశిని ఉత్థాన ఏకాదశిగా, ద్వాదశిని క్షీరాబ్ది ద్వాదశిగా.. చిలుక ద్వాదశిగా, పౌర్ణమిని కార్తిక పౌర్ణమిగా జరుపుకొంటాం. కార్తిక శుద్ధ చవితినాడు సూర్యోదయానికి ముందు ఆకాశంలో తూర్పు దిక్కున శేషుని నక్షత్ర రూపం కనిపిస్తుంది. ఇది సర్పాకారంలో ఉంటుంది. కాబట్టి.. నాగుల చవితిని జరుపుకొంటాం.

**నేటి నుంచి కార్తీకమాసం**

ఆశ్వయుజ బహుళ అమావాస్య (దీపావళి) నుంచే కార్తిక స్నానాన్ని ఆరంభించాలి. నెల రోజులూ కార్తిక స్నానం చేయడం వీలుకాని పరిస్థితుల్లో.. శుద్ధ ద్వాదశి, చతుర్దశి, పౌర్ణమి రోజుల్లోనైనా విధిగా ఆచరించాలి. ఈ మాసంలో పౌర్ణమి అత్యంత పుణ్యప్రదమైనది. ఈ మాసంలో ప్రతిరోజూ తెల్లవారు జామున నదీస్నానాలు, సముద్ర స్నానాలు చేస్తే సకల పాపాలు తొలగిపోతాయనేది భక్తుల నమ్మకం. గరళ కంఠుడైన పరమేశ్వరుడి తమోగుణ స్వభావాన్ని చంద్రుడు మాత్రమే హరించగలడు. అందుకే.. ఈ నెలలో సోమవారాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కార్తిక సోమవారాల్లో ఉపవాసం ఉండటం ఆనవాయితీ. ఈ నెలలో వెలిగించే దీపం కోటి పుణ్యాల ఫలాన్ని అందిస్తుంది. కార్తిక పౌర్ణమి రోజున చేసే దీపారాధన ఎన్నో రెట్ల పుణ్యాల ఫలాన్నిస్తుంది. ఈ మాసంలో దీపారాధన, దీపదానం స్వర్గలోకప్రాప్తిని కలిగిస్తుంది. వీటితోపాటు ఈ మాసంలో ఏకభుక్తం, నక్తం, అయాచితం, తిలదానం విధిగా పాటిస్తారు. వనాలలో ఉసిరి చెట్టు కింద సాలగ్రామ పూజ చేసి, వన భోజనాలు చేయడం పుణ్యఫలాలనిస్తుంది. ఈ నెలలో కార్తిక పురాణం చదివినా.. విన్నా మంచిది. ఆ పురాణంలో చెప్పిన విధులన్నింటినీ నెరవేరుస్తూ.. సత్సంగత్యంతో సర్వ మానవాళి తరించాలని ఆశిద్దాం.

- ఎస్.ఆర్.భల్లం, 9885442642

## లోకం తీరు




# ఆగిన కమ్యూనిస్టు కలం!

- సీనియర్ ఎడిటర్ రాఘవాచారి ఇక లేరు
- అస్వస్థతతో ఆస్పత్రిలో తుదిశ్వాస
- చంద్రబాబు, కేసీఆర్, నారాయణ సంతాపం
- వైద్య కళాశాలకు భౌతికకాయం అప్పగింత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తాను నమ్మిన సిద్ధాంతాలను త్రికరణ శుద్ధితో ఆచరిస్తూ, పత్రికా రచనను అసిధారా వ్రతంగా సాగించిన కమ్యూనిస్టు మేధావి కలం ఆగింది. ప్రముఖ పాత్రికేయులు, విశాలాంధ్ర దినపత్రికకు సుదీర్ఘకాలం ఎడిటర్‌గా పనిచేసిన చక్రవర్తుల రాఘవాచారి(81)ఇక లేరు. తీవ్ర అస్వస్థతతో సోమవారం ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో అంతిమ శ్వాస విడిచారు. కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల నిబద్ధతను కలిగి... జీవితాంతం వాటికే కట్టుబడి, ఒక విజ్ఞాన ఖనిగా ఆయన పేరుగాంచారు. 33 ఏళ్లపాటు విశాలాంధ్ర దినపత్రికకు సంపాదకుడిగా పనిచేసిన రాఘవాచారి పత్రికారంగంపై తనదైన ముద్ర వేశారు. ఆయనకు భార్య జ్యోత్స్న, కుమార్తె డాలీ ఉన్నారు. రాఘవాచారికి ఏడేళ్ల క్రితం కిడ్నీలకు కేన్సర్ సోకితే శస్త్రచికిత్స జరిగింది. ఇటీవల వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న ఆయన్ను స్థానిక సురక్షా ఆస్పత్రిలో చేర్పించారు. 20రోజులుగా చికిత్స పొందిన ఆయన సోమవారం తుది శ్వాస విడిచారు.





రాఘవాచారి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కె.నారాయణ, రామకృష్ణ, టీడీపీ అధినేత బాబు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్

### చిన్ననాటే పలు భాషలపై పట్టు

జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలో చక్రవర్తుల వెంకటవరదా చార్యులు-జానకమ్మ దంపతులకు 1939 సెప్టెంబరు 10న రాఘవాచారి జన్మించారు. ఆయనది జమీందారీ కుటుంబం. బాల్యంలో ఇంట్లోనే తెలుగుతోపాటు సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లిషు, తమిళం భాషలు నేర్చుకుని వాటిపై సాధికారత సంపాదించారు. రాఘవాచారి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఎస్సీ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 1963లో విద్యార్థి సంఘానికి అధ్యక్షుడయ్యారు. 1965లో సీపీఐ రాష్ట్రమండలి, రాష్ట్ర కార్యవర్గం, 1986లో జాతీయ కార్యవర్గానికి ఎన్నికయ్యారు. మోటూరి హనుమంతరావు రచనలు రాఘవాచారి వామపక్ష ఉద్యమంలో కార్యకర్తగా రాటుదేలడానికి తోడ్పడ్డాయి. 1965లో విశాలాంధ్ర విలేకరిగా చేరారు. పలు ఆంగ్ల పత్రికలకు కరెస్పాండెంటుగా పనిచేశారు. 1972 నుంచి 2005 వరకు విశాలాంధ్ర సంపాదకుడిగా పనిచేశారు. రాఘవాచారి ఉమ్మడి ఏపీ సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సేవలందించారు. రాఘవాచారి పుట్టింది తెలంగాణలోనే అయినా ఎక్కువకాలం విజయవాడలోనే గడిపారు. ఆయన మృతికి జర్నలిస్టు ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని మఖ్దూం భవన్‌కు తరలించారు. పలువురు ప్రముఖులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, జాతీయ కార్యదర్శి కె. నారాయణ, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. రాఘవాచారి మృతి పాత్రికేయ రంగానికి తీరనిలోటని ఏపీ మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన పార్థివదేహాన్ని సోమవారం విజయవాడలో విశాలాంధ్ర ఆఫీసుకు తీసుకెళ్లారు. అక్కడ పలువురు నేతలు, ప్రముఖులు నివాళి అర్పించాక, కుటుంబసభ్యుల కోరిక మేరకు భౌతికకాయాన్ని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించారు.

### బ్రాహ్మణీకంపై తిరుగుబాటు!

ఐదు దశాబ్దాలపాటు పాత్రికేయ వృత్తిలో కొనసాగిన రాఘవాచారిని 'నడిచే విజ్ఞాన ఖని'గా అందరూ భావిస్తారు. కమ్యూనిస్టు భావజాలాన్ని అణువణువునా నింపుకొన్న ఆయన తాను పుట్టిన బ్రాహ్మణ శ్రీవైష్ణవులలోని సంప్రదాయాలతో ఘర్షణ పడ్డారు. 1969లో ఆయన తండ్రికి చివరిసారిగా ఆబ్దికం పెట్టారు. ఇలాంటి వైదిక క్రతువులు పాటించబోనని శపథం చేసి పిలకను తీసేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన స్థానిక పూజారి గూటయ్య స్ఫూర్తితో రాఘవాచారి 15ఏళ్లలోనే వామపక్ష భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. తనకు వారసత్వంగా వచ్చిన 400 ఎకరాలను పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. న్యాయశాస్త్రం అభ్యసించిన రాఘవాచారికి రాజ్యాంగ వివాదాలను, రాజకీయ పరిణామాలను విశ్లేషించడంలో, సూటిగా సంపాదకీయాలు రాయడంలో ప్రత్యేక ఒరవడి ఉంది. ఆయన రాసే విశ్లేషణాత్మక సంపాదకీయాలను పాఠకులు ఎంతో ఆసక్తిగా చదివేవారు.

## 12వ తేదీలోగా అభిప్రాయాలు చెప్పండి

- రాజధానిపై ప్రజలకు జీఎన్ రావు కమిటీ పిలుపు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజధానితో సహా అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందేందుకు ఉపకరించే సలహాలు, సూచనలివ్వాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన జీఎన్ రావు కమిటీ... ప్రజాభిప్రాయాలను కోరుతోంది. అమరావతితో సహ రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న వివిధ ప్రణాళికలు, వాటి పురోగతి తదితరాంశాలను అధ్యయనం చేసి, ఒక సమగ్ర వ్యూహాన్ని ప్రభుత్వానికి సూచించే నిమిత్తం ఇందుకు ఉపక్రమించింది.

ఈ అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు ప్రజలకూ అవకాశం కల్పించాలని నిర్ణయించిన ఈ కమిటీ... అందుకు వచ్చే నెల 12వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. తమ సూచనలను 'డోర్ నంబర్ 56-15-53, వినాయక టెంపుల్ రోడ్, పటమట, విజయవాడ-520010' అనే అడ్రస్‌కు పోస్ట్ ద్వారా లేదా expertcommittee2019@gmail.com ద్వారా తమకు తెలియజేయాల్సిందిగా కమిటీ కన్వీనర్ జీఎన్ రావు కోరారు.

## కేంద్ర సర్వీసులకు ఆమ్రపాలి

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యువ ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి కేంద్ర కేబినెట్ సచివాలయంలో ఉప కార్యదర్శిగా నియమితులయ్యారు. నాలుగేళ్ల పాటు ఆమె పదవిలో కొనసాగనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ అదనపు కమిషనర్ పోస్టులో ఉన్న ఆమ్రపాలి కొంత కాలంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి వ్యక్తిగత కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. కిషన్‌రెడ్డి విజ్ఞప్తితో ఆమెను డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు పంపించాలని కేంద్రం కోరగా.. తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. అయితే, కేంద్రం నుంచి ఈ నియామక సమాచారం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వెళ్లింది. రాష్ట్ర విభజనలో ఆమ్రపాలి సహ పలువురు ఐఏఎస్‌లను ఏపీకి కేటాయించారు. కానీ వీరంతా కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ స్టేతో తెలంగాణలో కొనసాగారు. ఈ నేపథ్యంలో విభజన వివాదం తేలనందునే కేంద్రం ఏపీ సీఎస్‌కు సమాచారం అందించినట్లు అధికారులు వెల్లడించారు.

## 3న అల్పపీడనం

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల మూడవ తేదీన ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం వున్నదని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే దక్షిణ శ్రీలంక తీరానికి దగ్గరలో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది రాగల 24 గంటల్లో కొమరిన్ పరిసరాల్లో బలపడి 48 గంటల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం దానిని అనుకుని మాల్దీవులు, లక్షదీవుల ప్రాంతాల్లో వాయుగుండంగా మారే అవకాశం వుందని అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో కోస్తాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.



### జనాభా నియంత్రణ చట్టాన్ని ముస్లింలు పట్టించుకోరు

ఇద్దరు పిల్లలే ఉండాలన్న అసోం చట్టాన్ని ముస్లింలు పట్టించుకోరు. పిల్లలను కనడాన్ని కొనసాగిస్తారు. ముస్లింలకు ఉద్యోగాలు దూరం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. సచార్ కమిటీ నివేదిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్న ముస్లింలు దేశంలో 2% లోపే ఉన్నారు.

- మౌలానా బద్రుద్దీన్ అజ్మల్, ఎంపీ, ఏఐయూడీఎఫ్ అధినేత



### ఆ చట్టం లేకుండా 'హిందూత్వ'ను కాపాడలేం

జనాభా నియంత్రణ చట్టం లేకుండా దేశంలో వచ్చే 50 ఏళ్లలో 'హిందూత్వ'ను కాపాడలేం. జమ్మూకశ్మీర్‌లో సైన్యాన్ని దించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తలను చంపుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో ఇస్లామిక్ ఉగ్రవాదం పెచ్చరిల్లుతోంది.

- సురేంద్ర సింగ్, యూపీ బీజేపీ ఎమ్మెల్యే

### ఏ అంటే ఆపడం... పీ అంటే పడగొట్టడం

గతంలో ఏ అంటే అమరావతి, పీ అంటే పోలవరంగా ఆంధ్రప్రదేశ్ పేరు ఉండేది. జగన్ ప్రభుత్వంలో ఏ అంటే ఆపడం, పీ అంటే పడగొట్టడం. ఇది తప్ప వేరే కార్యక్రమాలు లేవు. ఇతర రాష్ట్రాల్లో వరద వచ్చినా లేని ఇసుక కొరత మన రాష్ట్రంలోనే ఎందుకొచ్చిందో సీఎంకే తెలియాలి. గ్రామ సచివాలయ ఉద్యోగాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

- కూచంపూడి శ్రీనివాస్, జనసేన

### పంటికి యాంటీ బయోటిక్స్ వొద్దు

వాషింగ్టన్: పంటి నొప్పి నుంచి ఉపశమనం పొందేందుకు సూక్ష్మజీవ నాశకాలు(యాంటీ బయోటిక్) బాగా వాడుతున్నారా? అయితే ఆ అలవాటును మానుకుంటే మంచిదని అమెరికన్ డెంటల్ అసోసియేషన్ నిపుణులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సూక్ష్మజీవ నాశకాలు వాడాలని.. నిత్యం వాడుతూపోతే సైడ్ ఎఫెక్ట్‌ల బారినపడాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. దంత సమస్యలు చుట్టుముడితే వైద్యచికిత్సకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అంటున్నారు. చల్లగా, తీయగా ఉండే సాఫ్ట్ డ్రింక్స్ ఎక్కువగా తాగేవారిలో దంతక్షయం సమస్యలు అధికంగా గుర్తించినట్లు లండన్‌లోని కింగ్స్ కళాశాల శాస్త్రవేత్తలు వెల్లడించారు.

### పెరుగు, పీచు పదార్థాలతో ఊపిరితిత్తుల కేన్సర్‌కు చెక్

పీచుతో కూడిన ఆహార పదార్థాలు, పెరుగును ఎక్కువగా తినేవారికి ఊపిరితిత్తుల కేన్సర్ ముప్పు అతి తక్కువని అమెరికాలోని వేండర్‌బిల్ట్ -ఇన్‌గ్రామ్ కేన్సర్ కేంద్రం శాస్త్రవేత్తలు వెల్లడించారు. వారు అధ్యయనంలో భాగంగా వివిధ దేశాలకు చెందిన 14 లక్షల మందిని ఐదు గ్రూపులుగా విభజించారు. వారు తీసుకునే ఆహారంలో పీచు పదార్థాలు, పెరుగు మోతాదు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేశారు. వాటి వాడకం అధికంగా ఉన్నవారిలో ఊపిరితిత్తుల కేన్సర్ ముప్పు 33 శాతం తగ్గడాన్ని గుర్తించారు. పెరుగు, పీచుపదార్థాల్లోని పోషక విలువలు జీర్ణాశయంలోని పేగుల్లో ఉండే గట్ బ్యాక్టీరియా సామర్థ్యాన్ని పెంచి.. గుండెజబ్బులు, కేన్సర్‌లు దరి చేరకుండా అడ్డుకుంటాయన్నారు.

## 13 కేజీబీవీల్లో ఇంటర్ గ్రూపుల మార్పులు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ) జూనియర్ కాలేజీల్లో ఇంటర్ గ్రూపుల్లో మార్పులు చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని నందిగం కాలేజీలో అకౌంట్స్ అండ్ టాక్సేషన్‌కు బదులుగా ఎంపీసీ గ్రూపు, ఇచ్ఛాపురం కాలేజీలో కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్‌కు బదులుగా సీఈసీ గ్రూపును, ఎల్.ఎన్.తోట కాలేజీలో ఫిజియోథెరఫీకి బదులుగా ఎంఎల్‌టీ గ్రూపును, సోంపేట కాలేజీలో సెరికల్చర్‌కు బదులుగా ఎంపీహెచ్‌డబ్ల్యు గ్రూపును నిర్వహిస్తారు. బొబ్బిలి కాలేజీలో ఎంఈసీకి బదులుగా ఎంపీహెచ్‌డబ్ల్యు గ్రూపును నిర్వహిస్తారు. విశాఖపట్నంలోని రాంబిల్లి కాలేజీలో ఎంపీసీకి బదులుగా ఎంఎల్‌టీ గ్రూపును, గోలుకొండ కాలేజీలో ఎంపీసీకి బదులుగా ఎంపీహెచ్‌డబ్ల్యు గ్రూపును నిర్వహిస్తారు. చిత్తూరులోని నిమ్మనపల్లి కాలేజీలో ఎంఈసీకి బదులుగా సీఈసీ గ్రూపును, పుంగనూరు కాలేజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇంజనీరింగ్‌కి బదులుగా ఎంఎల్‌టీ గ్రూపును నిర్వహిస్తారు. అనంతపురంలోని చిలమతూర్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌కు బదులుగా బైపీసీ గ్రూపును, హిందూపూర్ కాలేజీలో రిటైల్ మేనేజ్‌మెంట్‌కు బదులుగా బైపీసీ గ్రూపును, కూడేరు కాలేజీలో ఫిజియోథెరఫీకి బదులుగా బైపీసీ గ్రూపును, లేపాక్షి కాలేజీలో సెరికల్చర్‌కు బదులుగా బైపీసీ నిర్వహిస్తారు.

### తొలిసారిగా గిరిజనులకు ఆయుష్ పీజీ సీట్లు

- సీఎం చొరవతో న్యాయం: పుష్పశ్రీవాణి

ముఖ్యమంత్రి చొరవతో రాష్ట్రంలో తొలిసారిగా గిరిజనులకు ఆయుష్ పీజీ సీట్ల దక్కాయని ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ ఆయుష్ కళాశాలల్లో పీజీ సీట్లు ఉండగా వాటిలో మాత్రం ఎస్టీ విద్యార్థులకు ఇప్పటి దాకా సీట్లను కేటాయించే వారు కాదన్నారు. కానీ సీఎం జగన్ చొరవ తీసుకుని వారికి సీట్లు కేటాయించేలా చేశారన్నారు.

### 27,479 బీఈడీ సీట్లు ఖాళీ

బీఈడీ కాలేజీల్లో అడ్మిషన్లు భారీగా పడిపోయాయి. క్వాలిఫై అయిన అభ్యర్థులు సైతం అడ్మిషన్ తీసుకునేందుకు సుముఖంగా లేకపోవడం గమనార్హం. రాష్ట్రంలో వర్సిటీలు, ప్రైవేట్ రంగంలో కలిపి 466 బీఈడీ కాలేజీలు ఉండగా.. వాటిల్లో 32,054 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2019-20 విద్యా సంవత్సరానికి రెండు విడతలుగా నిర్వహించిన ఎడ్‌సెట్ కౌన్సెలింగుల అనంతరం కేవలం 4,575 సీట్లు(14.27%) భర్తీ అయ్యాయి.

### పౌరాణిక పాత్రలలో జీవించిన ఎన్టీఆర్!

- రామారావుపై 'అందని వాడు' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక పాత్రలకు ఎన్టీ రామారావు జీవం పోశారని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి ఎస్ వేణుగోపాలాచారి ప్రశంసించారు. నటనలోనే కాకుండా వ్యక్తిత్వంలో కూడా ఆయనకు ఎవరూ సాటి రారని చెప్పారు. ఎన్టీఆర్ పెట్టిన పార్టీతోనే తమలాంటి వారు ప్రజాప్రతినిధులమయ్యామని తెలిపారు. రవీంద్రభారతిలో సోమవారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో లంక నాగేంద్రరావు డా.ఎన్టీఆర్ విజయాలను ప్రస్తావిస్తూ రాసిన 'అందనివాడు'(అందరి గుండెల్లో కొలువైన వాడు) పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభలో వేణుగోపాలాచారి మాట్లాడుతూ, ఎన్టీఆర్‌తో సాన్నిహిత్యం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ డా.కె.లక్ష్మీనారాయణ, నటుడు సుబ్బరాయశర్మ, కనకపాక చౌదరినాయుడు, లంక వెంకట రమణమూర్తి, మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత నాగేంద్రరావును సత్కరించి అభినందించారు.

#### మెడికల్ షాపు నుంచి రచయితగా

శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన రచయిత లంక నాగేంద్రరావు స్వగ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ అంటే ఆయనకు అభిమానం, ఎన్‌టీఆర్ జీవిత విశేషాలతో 2010లో సరిలేరునీకెవ్వరు అనే పుస్తకాన్ని రచించారు. ఇది మంచి ఆదరణ పొందింది. ఆ తరువాత రాజకీయ, సినిమా పరంగా ఆయన కొన్ని రచనలు చేశారు. ఎన్టీఆర్ సాధించిన విజయాలను పుస్తక రూపంలో తేవాలన్న లక్ష్యంతో 'అందనివాడు' పుస్తకాన్ని రచించారు.

## తల్లి గుండెలపై కూర్చుని..

# మెడకు చున్నీ బిగించి..!

- చెడు తిరుగుళ్లు తిరగొద్దన్నందుకు దారుణంగా చంపిన కూతురు
- కారులో తీసుకెళ్లి రైలు పట్టాలపై పడవేత
- తండ్రిపైనే కేసు పెట్టిన కిలాడీ కూతురు

హైదరాబాద్ సిటీ/అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి ఇంటికి వచ్చింది! తల్లిని బలవంతంగా లోపలి గదిలోకి లాక్కెళ్లింది! ఆమె మెడకు తన చున్నీతో ఉరి బిగించి కిందపడేసింది. కాళ్లూ చేతులూ ప్రియుడు గట్టిగా పట్టుకుంటే.. తల్లి గుండెలపై కూర్చుని, చున్నీని గట్టిగా బిగించి దారుణంగా హత్య చేసింది! మూడు రోజులపాటు శవాన్ని ఇంట్లోనే ఉంచి ప్రియుడితో గడిపింది. 'చెడు తిరుగుళ్లు తిరగొద్దమ్మా.. కుటుంబానికి అపకీర్తి తీసుకురావద్దమ్మా' అని అన్నందుకు గుండెలపై ఎత్తుకుని పెంచిన తల్లిని ఓ కూతురు చంపిన విధానమిది! ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునగనూరులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా రామన్నపేట మండలం నీర్నాములకు చెందిన పల్లెర్ల శ్రీనివాస్‌రెడ్డి-రజిత దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మునగనూరులో స్థిరపడ్డారు. శ్రీనివాస్ రెడ్డి లారీ డ్రైవర్. వారికి ఒక్కగానొక్క కూతురు కీర్తి. ఎంతో గారాబంగా చూసుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆమె బీఎస్సీ బయో కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతోంది.

### దారి తప్పొద్దమ్మా అన్నందుకు..

కీర్తి గతంలో అదే ప్రాంతానికి చెందిన యువకుడితో ప్రేమాయణం నడిపినట్లు తెలుస్తోంది. అతనితో చెట్టపట్టాల్ వేసుకొని తిరగడంతో రెండు కుటుంబాల్లో గొడవలు జరిగినట్లు తెలిసింది. ఇద్దరూ ఒకే కులానికి చెందినవారు కావడంతో పెద్దలు సర్దుబాటు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే, ఇటీవల తన కూతురు ప్రవర్తనపై తల్లికి అనుమానం వచ్చింది. భయంతో ఆరా తీస్తే వాళ్ల ఇంటికి సమీపంలోనే ఉంటున్న శశి అలియాస్ చంటితో కలిసి తిరుగుతున్నట్లు తెలిసింది. కూతురు భవిష్యత్తుపై బెంగ పెట్టుకున్న తల్లి.. కీర్తిని నిలదీసింది. "వద్దమ్మా..! అలా చేయొద్దు..! దారి తప్పొద్దమా..! మాకు కీర్తి ప్రతిష్ఠలు తేకపోయినా పర్వాలేదు.. అపకీర్తి మూటగట్టుకోవద్దు.. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు' అని హితవు పలికింది. చెడు తిరుగుళ్లు తిరగొద్దని హెచ్చరించింది. తల్లి మాటలను కీర్తి పెడచెవిన పెట్టింది. అంతేనా.. తన ప్రేమకు తల్లే అడ్డుగా ఉందని భావించింది. ఆమెపై కసి పెంచుకుంది. తల్లిని హత్య చేయాలని పథకం వేసింది. ఈనెల 19న తండ్రి విధులకు వెళ్లగానే.. ప్రియుడితో కలిసి కీర్తి ఇంటికి వచ్చింది. తల్లి కాళ్లూ చేతులను ప్రియుడు గట్టిగా పట్టుకుంటే, ఆమెపై కూర్చుని చున్నీ బిగించి మరీ దారుణంగా హత్య చేసింది. తల్లి శవాన్ని 3 రోజులపాటు ఇంట్లోనే ఉంచి ప్రియుడితో గడిపింది. శవం దుర్వాసన వస్తుండటంతో ఎక్కడైనా పడేయాలని భావించారు. శశి బయటకు వెళ్లి ఎర్టిగా కారు తీసుకొచ్చాడు. ఈనెల 22న కారులో తల్లి శవాన్ని తీసుకొని సొంత మండలం రామన్నపేటకు 6 కిలోమీటర్ల దూరంలోని తుమ్మలగూడెం తీసుకెళ్లింది. అక్కడ రైలు పట్టాలపై పడేసి తిరిగి నగరానికి చేరుకున్నారు.



రజిత (ఫైల్ ఫొటో)



కీర్తి

### బయట పడింది ఇలా..!

కీర్తి తండ్రి శ్రీనివాస్ రెడ్డి విధులకు వెళ్లి వారానికో సారి ఇంటికి వచ్చేవాడు. అలా ఇంటికొచ్చిన శ్రీనివాస్ రెడ్డికి ఇంటికి తాళం కనిపించింది. భార్యకు ఫోన్ చేస్తే లిఫ్టు చేయడం లేదు. కీర్తికి ఫోన్ చేస్తే విహార యాత్రకు విశాఖ వెళ్లానని చెప్పింది. తల్లి గురించి అడగగా తెలియదని చెప్పింది. దాంతో, శ్రీనివాస్ రెడ్డి ఊళ్లోనే ఉంటున్న తోడల్లుడు కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లాడు. కీర్తి మాటలపై అనుమానం వచ్చిన కృష్ణారెడ్డి ఆమెను నిలదీశాడు. కాలేజీకి వెళ్లి తెలుసుకుంటానని బెదిరించాడు. దాంతో రెండు రోజుల్లో వస్తున్నానని చెప్పి ఈనెల 26న బాబాయ్ ఇంటికి వచ్చింది. అమ్మ ఎక్కడికి వెళ్లింది? ఏమైంది? అని గద్దించగా పొంతన లేని సమాధానాలు ఇచ్చింది. విహార యాత్రకు కాలేజీ తరపున వెళ్లానని ఒకసారి, ఫ్రెండ్స్‌తో వెళ్లానని ఒకసారి చెప్పింది. అమ్మ దగ్గర రూ.2 వేలు తీసుకొని వెళ్లానని చెప్పడంతో వారి అనుమానం బలపడింది. వైజాగ్ వెళ్లి రావడానికి రూ.2 వేలు ఎటూ సరిపోవంటూ గట్టిగా నిలదీయడంతో.. ప్లేట్ మార్చి నెపం తండ్రిపై నెట్టింది. నాన్న తాగొచ్చి అమ్మతో గొడవ పడ్డాడని, దాంతో, ఇంట్లోంచి వెళ్లిపోయిందని చెప్పింది. బాబాయ్‌ని తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తండ్రిపై ఫిర్యాదు చేసింది. అయితే, శ్రీనివాస్ రెడ్డి, రజిత అన్యోన్యత గురించి కుటుంబ సభ్యులందరికీ తెలుసు. వారి మధ్య గొడవలు, కొట్లాటలు ఏవీ లేవని కూడా తెలుసు. వారికి కీర్తిపైనే అనుమానం బలపడింది. దాంతో ఏం చేశావో చెప్పాలని, కనీసం శవాన్నైనా చూపించాలని మేనమామలు, తండ్రి, బాబాయ్ నిలదీశారు. అప్పుడు నోరు విప్పిన కీర్తి.. తల్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని మరో కట్టుకథ చెప్పింది. "ఆత్మహత్య చేసుకుంటే శవం ఏమైంది? నువ్వు ఎక్కడున్నావ్? మాకెందుకు చెప్పలేదు?" అంటూ మేనమామలు గద్దించారు. అమ్మ చనిపోవడంతో భయమేసి, తన స్నేహితుడు చంటిని పిలిచి, కారులో తీసుకెళ్లి పడేశానని చెప్పింది. పొంతన లేని మాటలు చెబుతుండడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. తమదైన శైలిలో ప్రశ్నించడంతో కీర్తి తన నేరం అంగీకరించింది.

### అమెరికాకు పంపించాలని..

శ్రీనివాస్ రెడ్డి, రజిత దంపతులకు కీర్తి ఒక్కతే సంతానం. ఆమెను అల్లారు ముద్దుగా పెంచారు. తమ బంధువుల పిల్లలు చాలామంది అమెరికాలో ఉండటంతో.. కీర్తిని కూడా పెద్ద చదువులు చదివించి మంచి అమెరికా సంబంధం చూసి పెళ్లి చేయాలని కలలు కన్నారు. తమ కూతురు కూడా అమెరికాలో ఉంటోందని గొప్పగా చెప్పుకోవాలని ఆ తల్లి మనసులో ఎంతో ఆరాటపడేది. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న భర్త సంపాదనను పోగేసింది. 150 గజాల స్థలాన్ని కొని ఇల్లు కట్టింది. ఏడాదిలో కూతురు చదువు అయిపోగానే ఉన్నత చదువులకు అమెరికా పంపాలని కలలుకంది. ఇలాంటి తరుణంలో.. తన గారాల కూతురే తనని ఇంత దారుణంగా చంపేస్తుందని ఊహించలేదు ఆ తల్లి.

# భర్తీ బాధ్యత ఎవరిది?

- గ్రామ సచివాలయ నియామకాలు చేపట్టేందుకు ఏపీపీఎస్సీ, పంచాయతీరాజ్ శాఖల విముఖత

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేసే బాధ్యత ఎవరికి ఇవ్వాలన్న విషయంలో మీమాంస కొనసాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం... ఈ పోస్టుల నియామకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇటీవల వీటిని పంచాయతీరాజ్ శాఖ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి జిల్లాలవారీగా నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రశ్నపత్రం రూపొందించే బాధ్యతను ఏపీపీఎస్సీకి అప్పగించింది. అయితే... ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయన్న ఆరోపణలు వచ్చాయి. గ్రామ సచివాలయాల్లో 1,34,000 పోస్టులకు పరీక్షలు నిర్వహించగా, కొందరు ఉద్యోగాల్లో చేరకపోవడం, మరికొన్ని పోస్టులకు అర్హులు లేకపోవడంతో దాదాపు 25వేల ఉద్యోగాలు మిగిలిపోయాయి. ఈ ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వం ఇప్పుడు భావిస్తోంది. ఇందుకు మళ్లీ పరీక్షలు నిర్వహించాలి. అయితే.. ఈ పరీక్షల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ సుముఖత వ్యక్తం చేయడం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీపీఎస్సీ కూడా పరీక్ష ప్రశ్నావళిని సిద్ధం చేసేందుకు ముందుకు రావడం లేదని వెల్లడిస్తున్నాయి. దీంతో.. జిల్లాస్థాయిలోనే కలెక్టర్ చైర్మన్‌గా ఖాళీలు భర్తీ చేసే అవకాశాన్ని ప్రత్యామ్నాయంగా పరిశీలిస్తున్నామని పేర్కొంటున్నాయి.

# హైందవానికి ప్రమాదం లేదు

- ఆ రోజుల్లో చినజీయర్‌కు కారు డ్రైవర్‌గా పనిచేశా: కేసీఆర్
- ముచ్చింత్‌లో తిరునక్షత్ర వేడుకలకు హాజరైన సీఎం
- బక్కవాడైనా సీఎం ధైర్యస్తుడు : జీయర్ స్వామి


స్వామివారి ఆశీస్సులు తీసుకుంటున్న కేసీఆర్ కుటుంబ సభ్యులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 28: "హైందవ సంస్కారం చాలా గొప్పది. హిందూ మతానికి, హైందవ సంప్రదాయానికి వచ్చే ప్రమాదం ఏమీ లేదు. హైందవం చాలా బలంగా ఉంది. ఎలాంటి ఢోకా లేదు. ఒకవేళ విఘాతం కలిగినా కాపాడడానికి చినజీయర్ స్వామి లాంటి వాళ్లు ఎంతో మంది ఉన్నారు" అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. నగర శివార్లలోని ముచ్చింతల్‌లో త్రిదండి చినజీయర్ స్వామి ఆలయంలో సోమవారం తిరునక్షత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుణ్ని పూజించే సంస్కారం తనకు తల్లిదండ్రుల నుంచే వచ్చిందని చెప్పారు. హైందవ సంస్కారాలు చాలా గొప్పవన్నారు. హైందవ ధర్మానికి ఢోకా ఉండదని.. ఎప్పటికప్పుడు జీయర్‌స్వామి లాంటి మహాత్ములు వస్తుంటారని తెలిపారు. ఎంతటి వారైనా ఎప్పుడో ఒకప్పుడు దేవుని వైపు మళ్లుతారని సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే గురువారెడ్డి గురించి చెప్పారు. గురువారెడ్డి కమ్యూనిస్టుగా ఉండేవారని, చివరికి ఆయన రామాలయాన్ని నిర్మించారని గుర్తు చేశారు. దేవాలయం అంటే కమ్యూనిటీ సెంటర్ అని చెప్పారు. యాదాద్రిని ఉత్తమ పుణ్య క్షేత్రంగా తీర్చిదిద్దుతామని సీఎం చెప్పారు. యాదాద్రి ప్రధాన ఆలయ నిర్మాణం పూర్తికావస్తోందని వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని వెల్లడించారు. చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో 1008 కుండలతో 'మహాసుదర్శన యాగం' జరిపిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైష్ణవ పీఠాల అధిపతులందరినీ ఆహ్వానిస్తామని చెప్పారు. ముచ్చింతల్‌లోని అతి పెద్ద రామానుజస్వామి విగ్రహావిష్కరణలో కూడా తాను పాల్గొంటానని, ఓ సాధారణ కార్యకర్తగా వస్తానని తెలిపారు. బీబీనాంచారమ్మ జన్మ వృత్తాంతం గొప్పదని, ఇది అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు.

### అప్పుడు స్వామి కారు నడిపా..

1986కి ముందు తనకు చినజీయర్ స్వామితో పరిచయం లేదని, 1986-87లోనే ఆయనతో పరిచయమైందని కేసీఆర్ తెలిపారు. 1986-87లో సిద్దిపేటలో బ్రహ్మయజ్ఞం కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వామీజీ వచ్చారని, అప్పుడు ఆయనతో పరిచయం జరిగిందని చెప్పారు. ఆ సమయంలో సమీపంలో బ్రాహ్మణ పరిషత్ లేకపోవడంతో స్వామీజీ ఎక్కడ బస చేయాలనేదానిపై చర్చ జరిగిందన్నారు. గ్రామస్థుల సూచన మేరకు తమ ఇంట్లోనే బస ఏర్పాటు చేశామని తెలిపారు. ఏడు రోజుల పాటు తమ ఇంట్లో ఉన్నారని, అప్పుడు తాను స్వామీజీ కారు నడిపానని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. అలా స్వామీజీతో కొద్ది రోజులు గడిపే అవకాశం కలిగిందని, ఆయన అనుగ్రహ భాషణలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. రామానుజాచార్యుల వారి అతిపెద్ద విగ్రహం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం మన అదృష్టమన్నారు. ఈ దివ్యక్షేత్రం ఏర్పాటులో రామేశ్వర్‌రావు కృషిని పొగడకుండా ఉండలేనన్నారు.

### నాది బాల్య వివాహం

తనది బాల్య వివాహమని, 14వ ఏటనే వరంగల్ జిల్లా చిత్తలూరులో తన పెళ్లి జరిగిందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఆ రోజుల్లో గురువులు తమ ప్రాంతానికి వస్తే అందరికీ పండగేనని చెప్పారు. తమ ఇంట్లో అతిథులుగా ఉంటూ గ్రామస్థులందరికీ భారతం, భాగవతం బోధించే వారని తెలిపారు. వారే తమను సంస్కారవంతులుగా తీర్చిదిద్దారన్నారు. చిన్ననాటి నుంచి వైష్ణవ సంప్రదాయంలోనే పెరిగామని, అప్పటి నుంచే తమలో ఆ భక్తి పరంపర కొనసాగుతోందని చెప్పారు.

### సీఎంకు అపారమైన భక్తి: చినజీయర్

సీఎం కేసీఆర్ దంపతులను చిన జీయర్ స్వామి ఘనంగా సన్మానించారు. బక్కవాడైన సీఎం కేసీఆర్ ధైర్యవంతుడని కొనియాడారు. ఎన్నో అద్భుత కార్యక్రమాలు చేపట్టి రాజకీయంగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని ప్రశంసించారు. రాజకీయాల్లో ఉన్న వారు దేవుని గురించి మాట్లాడడానికి సిగ్గుపడతారని, కేసీఆర్ మాత్రం అపారమైన భక్తి కలిగిన వ్యక్తి అని చినజీయర్ పేర్కొన్నారు. యాదాద్రి క్షేత్రాన్ని భారతదేశానికే తలమానికంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. పీఠాధిపతుల సమక్షంలో తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. వేదాలకు ఎంతో శక్తి ఉందన్నారు. వేదాలు చదివిన వారు గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ సతీమణి, మనవడితో పాటు రాజ్యసభ సభ్యుడు జి.సంతోష్‌కుమార్, మైహోం గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, పలువురు వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మైసూర్ దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామి, శ్రీ కమలానంద భారతి స్వామి, శఠగోప రామానుజ జీయర్ స్వామి, వ్రతధర రామానుజ జీయర్‌స్వామి చిన జీయర్‌ను ఆశీర్వదించారు. మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, జూపల్లి రామేశ్వర్‌రావు మంగళాశాసనాలు అందుకున్నారు. సామాజికంగా విశిష్ట సేవలందించిన వారికి ఏటా పెద్దజీయర్‌స్వామి పేరిట ఇస్తున్న జీయర్ పురస్కారాలను ఈ ఏడాది తిరుపతికి చెందిన మద్దులపల్లి సూర్యానారాయణ, పురుషోత్తములాచార్యులకు అందజేశారు.

# త్వరలో సామూహిక మరుగుదొడ్లు

- దేశవ్యాప్తంగా 'స్వచ్ఛ సౌచాలయ'
- 1 నుంచి రెండు నెలలపాటు నిర్వహణ

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణంపై కేంద్రం దృష్టి సారించింది. స్వచ్ఛభారత్ ఉద్యమంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. నవంబరు 1 నుంచి డిసెంబరు నెలాఖరులోపు స్వచ్ఛ సుందర సముదాయక సౌచాలయ ప్రచార ఉద్యమాన్ని ప్రతి రాష్ట్రంలోనూ ప్రారంభించాలని కేంద్ర తాగునీటి, పారిశుధ్య మంత్రిత్వశాఖ లేఖలు రాసింది. ప్రతి గ్రామంలో కనీసం ఒక సామూహిక మరుగుదొడ్డి నిర్మించి, పెయింటింగులు వేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా 6 లక్షల గ్రామాల్లో ఈ ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించాలని పేర్కొంది. ఈ రెండు నెలల తర్వాత గ్రామాల్లో చేపట్టిన సామూహిక మరుగుదొడ్ల కార్యక్రమాలకు సంబంధించి అవార్డులు ప్రదానం చేస్తారు. సామూహిక మరుగుదొడ్ల వినియోగించడం, మరుగుదొడ్లను అందంగా తీర్చిదిద్దిన వాటికి ప్రాధాన్యతాపరంగా మార్కులు ఇచ్చి అవార్డులకు ఎంపిక చేస్తారు. ప్రతి గ్రామానికీ కనీసం ఒక మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దానిపై స్వచ్ఛభారత్ సమాచారాన్ని రాస్తారు. జాతీయస్థాయి అవార్డులతో పాటు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నారు. జిల్లా కలెక్టర్లు వ్యక్తిగతంగా ఈ ఉద్యమాన్ని పర్యవేక్షించాలని కేంద్రం ఆదేశించింది.






# ఆదర్శం, అక్షరం

సీనియర్ పాత్రికేయుడు, సంపాదకుడు సి. రాఘవాచారి నిష్క్రమణ, వెళ్లిపోతున్న తరం గురించిన బెంగను మరింతగా పెంచుతున్నది. పెద్దలు తాము సార్థకజీవులై, అనంతర తరానికి తమ జ్ఞానాన్ని విలువలను అందించి, కాలధర్మం చెందడం సహజం. కానీ, ఆ విలువలను అనంతర సమాజం అందిపుచ్చుకోలేనప్పుడు, వాటిని ఆదర్శాలుగా స్వీకరించనప్పుడు ఆ వియోగం రెండింతలవుతుంది. పాత్రికేయులు, సంపాదకులు పాటించవలసిన కొన్ని సార్వకాలీన ధర్మాలకు, ముట్నూరు కృష్ణారావు, ఖాసా సుబ్బారావు, మానికొండ చలపతిరావు, నార్లవెంకటేశ్వరరావుల లాగానే రాఘవాచారి కూడా నిబద్ధుడు. కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా ఉండే దిన పత్రిక సంపాదకుడే అయినా, ఆయన పార్టీ విధేయతతో పాటు, తన స్వభావంలో ఉండే అనేక సుగుణాలను కూడా పత్రికారచనలో ప్రదర్శించారు. వినమ్రత, నిరాడంబరత, అధ్యయనశీలత, అవగాహన– ఈ నాలుగింటికి రాఘవాచారి పెట్టింది పేరు.

తెలంగాణలో భూస్వామ్యం ఊడలుదిగిన నాటి గ్రామీణ వరంగల్ జిల్లాలో 80 ఏళ్లకిందట పుట్టి, కష్టజీవుల జీవన్మరణపోరాటాలను చిన్నతనంలోనే కళ్లారా చూసి, అక్షరాలలోను, ఆచరణలోను ఉద్యమాలను ఒంటపట్టించుకున్న వ్యక్తి రాఘవాచారి. విద్యార్థి ఫెడరేషన్‌లో రాటు దేలి, తరువాత పార్టీలో చేరి, సిపిఐ ఇంగ్లీషుపత్రిక 'పేట్రియాట్'కు హైదరాబాద్ కరస్పాండెంట్‌గా పనిచేసి, ఆ తరువాత 'విశాలాంధ్ర'లో అడుగుపెట్టారాయన. అతి తొందరలోనే ఆ పత్రికకు సంపాదకులయ్యారు. 28ఏళ్ల పాటు సంపాదకత్వం నిర్వహించారు. ఏ విషయం మీద మృదువుగా స్పందించాలో, ఏ విషయంలో దృఢంగా ఉండాలో పార్టీయే నిర్దేశిస్తూ ఉండవచ్చును కాక, ఆయన స్పందనలో సాధారణ విలువ మాత్రం, విషయాధార విమర్శ. వ్యక్తులను కించపరిచే ధోరణికి ఆయన వ్యతిరేకం. విధానాల మీదనే వ్యతిరేకత, పోరాటం తప్ప, వ్యక్తి దూషణ ఆయన విలువ కాదు. అలవోక విమర్శతో వ్యాఖ్య రాయడం కాదు, తగిన నేపథ్య సమాచారం, అవగాహన జోడించి పాఠకుల చైతన్యస్థాయిపెంచే సంపాదకీయాలు రాయడం ఆయనకు ఇష్టం. అలాగని, అసందర్భ పాండిత్య ప్రదర్శన గిట్టదు. ఎంఎస్ సుబ్బులక్ష్మి మీద సంపాదకీయం రాసినప్పుడు కానీ, రాఘవాచారికి అంతటి సంగీత పరిజ్ఞానం ఉన్నదని ఎవరికీ తెలియలేదు. అట్లాగే, బమ్మెరపోతన మీద ఆయన రాసిన సంపాదకీయం కూడా సుప్రసిద్ధం. తెలుగు సాహిత్యంతో రాఘవాచారికి ఉన్న సాన్నిహిత్యం ఆ సంపాదకీయం చెబుతుంది.

రాఘవాచారిది అసాధారణ ధారణాశక్తి అని ఆయన మిత్రులు చెబుతారు. గ్రంథాలు అధ్యయనం చేయడంలో కానీ, సమకాలిక అంశాలను పరామర్శించడంలో కానీ, ఆయన వేగాన్ని అందుకోవడం కష్టమట. అటువంటి రచయిత పాత్రికేయ, ఇతర రచనలు ప్రత్యేకంగా పుస్తకాల రూపంలో రాకపోవడం విచారకరం. తన రచనలు, సంపాదకీయాలను పుస్తకరూపంలోకి తెచ్చే ప్రతిపాదనలు వచ్చినప్పుడల్లా, ఆ పని తన మరణానంతరం చేయాలని అనేవారట రాఘవాచారి. ఇప్పుడైనా ఆయన సంకలిత రచనల పుస్తకాలు వస్తే, సాధారణ పాఠకులకు, పాత్రికేయ విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

"పాత్రికేయులు కూడా సమాజంలో పౌరులే. వారికే కొమ్ములూ లేవు. అందరిలాగే వారు కూడా సమాజాన్ని పీడించే రుగ్మతలకు లోనవుతుంటారు... సమాజంలో పౌరులందరికీ సమాజాభివృద్ధి పట్ల కర్తవ్యాలు బాధ్యతలు ఎలా వున్నాయో పాత్రికేయులకు కూడా సమాజం పట్ల అట్లాగే కర్తవ్యాలూ, బాధ్యతలూ వున్నాయి. సూపర్ సిటిజన్స్‌గా ప్రవర్తించే వైఖరి విడనాడాలి.." తన సొంత వృత్తి రంగాన్ని కూడా రాఘవాచారి విమర్శా దృష్టి వదలలేదు. కొత్త తరం పాత్రికేయులలో, రచయితలలో అధ్యయనం కొరవడుతున్నదని, పెద్ద పరిజ్ఞానం లేకుండా పైపైన రాయవచ్చుననే ధోరణి పెరుగుతున్నదని ఆయన ఆవేదన చెందేవారు. మతతత్వం అంటే రాఘవాచారికి అసలు సహించదు. రానురానుదేశంలో పెరుగుతున్న ఛాందసవాదం ఆయనకు కలవరం కలిగించేది. అట్లాగే కులతత్వం కూడా. తాను పుట్టిన శ్రీవైష్ణవ కుటుంబాలలో అంటు–ముట్టు పాటించడం చూసి, అగ్రకులత్వం మీద ఏవగింపు పెంచుకున్నరాఘవాచారి, తానుస్వయంగా కులాంతర వివాహం చేసుకున్నారు, సంతానానికీ చేశారు.

రాఘవాచారికి ప్రథమ ప్రాధాన్యం కమ్యూనిస్టు పార్టీకి విధేయత. ఆ తరువాతే, సంపాదక వృత్తి బాధ్యత. అందువల్ల తన సొంతపార్టీ మీద విమర్శలను ఆయన సంపాదకీయాలలో, రచనలలో చదవలేము. ఆయన పార్టీ విధేయత కూడా ఎవరో నాయకులతో ముడిపడినది కాదు. రాఘవాచారిని సిపిఐలోకి ఆకర్షించిన మొహిత్ సేన్ వేరే పార్టీ పెట్టినా, ఆయన మాత్రం పార్టీని వీడలేదు. సిపిఎంతోను, విప్లవ వామపక్ష పార్టీలతోనూ ఆయనకు గట్టి రాజకీయ విభేదాలే ఉన్నాయి. అయితే, విభేదాలతో నిమిత్తంలేని మానవ సంబంధాలను నెరపగలిగిన ప్రజాస్వామిక స్నేహశీలి ఆయన.

## మూడో కన్ను




మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుని శాసిస్తున్న శివసేన

© అలోక్

---

**కుల చిచ్చు, మత కల్లోలాలు, ప్రాంతీయ ఉద్యమాలు, కుటుంబ పాలన వంటి సకల జాడ్యాలు కాంగ్రెస్ హయాంలోనే పెచ్చరిల్లాయి. ఓటు బ్యాంకును పెంచుకునేందుకు కుల, మత ప్రాంతీయ శక్తులను, అరాచక శక్తులను కాంగ్రెస్ పెంచి పోషించింది. ఆ పార్టీ తప్పిదాల మూలంగా ఆవిర్భవించిన అనేక ప్రాంతీయ పార్టీలూ అవే దారుణాలకు పాల్పడ్డాయి. మన మాతృదేశాన్ని సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా సమైక్యపరిచి ఆరోగ్యకరంగా అభివృద్ధి చేయాలంటే ప్రాంతీయ విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం అత్యవసరం.**

# సర్దార్ స్వప్నం–మోదీ సాకారం

**సత్యకాలమ్**



■ వై. సత్యకుమార్

భారత దేశం ఒక్కటిగా ఉండాలని, ఈ దేశంలో భారతీయతే ప్రాతిపదికగా అన్ని వర్గాలు ఒక్క త్రాటిపై నిలవాలని, భారతీయులంతా ఐక్యమత్యంతో మెలగాలని, మన సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుకోవాలని, విచ్ఛిన్నకర శక్తులను అణిచివేయాలని దేశంలో ఏ రాజకీయ పార్టీ అయినా మనస్ఫూర్తిగా భావిస్తున్నదంటే అది భారతీయ జనతా పార్టీ మాత్రమే. నిజానికి ఈ విలువలన్నీ మన ఇతిహాసాల్లోనూ, మన రాజ్యాంగ సూత్రాల్లోనూ చెప్పుకునప్పటికీ ఈ దేశాన్ని కొన్ని దశాబ్దాల పాటు ఏలిన కాంగ్రెస్, ఆ పార్టీని అనుసరించి పుట్టిన ఇతర పార్టీలు వాటిని పూర్తిగా విస్మరించాయి. అందుకే 2014లో బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రాగానే అక్టోబర్ 31న సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ పుట్టిన రోజును 'జాతీయ ఏకతా దినం'గా పాటిస్తున్నట్టు ప్రకటించింది. దేశ సమైక్యత, సమగ్రత, భద్రతకు ఏర్పడే ముప్పులను ఎదుర్కోవడానికి మనం కలిసికట్టుగా ఐక్యం కావాలన్న ఆలోచనను బలోపేతం చేసేందుకు ఈ జాతీయ ఏకతా దినం ప్రేరణ కలిగిస్తుందని ప్రధాన మంత్రి మోదీ భావించారు. నిజానికి స్వతంత్ర భారత తొలి హోంమంత్రిగా ఉన్న పటేల్ దూరదృష్టితో వ్యవహరించి దేశంలోని 562 సంస్థానాలను విలీనం చేయకుండావుంటే ఈ దేశం ఎన్నో ముక్కలుచెక్కలై ఉండేది. గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయాన్ని, హైదరాబాద్‌లోని చార్మినార్‌ను చూసేందుకు కూడా భారతీయులు వీసా తీసుకోవాల్సి వచ్చేదని మోదీ గత ఏడాది పటేల్ జయంతినాడు ప్రపంచంలో అతి ఎత్తైన పటేల్ విగ్రహాన్ని జాతికి అంకితం చేసిన సందర్భంగా మాట్లాడుతూ అన్నారు.

సర్దార్ పటేల్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకున్నందువల్లే అధికారంలోకి వచ్చిన తర్వాత పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో ఊరుకోకుండా దేశాన్ని సమైక్యం చేసేందుకు మోదీ ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ నినాదాన్ని ఆదర్శంగా తీసుకున్న మోదీ మొత్తం ఈశాన్య రాష్ట్రాలను భారత్ అక్కున చేర్చుకునేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకున్నారు. గత ఐదేళ్లలో నాగాలాండ్‌లో తిరుగుబాటుదారులు లేవనెత్తిన సమస్యలన్నీ దాదాపు పరిష్కారమయ్యేలా చూశారు. మోదీ అధికారంలోకి రాగానే ఆయన సమక్షంలో నాగాలాండ్‌లోని జాతీయ సోషలిస్టు కౌన్సిల్ శాంతి ఒప్పందంపై సంతకాలు చేసింది. కాంగ్రెస్ హయాంలో దాదాపు 35–40 ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన నాగా సమస్య మోదీ హయాంలో ఆరేళ్లలో పరిష్కారానికి అతి చేరువలో ఉన్నది.



*(అక్టోబర్ 31న పటేల్ జయంతి)*

నాగాలాండ్ విషయంలోనే కాదు, మొత్తం ఈశాన్యంలోని అన్ని రాష్ట్రాలను భారత్‌తో అనుసంధానం చేసేందుకు మోదీ అధికారంలోకి వచ్చాక చిత్తశుద్ధితో వేగంగా ప్రయత్నాలు జరిగాయి. నిజానికి అటల్ బిహారీ వాజపేయి హయాంలో ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పర్చి అక్కడి ప్రజలు భారత దేశంలోని ఇతర ప్రజలతో మమేకమయ్యేలా చేసే ప్రయత్నాలు ప్రారంభమయినప్పటికీ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ కృషిని నీరు కార్చాయి. మళ్లీ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈశాన్య ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడమే కాక, ఆ రాష్ట్రాల్లో ఆర్థిక వ్యవస్థ మెరుగుపడేందుకు, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన; పరిశ్రమ, సంస్కృతి రంగాల్లో అభివృద్ధి వేగవంతమయ్యేందుకు అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఫుడ్ పార్కులు, జౌళి పరిశ్రమ, ఐటి రంగాల్లో ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అస్సోంలోని బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతి పొడవైన రైలు రోడ్డు వంతెనను మోదీ ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజలకు రైల్వే సదుపాయాలు సౌకర్యవంతంగా మార్చేందుకు 900 కిమీ మేరకు పట్టాలను బ్రాడ్ గేజ్‌గా మార్చారు. ప్రత్యేక రహదారుల సత్వర అభివృద్ధి క్రింద ఈ ప్రాంతంలో రూ.60వేల కోట్లతో 3800కిమీ మేరకు జాతీయ రహదారులనుచేపట్టడమేకాక భారత్ మాల ప్రాజెక్టు క్రింద రూ.30వేల కోట్లు కేటాయించారు. ఈశాన్య ప్రాంతంలో విమానాల రాకపోకలు వేగంగా జరిగేందుకు అనేక ప్రాజెక్టులను చేపట్టారు. పెద్ద ఎత్తున జల విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించారు. మణిపూర్‌లో జాతీయ క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడమే కాక ఆ రాష్ట్ర బాక్సింగ్ క్రీడాకారిణి మేరీ కోమ్‌ను రాజ్యసభకు నామినేట్ చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌లో పట్టు రైతులను ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున ఎరి ఫార్మింగ్ కార్యక్రమాలను ప్రారంభించారు. మోదీ రెండవ సారి అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజులలో ఒక్క ఈశాన్యంలోనే ప్రతి రోజూ కనీసం రెండు ప్రాజెక్టులు మంజూరు కావడమో, అమలు కావడమో, పూర్తికావడమో జరుగుతోందని ఈశాన్య ప్రాంత అభివృద్ధి వ్యవహారాల మంత్రి జితేందర్ సింగ్ తెలిపారు. ఈశాన్యంలో దాదాపు 30సార్లకు పైగా పర్యటించడమే ఆ ప్రాంతం పట్ల ప్రధాని మోదీ ఎంత ఆసక్తి చూపుతున్నారో స్పష్టమవుతోంది. ఇవాళ ఈశాన్య ప్రజలు బీజేపీని అభిమానిస్తున్నారని చెప్పేందుకు ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో ఆరు రాష్ట్రాల్లో ఎన్డీఏ అధికారంలో ఉండడమే నిదర్శనం.

జాతీయ ఏకతా దివస్ స్ఫూర్తి మాటల్లోనేకాదు చేతల్లో కూడా తమ లక్ష్యమని మోదీ, అమిత్ షాలు కశ్మీర్ విషయంలోనూ నిరూపించారు. ఆనాడు నెహ్రూ జోక్యం వల్ల పటేల్ పరిష్కరించలేకపోయిన కశ్మీర్ సమస్యను ఈనాడు మోదీ, అమిత్ షాలు పరిష్కరించి పటేల్‌కు నిజమైన నివాళిని అర్పించారు. కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు చేస్తూ తీసుకున్న సాహసోపేత నిర్ణయం వల్ల ఇవాళ కశ్మీర్ భారత దేశంలో అంతర్భాగమన్న విషయంలో అసలు చర్చకే తావు లేకుండా పోయింది. అక్కడి ప్రజలకు వాస్తవాలను అర్థం చేయించడం ద్వారా రాజకీయంగా, మానసికంగా వారిని దరి చేర్చుకునేందుకు ప్రభుత్వం సర్వయత్నాలు చేస్తోంది.

దేశ ఐక్యతను కాపాడేందుకు, భారతీయులందరినీ సంఘటితంగా ఒకే త్రాటిపై తీసుకువచ్చేందుకు మోదీ యత్నాలు చూస్తున్న వారందరికీ స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్, ఇతర పార్టీలు చేసిన యత్నాలు చూస్తే అసహ్యం కలుగక మానదు. నెహ్రూ కశ్మీర్ చిచ్చును రగిలిస్తే, ఇందిర, రాజీవ్‌లు ఈశాన్యం, పంజాబ్ రాష్ట్రాల్లో వేర్పాటు వాద సమస్యలకు కారకులయ్యారు. కాంగ్రెస్ హయాంలోనే పంజాబ్, అస్సోం, నాగాలాండ్, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో వేర్పాటువాద, విచ్ఛిన్నకర శక్తులు తలెత్తాయి. ఢిల్లీలో అల్లర్లు చెలరేగాయి. భింద్రన్ వాలేను సృష్టించి చివరకు ఆపరేషన్ బ్లూస్టార్ అమలు చేయడం వల్ల ఒక ప్రధాని సిక్కు ఉగ్రవాదుల చేతుల్లో బలయ్యారు. అది అమాయక సిక్కు ప్రజల ఊచకోతకు దారితీసింది. శ్రీలంకలో తలదూర్చడంవల్ల తమిళ టైగర్ల ఆత్మాహుతి దాడికి మరో ప్రధాని హత్యకు గురి కావల్సి వచ్చింది. నక్సలైట్ సమస్య ప్రారంభమై తీవ్రతరమైంది కూడా కాంగ్రెస్, ఇతర బిజెపియేతర ప్రభుత్వాలహయాంలోనే. ఈ దేశంలో కుల చిచ్చు, మత కల్లోలాలు, ప్రాంతీయ ఉద్యమాలు, కుటుంబ పాలన వంటి సకల జాడ్యాలు కాంగ్రెస్ హయాంలోనే పెచ్చరిల్లాయి. రాజకీయాల్లో పబ్బం గడుపుకునేందుకు, ఓటు బ్యాంకు పెంచుకునేందుకు కాంగ్రెస్ కుల, మత ప్రాంతీయ అరాచక శక్తులను పెంచి పోషించింది. కాంగ్రెస్ తప్పిదాల మూలంగా ఆ పార్టీ లోంచి ఉద్భవించిన అనేక ప్రాంతీయ పార్టీలు కూడా ఇవే దారుణాలకు పాల్పడ్డాయి. ములాయం సింగ్ యాదవ్, మాయావతి, లాలూ ప్రసాద్ యాదవ్, నవీన్ పట్నాయక్, చంద్రబాబునాయుడు, కేసీఆర్, జగన్మోహన్ రెడ్డి వీరంతా కుటుంబ పాలనకు, ఆ పాలనలో జరిగే అరాచక కృత్యాలకు ప్రతినిధులుగా మిగిలిపోయారు. ఈశాన్య రాష్ట్రాలు, కశ్మీర్‌లలో జరిగిన విచ్ఛిన్న కార్యకలాపాల ద్వారా దేశానికి జరిగిన నష్టం ఒక ఎత్తు అయితే ఈ ప్రాంతీయ నేతల హయాంలో జరుగుతున్న నష్టం మరో ఎత్తు. వీరు ప్రజల మధ్య చీలికలు తీసుకు వచ్చి, కులాన్ని, మతాన్నీ, ప్రాంతీయ తత్వాన్నీ వాడుకుని అధికారంలోక వచ్చి తమ అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు. ఏకతా దినం స్ఫూర్తిగా, భారత దేశాన్ని పటేల్ ఆశయాలకు అనుగుణంగా సమైక్యపరిచి ఆరోగ్యకరంగా అభివృద్ధి చేయాలంటే ఇలాంటి విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం కూడా అత్యవసరం.

*(బిజెపి జాతీయ కార్యదర్శి)*

# ప్రభుత్వ బ్యాంకులు అవసరమా?

**భరతవాక్యం**



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

మోదీ సర్కార్‌ను అభినందించాల్సిన విషయాలలో ఒకటి ప్రభుత్వ రంగ బ్యాంకు (పిఎస్‌బి)ల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం. 'ఢిల్లీ' నుంచి ఎటువంటి ఒత్తిడి లేకపోవడం వల్లే రుణాలను ఎంతకూ తిరిగి చెల్లించని వారిపై బ్యాంకు అధికారులు కఠిన చర్యలు తీసుకోగలుగుతున్నారు. అయినప్పటికీ పిఎస్‌బిలకు నష్టాలు కొనసాగుతూనే వున్నాయి. ప్రభుత్వ బ్యాంకుల నష్టాల సమస్య, అత్యున్నత స్థాయిలో సుపరిపాలన ఉన్నంత మాత్రాన పరిష్కారం కాబోదని స్పష్టమయింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల సమస్యలు చాలా మౌలికమైనవి.

1970 దశకం ఆరంభంలో ప్రైవేట్ బ్యాంకుల జాతీయకరణ, ప్రభుత్వ రంగ బ్యాంకుల ఏర్పాటుకు ఒక ప్రధాన కారణమున్నది. గ్రామీణ ప్రాంతాల వారికి బ్యాంకింగ్ సేవలు అందించకపోవడం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణ సదుపాయం కల్పించక పోవడం వల్లే ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేసింది. 1952లో దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం బ్యాంకు బ్రాంచీలు 4061 మాత్రమే కాగా వాటి సంఖ్య తదుపరి 17 సంవత్సరాలలో 8262కి పెరిగింది. 1970లో జాతీయకరణ దరిమిలా కేవలం 20 సంవత్సరాల వ్యవధిలో బ్యాంకు బ్రాంచీల సంఖ్య 59,752కి పెరిగింది. దేశ జనాభాలో అత్యధికులకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

అయితే బ్యాకింగ్ వ్యవస్థ విస్తరణతోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకులకు నష్టాలూ అంతకంతకూ బాగా పెరిగిపోయాయి. గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచీల నిర్వహణా భారం ఆ నష్టాలకు ఒక ప్రధాన కారణంగా వున్నది. నష్టాలను నివారించుకునే ప్రయత్నాలలో భాగంగా గ్రామీణ బ్రాంచీలను మూసివేయాలని పిఎస్‌బిల యాజమాన్యాలు నిర్ణయించాయి. తత్ఫలితంగా వందలాది గ్రామాలలో ఆ బ్యాంకుల కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. 2010 సంవత్సరంలో పిఎస్‌బిల మొత్తం బ్రాంచీలలో 50శాతం గ్రామీణ ప్రాంతాలలోనే వున్నాయి. 2018లో ఇవి 37 శాతానికి తగ్గిపోయాయి. ప్రైవేట్ బ్యాంకుల జాతీయీకరణ, పిఎస్‌బిల ఏర్పాటు లక్ష్యం అసంపూర్ణంగా మిగిలిపోయింది.

మరింత శోచనీయమైన విషయమేమిటంటే పిఎస్‌బిలకు ప్రభుత్వం సమకూరుస్తున్న ఆర్థిక సహాయం పూర్తిగా నిష్ఫలమైపోతోంది. కేంద్ర ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ బ్యాంకులకు 3 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడిని అదనంగా చేకూర్చింది. అయినప్పటికీ నేడు ప్రభుత్వ రంగ బ్యాంకుల మొత్తం మూల ధనం మార్కెట్ విలువ రూ.2.8 లక్షల కోట్లు మాత్రమే! దీన్ని బట్టి 1971 నుంచి 2014 వరకు పిఎస్‌బిలకు కేంద్ర ప్రభుత్వం సమకూర్చిన మొత్తం పెట్టుబడులు పూర్తిగా వ్యర్థమైపోయాయని అర్థమవుతుంది. ప్రజా ధనం జాతి అభ్యున్నతికి కాక స్వార్థపరులైన వ్యక్తుల ప్రయోజనాలకు మాత్రమే తోడ్పడింది. బ్యాంకులకు చెల్లించవలసిన రుణాలలో 70 శాతం పిఎస్‌బిలు ఇచ్చినవే కాగా ఇవి వివిధ బ్యాంకుల 'నిరర్థక ఆస్తులు'గా మిగిలిపోయిన వాటిలో 90 శాతంగా వున్నాయి! పిఎస్‌బిలకు సమకూరుతున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వాటి మూలధనంలో కేవలం 5 శాతంగా మాత్రమే ఉంటున్నాయి. అదే ప్రైవేట్ బ్యాంకులకు వాటి మూలధనంలో 35 శాతం మేరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సమకూరుతున్నాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల విషాదానికి ప్రధాన కారణం బ్యాంకు ఉద్యోగులు తమ వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వడమేనని చెప్పక తప్పదు. ఒక ప్రైవేట్ బ్యాంక్ యజమాని తమ సంస్థ లాభాలను ఆర్జించాలని గట్టిగా కోరుకుంటాడు. తన వ్యక్తిగత ప్రయోజనాలు నెరవేరడమనేది బ్యాంకు అభివృద్ధితో ముడివడివున్నదనే వాస్తవాన్ని అతడు విస్మరించడు. తన బ్యాంకు సాధించే పురోగతిపైనే ఆ యజమాని వ్యాపార ప్రయోజనాల భవిష్యత్తు ఆధారపడివుంటుంది కదా. అయితే ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజర్లలో ఇలా ఆలోచించే వాళ్ళు ఎంత మంది? సమాధానం స్పష్టమే. అవినీతికి పాల్పడడం ద్వారా సొంత ఆస్తులను పెంపొందించుకోవడానికే వారు ప్రాధాన్యమివ్వడం జరుగుతోంది. బ్యాంకు దివాలా తీస్తుందనే వాస్తవాన్ని




**నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను సాపేక్షంగా మెరుగైన ఆర్థిక స్థితిలో వున్న ప్రభుత్వ రంగ బ్యాంకులలో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సత్ఫలితాల నివ్వగలదా? పటిష్ఠంగా వున్నాయని ప్రభుత్వం భావిస్తున్న బ్యాంకులు 1971 నుంచి 2014 దాకా వివిధ ప్రభుత్వాలు సమకూర్చిన పెట్టుబడులన్నిటినీ దుర్వినియోగపరచలేదా? ప్రభుత్వ రంగ బ్యాంకులను పూర్తిగా ప్రైవేటీకరించడం ద్వారా మాత్రమే జాతి సంపదను అవి దుర్వినియోగం చేయకుండా కాపాడుకోగలుగుతాము.**

వారు పట్టించుకోవడం లేదు. 2014 సంవత్సరం దాకా ప్రభుత్వ రంగ బ్యాంకులకు దేశ ప్రజలు ప్రభుత్వం ద్వారా సమకూర్చిన పెట్టుబడిలన్నిటినీ బ్యాంకు అధికారులే హరించివేశారు. మోదీ ప్రభుత్వం పిఎస్‌బిల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోయినప్పటికీ అవి నష్టాల పాలవుతుండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సమస్య ఉద్యోగులతోగానీ, ప్రభుత్వంతో కాదనే కాదూ?

మరి మార్గాంతరమేమిటి? ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించడమే. ప్రభుత్వం 2014లో నియమించిన పిజె నాయక్ కమిటీ ఇదే విధమైన సిఫారసు చేసింది. దురదృష్టవశాత్తు ప్రభుత్వం ఆ సిఫారసును బుట్టదాఖలు చేసింది. నాయక్ కమిటీ నివేదిక దుమ్ము కొట్టుకు పోతోంది. ప్రైవేట్ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల వినియోగదారుల, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమల ప్రయోజనాలకు దోహదం చేయవనే వాదన ఒకటి గట్టిగా వున్నది. పిఎస్‌బిల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విన్పిస్తున్న వాదనలలో ఇది ఒకటని మరి చెప్పనవసరం లేదు. నిజమేమిటి? వాణిజ్య బ్యాంకులను నియంత్రించడంలో రిజర్వ్ బ్యాంక్ విఫలమవ్వడం వల్లే ఈ సమస్య తలెత్తిందనేది స్పష్టం. ప్రైవేట్ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల ప్రజల, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పురోగతికి దోహదం చేసే విధంగా వ్యవహరించేలా చేయడంలో రిజర్వ్ బ్యాంక్ విఫలమయింది (ఈ వాస్తవాన్ని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్ స్వయంగా అంగీకరించారు).

ఈ నేపథ్యంలో, నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను సాపేక్షంగా మెరుగైన ఆర్థిక స్థితిలో వున్న ప్రభుత్వ రంగ బ్యాంకులలో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సత్ఫలితాలనివ్వగలదా? పటిష్ఠంగా వున్నాయని ప్రభుత్వం భావిస్తున్న బ్యాంకులు 1971 నుంచి 2014 దాకా వివిధ ప్రభుత్వాలు సమకూర్చిన పెట్టుబడులన్నిటినీ దుర్వినియోగపరచలేదా? మరి ఆ బ్యాంకులు తమలో విలీనమవుతున్న బలహీన ప్రభుత్వ రంగ బ్యాంకులలో మదుపు చేసిన సొమ్మును ఎలా కాపాడగలుగుతాయి? బ్యాంకుల విలీన లక్ష్యం ప్రభుత్వ రంగ బ్యాంకులకు నిరంతరాయంగా సమకూరుస్తున్న పెట్టుబడుల విషయం ప్రజల దృష్టికి వెళ్ళకుండా చూడడమేనని దేశ ఆర్థిక వ్యవహారాల పరిశీలకులు విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీ నష్టాలతో నడుస్తున్నాయి. అవి మనుగడ సాగించేందుకు ప్రభుత్వం పదే పదే వాటికి పెట్టుబడులను సమకూరుస్తోంది. ఇలా బ్యాంకులకు పెట్టుబడులు సమకూరుస్తుండడం వల్ల ప్రభుత్వ బొక్కసం ఖాళీ అవుతున్నది. ఆర్థిక పాలనాపరమైన ఈ వాస్తవాన్ని బడ్జెట్‌లో చూపవలసిన అవసరమున్నది. అయితే బ్యాంకుల విలీనంతో ఆ పెట్టుబడుల వివరాలను నష్టాల్లో ఉన్న బ్యాంకులను విలీనం చేసుకున్న పటిష్ఠ బ్యాంకుల అప్పులు, ఆస్తుల పట్టికలో చూపవలసివుంటుంది. బడ్జెట్‌లో చూపవలసిన అవసరం ప్రభుత్వానికి వుండదు. ఇదెలావుందంటే అంగవికలుడైన చిన్నకుమారుడిని మోయవలసిన భారాన్ని తాను వహించకుండా శక్తిమంతుడైన పెద్ద కుమారుడే తమ్ముడిని తన భుజాలపై మోయాలని తండ్రి ఆజ్ఞాపించినట్టుగా వున్నది. సరే, బ్యాంకుల విలీనానికి వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు దిగడం మరింత దురదృష్టకరమైన విషయం. పిఎస్‌బిల ప్రధానసమస్య అసమర్థత, అవినీతి. తమ స్వార్థ, జాతి హితం కాని ప్రయోజనాలను కాపాడుకునేందుకే బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేశారు. వారిని సమర్థంగా ఎదుర్కోవాలంటే పిఎస్‌బిలను ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరించాలి. తద్వారా జాతి సొమ్మును పిఎస్‌బిలు దుర్వినియోగం చేయకుండా కాపాడుకోగలుగుతాము.

**(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)**

# జ్ఞాన తపస్వి, జన పాత్రికేయుడు

తెలుగు పత్రికారంగం గురించి తెలిసిన వారికి పరిచయం చేయనక్కరలేని పేరు సి. రాఘవాచారి. మొన్నటి విశిష్ట పత్రికా సంపాదకులు ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, మద్దుకూరి చంద్రం, నార్ల వెంకటేశ్వరరావుల తరానికీ, నేటి తరానికీ నడుమ సముచితమైన వారధి ఆయన. తెలంగాణలోని కాకతీయుల కదనసీమ ఓరుగల్లులో ఒక సంప్రదాయ శ్రీవైష్ణవ కుటుంబంలో పుట్టి, హైదరాబాద్‌లో ఉన్నత విద్యలు చదివి, విజయవాడను కార్యక్షేత్రంగా ఎన్నుకున్న ఉత్తమ జర్నలిస్టు. బాల్యంలోనే సంస్కృత భాషపై పట్టును సాధించి పురాణ ప్రబంధాలను ఔపోసన పట్టాడు. యవ్వనంలో ఆంగ్లం, ఉర్దూ భాషలపై సాధికారికత సాధించాడు. మాతృభాష 'తెలుగు'లోని మెళకువలన్నీ అధ్యయనం చేశాడు.




సి. రాఘవాచారి
(1939 – 2019)

వేదాలు, ఉపనిషత్తులు మొదలుకొని అత్యాధునిక సాహిత్య ప్రక్రియల వరకు, మహాకవి కాళిదాసు నుంచి షేక్స్పియర్ రచనల వరకు విస్తారంగా చదివిన నిరంతర విజ్ఞానాన్వేషి, నిర్విరామ జ్ఞాన తపస్వి చక్రవర్తుల రాఘవాచారి. జర్నలిజం కేవలం ఒక వృత్తి కాదని, సామాజిక బాధ్యత అని అనిరూపించిన నిబద్ధ పాత్రికేయుడు. పత్రికా సంపాదకుడు ఒక ఉద్యోగి కాదు, ఉద్యమకారుడు, ఉత్తమ అధ్యాపకుడు, సమాజ పథ నిర్దేశకుడని సూచించడమేకాక స్వయంగా ఆచరించి చూపాడు. నేడు పత్రికా రంగంలో అగ్రశ్రేణి పాత్రికేయులనేక మందికి శిక్షణనిచ్చిన ఉపాధ్యాయుడు. దిన పత్రిక సంపాదకీయం ఒక కాలక్షేప రచన కాదనీ, ప్రజల చైతన్యాన్ని పదును పెట్టే సాధనమనీ నిరూపించిన ఉత్తమ సంపాదకుడు.

తెలుగులో చక్కటి, చిక్కటి వచనాన్ని రాసిన ప్రతిభావంతుడైన రచయిత. సభలు, సమావేశాలను, గోష్ఠులను ఉత్తేజపరిచిన స్ఫూర్తిమంతమైన వక్త. సూక్తులు, సామెతలు, నుడులు, నానుడులతోనూ, చమత్కార సంభాషణలతోనూ సాగే రాఘవాచారి ప్రసంగశైలి పండిత గోష్ఠులను ఎలా రాగరంజితం చేయగలదో, సామాన్య ప్రజా వేదికలను కూడా అలాగే అలరింపజేసేది. ఇదొక అసాధారణ ప్రతిభ. అలవోకగా మహనీయుల మహితోక్తులను, సంస్కృత శ్లోకాలను, ఆంగ్ల ఉటంకింపులను తమ ప్రసంగంలో ఉటంకించడం ద్వారా శ్రోతలను ఆకట్టుకున్న ప్రజ్ఞతో వ్యక్తిత్వానికి వన్నె తెచ్చాడు. సమయోచిత ఉక్తి వైచిత్రి, సందర్భోచిత హాస్య చతురత రాఘవాచారి ప్రసంగ విలక్షణతగా ఉండేది.

బట్టతల, విశాలమైన నుదురు, ఆలోచనలతో రాటుదేలిన లోతైన కళ్లు, మల్లెపూల వంటి తెల్లటి వస్త్రధారణతో కనిపించే ఆయన నిరాడంబర జీవన విధానం, అలుపెరుగని అధ్యయన శీలత్వం, ఎన్నుకున్న పాత్రికేయ వృత్తిపట్ల నిబద్ధత, నిర్వహించే బాధ్యతల పట్ల అంకితభావం ఆయన వ్యక్తిత్వంలో కనబడే సుగుణాలు.

సంప్రదాయ కుటుంబంలో పుట్టినప్పటికీ పెరుగుతున్న క్రమంలో చుట్టూరా ఉన్న సామాజిక పరిస్థితుల అవగాహన, చదివిన గ్రంథాల స్ఫూర్తితో మొదట హేతువాదిగా రూపాంతరం చెంది క్రమంగా మార్క్సిస్టుగా పరిణామం చెందిన సామ్యవాద స్వాప్నికుడు చక్రవర్తుల రాఘవాచారి కృషికి గుర్తింపుగా తెలుగు నాట అనేక సామాజిక, సాంస్కృతిక సంస్థలు ఆయనను సముచితంగా సత్కరించాయి. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం సన్మానించింది. విజయలక్ష్మి స్మారక ట్రస్టు వారి పురస్కారం, సురవరం ప్రతాపరెడ్డి సాహితీ వైజయంతిక వారి పురస్కారం, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ వారిచే జీవిత సాఫల్య పురస్కారం పొందాడు. ఉత్తమ అభిరుచి, ఉన్నతాశయాలతో కొనసాగిన రాఘవాచారి జీవితం, వ్యక్తిత్వం నేటి తరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం.

■ **ఆచార్య ఎస్వీ సత్యనారాయణ**

# సఫాయీ వృత్తి నిర్మూలన సాధ్యమే!



'సఫాయీ వృత్తిని నిర్మూలించలేరా' శీర్షికన ఆంధ్రజ్యోతి ఎడిట్ పేజీలో ఈ నెల 1వ తేదీన ప్రచురితమైన రంగనాయకమ్మగారి వ్యాసం చదివిన తరువాత నాకు కలిగిన అభిప్రాయాలు ఇవి. 1. మరుగుదొడ్లను కలుపుతూ భూగర్భ డ్రైనేజి ఏర్పాటు అసాధ్యమా? మాన్‌హోల్స్‌ని కూడా చేతులతో శుభ్రం చెయ్యాల్సిందేనా? 2. మరుగుదొడ్లలో చేతులతో మలాన్ని ఎత్తే పనులు పాకీ వృత్తి వారు లేదా మనుష్యులు చేయాల్సిందేనా?, 3. డ్రైనేజి గొట్టాలు మలమూత్రాలతో పూడిపోతే కందకాల్లో దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్న దుర్భర ఘటనలు అనేకం. 2018లో సెప్టిక్ ట్యాంకుల్లో పడి 105 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ పనిని పూర్తిగా యాంత్రీకరించి, చేతులతో చేయవలసి రాకుండా చూడలేమా? 4. పాకీ పనిని ఫలానా కులం వారే చేసే పరిస్థితిని మార్చి, వారి పిల్లలకు కూడా అదే వృత్తిని అవలంబించాల్సిన అవసరాన్ని తగ్గించి, రానురాను ఆ పనిని ఆపలేమా? ఇప్పటికీ లక్షా అరవై వేలమంది మలాన్ని చేతులతో ఎత్తి పోస్తున్నారట. 5. అతి చిన్న స్థాయి టెక్నాలజీతో ఎక్కడికక్కడ శుభ్రం చేసే యంత్రాలను తయారు చేయలేమా? భూమికింద, సముద్రంలో కూడా అతిలోతైన ప్రాంతాల్లోని సహజవనరులను కనుగొని, వాటిని తోడి తీస్తున్న మన దేశంలో పైన చెప్పుకున్న పనులను చేయడానికి యంత్రాలను కనిపెట్టవలసి ఉన్నది. ఎలుకల లాంటి చిన్న చిన్న జీవులు, ఇతర జంతువుల కళేబరాల వాసననే భరించలేక మనుషులు ముక్కు మూసుకుంటారు. అలాంటప్పుడు పై పనులు చేయడానికి యంత్రాలు కనిపెట్టడం కష్టమేమీ కాదు. దానిపైన దృష్టిపెడితే శ్రమజీవులకు, అభాగ్యులకు మేలు కలుగుతుంది. లేదంటే అది అమానవీయం, అమానుషం అవుతుంది. ఒక కథనం ప్రకారం గాంధీజీని 'మీరు దేశాధినేత అయితే ఈ సమస్య గురించి ఏం చేస్తారు?' అని అడిగిన ప్రశ్నకు.. 'నేను దేశాధినేత బాధ్యతలు స్వీకరించను. స్వీకరించినా వైశ్రాయ్ మరుగుదొడ్డిని శుభ్రం చేసే వాళ్ల ఇంటికి వెళ్లి వాళ్ల మరుగుదొడ్డిని శుభ్రం చేస్తా' అని మహాత్ముడు జవాబిచ్చాడట. అందుకే ఆయన మహాత్ముడైనాడు. మన దేశంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నవి. దాని నిధులను ఈ దిశగా కేటాయించి పరిశోధనను చేస్తే మార్పునకు నాంది పలువచ్చు.

– **దేవరపల్లి సాహెబ్,** గుంటుపల్లి, కృష్ణా జిల్లా

## జనవాక్యం

### డెంగీ టీకా తయారు చేయాలి!

ప్రస్తుతం ఎక్కడ చూసినా డెంగీ జ్వరాలు ఎక్కువైనాయి. ప్రజలు వీటి బారిన పడుతున్నారు. మరణాలు కూడా సంభవిస్తున్నాయి. ఈ మహమ్మారిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలి. డెంగీ నిర్మూలను ప్రత్యేక టీకాలాంటిది తయారు చేయించాలి. ప్రైవేటు ఆసుపత్రులవారు మానవత్వం మరిచి వ్యాపార దృష్టితో ఇదే అదనుగా ప్రజలను దోచుకుంటున్నారు. సర్కారు దవాఖానాలేమో సౌకర్యాలు లేక కునారిల్లుతున్నాయి. ప్రజలు విషజ్వరాల బారిని పడి నరకం అనుభవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం డెంగీని జాతీయ విపత్తుగా గుర్తించాలి. దీని నివారణకు పరిశోధనలు చేసి సరైన మందులను కనిపెట్టాలి. విలువైన ప్రాణాలను, పేదల ధనాన్ని కాపాడాలి. పోలియోను నిర్మూలించిన విధంగానే డెంగీని కూడా శాశ్వతంగా నివారించాలి.

– **డా. శ్రేష్ఠి శేషగిరి,** వారాసిగూడ, హైదరాబాద్

### ఒకే మంచంపై ఇద్దరు రోగులా?

రెండు తెలుగు రాష్ట్రాల్లో విషజ్వరాలు విపరీతంగా విజృంభిస్తున్నాయి. దీనితో ప్రభుత్వ ఆస్పత్రులు పేషెంట్లతో కిటకిటలాడుతున్నాయి. ఒకే మంచంపై ఇద్దరు రోగులను పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు. ఇది వైద్య శాస్త్రరీత్యా చాలా తప్పు, నేరము కూడా. ఇది పేదల ఆరోగ్యంతో చెలగాటమాడటమే. అందుకని ఆసుపత్రుల్లో గదులు, మంచాలు తక్కువైతే దయచేసి ప్రవేశాలు ఆపండి. వాళ్ల బాధలేవో వాళ్లు పడతారు. లేదా మడత మంచాలు అద్దెకు తీసుకోండి. లేదా ఆసుపత్రి ఆవరణలో షామియానాలు వేసి వైద్యం చేయండి. ఇంకా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఏమైనా ఆలోచించండి. అంతే కానీ, ఒకే మంచంపై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తూ వారిని మరింత అనారోగ్యంలోకి తోసేయకండి.

– **గోపాలుని శ్రీరామమూర్తి**

బ్యూటీ



# కురులు సమ్మోహనంగా...

నల్లటి కురులు ముఖానికి ఇచ్చే నిండుదనం, అందం వేరు. అందుకే శిరోజాల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటారు మహిళలు. కురులు, బలంగా, సమ్మోహనంగా ఉండేందుకు సౌందర్య నిపుణులు కొన్ని టిప్స్ చెబుతున్నారు. అవేమిటంటే..

- జుట్టు స్ట్రయిటుగా ఉండేందుకు హీట్ టూల్స్ అవసరం లేకుండా డై మాస్కును ఉపయోగించవచ్చు. ఈ హెయిర్ మాస్కు ఇంట్లోనే చేసుకోవచ్చు. ఫ్యాట్ బాగా ఉన్న కొబ్బరిపాలు ఒక కప్పు, వాసనలేని జిలెటిన్ పొడి రెండు టేబుల్‌స్పూన్లు, కార్న్ స్టార్చ్ రెండు టేబుల్‌స్పూన్లు, అడివి తేనె రెండు టేబుల్‌స్పూన్లు, నిమ్మరసం- రెండు టేబుల్ స్పూన్లు, లావెండర్ ఎసెన్షియల్ ఆయిల్ ఐదు చుక్కలు వేసి పేస్టులా చేసి తలకు రాసుకుంటే శిరోజాలు స్ట్రయిటెన్ అవుతాయి.
- వేడి నీళ్లతో తల రుద్దుకుంటే వెంట్రుకల్లో చేరిన మురికంతా పోతుంది. అయితే చివర్లో మాత్రం మర్చిపోకుండా చల్లటి నీళ్లతో వెంట్రుకలను బాగా శుభ్రంగా కడగాలి. ఇలా చేయడం వల్ల వెంట్రుకలు మెరుపులు చిందించడమే కాదు మాయిశ్చర్‌ను వాటికి అందిస్తాయి. తరచూ వేడినీళ్లతో తల రుద్దుకోవడం వల్ల శిరోజాల మెరుపు, రంగు తగ్గిపోతాయి.
- జుట్టు పెరగడానికి వంటింటి సామగ్రితోనే ఆరోగ్యకరమైన నూనెను తయారుచేసుకోవచ్చు. కొబ్బరినూనె, ఆలివ్ ఆయిల్, నువ్వులనూనె, ఆవ నూనె, ఆముదం, బాదం నూనె, రెండు ఉసిరికాయ ముక్కలు, రెండు గుప్పెళ్ల కరివేపాకు, బేబీ ఉల్లిపాయలు అన్నింటినీ కలిపి చేసిన నూనె జుట్టుకు రాసుకుంటే జుత్తు బాగా పెరుగుతుంది.
- జుట్టు ఆరోగ్యంగా ఉండడంలో తినే ఆహారం ముఖ్య పాత్ర వహిస్తుంది. జుట్టు పట్టులా మెరవాలంటే నార్మల్ జుట్టు ఉన్న మహిళలు చేప, చికెన్, పప్పు, మొలకలు బాగా తింటే మంచిది. బిరుసు వెంట్రుకలు ఉన్నవాళ్లు పచ్చికూరగాయలు, దంపుడు బియ్యం, అరటిపళ్లు, నట్స్, విటమిన్-ఇ క్యాప్సూల్స్ తీసుకోవాలి. ఇక జిడ్డు వెంట్రుకలు ఉన్నవాళ్లు ఆకుకూరలు, సలాడ్లు, తాజా పండ్లు, పెరుగు బాగా తినాలి.
- తల దురదపెట్టకుండా ఉండాలంటే తాజా నిమ్మరసం, ఆలివ్ ఆయిల్, నీళ్ల ఒక్కొక్కటీ రెండేసి స్పూన్లు చొప్పున తీసుకుని ఆ మిశ్రమాన్ని మాడుకు పట్టించి ఇరవై నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత చల్లటి నీళ్లతో కడిగేయాలి.
- సూర్యకాంతితో జుట్టు దెబ్బతినకుండా ఉండాలంటే.. అరకప్పు తేనె, రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్ మిశ్రమాన్ని మాడుపై మర్దనా చేసి ఇరవై నిమిషాల తర్వాత శుభ్రంగా కడగాలి.
- చుండ్రుతో బాధపడేవారు రెండు భాగాల బ్రౌన్‌షుగర్, ఒక భాగం హెయిర్ కండిషనర్ కొలతగా తీసుకుని ఆ మిశ్రమంతో మాడుపై సున్నితంగా మసాజ్ చేసుకుని తర్వాత నీళ్లతో శుభ్రంగా కడిగేసుకోవాలి. ఇలా చేస్తే చుండ్రు తగ్గుతుంది.

**అమెరికాలో గత ఐదేళ్లుగా షార్ట్ ఫిలిమ్స్, డాక్యుమెంటరీలు, కామెడీ షోల ద్వారా పేరు తెచ్చుకుంటున్నారు అవంతిక నక్షత్రం. తన చిన్ననాటి ఆసక్తికి, భర్త ప్రోత్సాహం కూడా తోడవ్వడంతో అమెరికాలో 'పిలుపు టీవీ' వెబ్ ఛానెల్‌ను ఏర్పాటు చేయడమేగాక, షార్ట్ ఫిలిమ్స్ తీస్తూ సత్తా చాటుకుంటున్నారు. ఇటీవల ఆమె 'నవ్య'తో ముచ్చటించారు. ఆ విశేషాలే ఇవి...**

ప్రవాస కిరణం

# మన ప్రతిభకు 'పిలుపు'!

"మాది హైదరాబాద్. సిద్ధిపేటకు చెందిన వేణుతో నా వివాహం అయ్యింది. ఉద్యోగ రీత్యా మేము అమెరికాలో స్థిరపడ్డాం. అక్కడే 'పిలుపు టీవీ' (వెబ్ ఛానెల్)కి సీఈఓగా, ఒక స్కూల్ టీచర్‌గా ఎన్నో బాధ్యతల్ని నిర్వహిస్తూనే 'నక్షత్రం ప్రొడక్షన్స్' సంస్థ ద్వారా ఎందరో కళాకారుల్ని, నటుల్ని, దర్శకులను పరిచయం చేశాం. మావారు వేణు దర్శకునిగా ఎన్నో లఘు చిత్రాల్ని తీశాం.



తాజాగా 'కాక్‌టైల్ డైరీస్' అనే వెబ్‌సిరీస్‌ని సాయిరామ్ పల్లి దర్శకత్వంలో నిర్మించాం. ఈ వెబ్‌సిరీస్ 'అమెజాన్ ప్రైమ్' ద్వారా, మరో యూట్యూబ్ ఛానెల్ ద్వారా ఇండియాలో విడుదలయ్యింది.

**కళాకారులను ప్రోత్సహించాలనే...**

నా చిన్నప్పుడు ఖైరతాబాద్‌లో మాకు స్టూడియో (మ్యాచ్ లైన్ స్టూడియో) ఉండేది. దాన్ని మా నాన్న నూతి రాంగోపాల్, అన్నయ్య అమర్‌దీప్ నడిపేవారు. వారిద్దరూ అప్పట్లో టీవీ యాడ్స్ చేసేవారు. ఇంట్లో వాటి గురించి ఏదో ఒక విషయం చర్చించుకొనేవారు. వారి మాటల్లో నిర్మాణానికి సంబంధించిన ఎన్నో విషయాలు అర్థం అయ్యేవి. అమెరికా వెళ్లిన తర్వాత 'ఫెర్ఫాక్స్ పబ్లిక్ యాక్సెస్'లో ఎడిటింగ్, ప్రొడక్షన్ కోర్సులు చేశా. ఆ అనుభవంతో 'ఆర్లింగ్టన్ ఇండిపెండెన్స్ మీడియా'లో చాలా వీడియోస్‌ని ఎడిట్ చేశా. ఆ అనుభవం నాకు ఇప్పుడు టీవీ కార్యక్రమాలు ఎడిట్ చేయడానికి పనికొస్తోంది.

మావారు అమెరికాలో ఐటీ ఉద్యోగి. సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలంటే ఆయనకు ఇష్టం. కొన్ని లఘు చిత్రాలకు దర్శకత్వం చేశారు. మా 'పిలుపు టీవీ'కి స్క్రిప్ట్ రాయడమేగాక కార్యక్రమ నిర్వహణలో నాకు సాయపడుతుంటారు. మా చుట్టూ ఎందరో లైక్‌మైండెడ్ కళాకారులు ఉన్నారు. వారిని ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో ఈ సంస్థ ప్రారంభించాం. అయితే మేము కేవలం యూట్యూబ్ హిట్స్ కోసం కార్యక్రమాలు చేయడం లేదు. మేము తీసే లఘు చిత్రాల్లో, నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో అనేక సమాజహిత అంశాలుంటాయి. సమాజంలో కొందరు జనం డాలర్ల కోసం పరుగెత్తుతున్న తీరు, దాని ప్రభావం, మనం కోల్పోతున్న మానవీయ విలువలు, తల్లిదండ్రుల క్షోభ... ఇలా ప్రతీ అంశం ఆలోచింపచేసే విధంగా ఉంటుంది. అందుకే మా లఘు చిత్రాలకు చాలామంది మిత్రులు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొస్తున్నారు. లోకల్ బిజినెస్ యాజమాన్యాలు, రెస్టారెంట్ వాళ్ళు, కమ్యూనిటీ ఆర్గనైజషన్‌లు కూడా మాకు అండగా నిలుస్తున్నాయి.

**అనేక ఆటంకాల నడుమ...**

ఇక నా విషయానికొస్తే వీడియో ఎడిటింగ్‌తో ('పిలుపు టీవీ'కి పూర్తి స్థాయి ఎడిటర్‌ని) పాటు, ప్రీ స్కూల్ టీచర్‌గా వారానికి మూడు రోజులు ఉద్యోగం, పార్ట్‌టైమ్ కౌంటీ ఎలక్షన్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. లఘు చిత్రాల ద్వారా, 'పిలుపు టీవీ' ద్వారా ఎందరో కళాకారులను, టీవీ యాంకర్స్‌ని పరిచయం చేశాం. మూడేళ్ల క్రితం 'దేశీ టాలెంట్ హంట్' ద్వారా చాలామంది సింగర్స్‌ని పరిచయం చేశాం. ఆ విధంగా 'అమెరికాలో తెలుగువాళ్ల టాలెంట్‌కి కొదువలేద'నే విషయం రుజువయ్యింది. మేము తీస్తున్న వెబ్ సిరీస్ ద్వారా ఎంతోమంది ఇప్పటికే తమ టాలెంట్‌ను నిరూపించుకున్నారు. అయితే నిర్మాణం విషయానికొస్తే ఇండియాతో పోల్చితే మాకు చాలా ఛాలెంజెస్ ఉంటాయని చెప్పవచ్చు. అందరూ ఒక అభిరుచితో యాక్ట్ చేయడానికి వచ్చిన వారే కానీ పూర్తిస్థాయిలో నటనకే అంకితం అయిన వారు చాలా తక్కువ. ఇప్పుడిప్పుడే న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ వంటి నగరాల్లో కొంతమంది నటీనటులు పూర్తిస్థాయిలో ముందుకు వచ్చినా ఇంకా వారికి నటించే సరైన అవకాశాలు మాత్రం రావడం లేదు. అదీగాక వారాంతాల్లోనే షూటింగ్ చేయాల్సి వస్తుంది. అక్కడి వాతావరణం ఒక పెద్ద సవాల్. సున్నా డిగ్రీ కన్నా తక్కువ ఉష్ణోగ్రతలకు పడిపోతుంటాయి, కొన్ని సీన్లు అనుకున్న సమయానికి పూర్తి చేయాలంటే ఆ చలిలోనే షూట్ చేయక తప్పదు. వీకెండ్‌లో అందర్నీ ఒక చోట చేర్చడం పెద్ద సవాలు. అయినా అందరి సహకారంతో తాజాగా 'కాక్‌టైల్ డైరీస్'ను విజయవంతంగా పూర్తి చేయగలిగాము. అమెరికా నేపథ్యంలో ఇప్పటికే చాలా సినిమాలు వచ్చాయి. కానీ వాటిలో వీసా కోసం పడే కష్టాలని హైలైట్ చేసినవే ఎక్కువ. ఇందులో మేము అమెరికాలో మన లైఫ్ ఎలా ఉంటుంది? భార్యభర్తల



మధ్య అనుబంధం... పని ఒత్తిడి, వారాంతాల్లో విహారాలు... ఇవన్నీ మూడు కుటుంబాల నేపథ్యంలో తీశాం. అంటే పూర్తిగా బ్యాచిలర్స్‌ది ఒక స్టైల్, ఫ్యామిలీ విత్ కిడ్ ఒక స్టైల్, ఫామిలీ వితౌట్ కిడ్ ఒక స్టైల్. ఇలా మూడు విభిన్న మనస్తత్వాలు ఇందులో ఉంటాయి. 'కాక్‌టైల్ డైరీస్' వెబ్ సిరీస్ యు.కె, యు.ఎస్‌లలో అమెజాన్ ప్రైమ్‌లో... మిగతా అన్ని దేశాల్లో (ఇండియా సహా) 'ఐక్యూఎల్ఐకె' ద్వారా యూ ట్యూబ్‌లో విడుదలయ్యింది.

• **కె.అంజయ్య,** సిద్ధిపేట

## మా స్థలంలో ఇల్లు కట్టాడు..

లీగల్ కౌన్సెలింగ్



మా మామయ్యకు రెండు ఇళ్లు ఉన్నాయి. అయితే మావారి అన్నయ్యలు ఇద్దరూ కలిసి వారి వాటాగా వచ్చిన భాగాలను 2001లో మాకు 20 రూపాయల స్టాంపు పేపర్ మీద అగ్రిమెంట్ రాయించి ఇచ్చారు. 2005లో ఎమ్మార్వో మాకు ఒక అనుబంధ పత్రం కూడా ఇచ్చారు. కాకపోతే స్థలం విస్తీర్ణం రెండున్నర సెంట్లు ఉంటే ఎమ్మార్వో రెండు సెంట్లకే పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ విషయమై సమాచార చట్టం కింద అర్జీ పెట్టుకున్నాం. ఫలితంగా సర్వేవారు కొలతలకు వచ్చినప్పుడు రెండున్నర సెంట్లకు మ్యాప్ ఇచ్చారు. మేము కొంత భాగంలో ఇల్లు కట్టుకుని మిగతాది ఖాళీగా ఉంచాం. అయితే ఆ ఖాళీ స్థలంలో మా బావ దౌర్జన్యం చేసి, అక్రమంగా ఇల్లు కట్టారు. ఈ విషయమై ఎస్పీకి దరఖాస్తు పెట్టుకున్నాం. కానీ మాకు న్యాయం చేయలేదు. ఆ తర్వాత లోక్ అదాలత్‌కు పిటిషన్ పెట్టుకున్నాం. లాయర్‌ను నియమించుకొమ్మని చెప్పారు. కానీ, మాకు అంత ఆర్థికస్థోమత లేదని చెబితే లోక్ అదాలత్ వారే ఒక లాయర్‌ను నియమించారు. అయితే ఆ లాయర్ మాకేసును పట్టించుకోవడం లేదు. ఈ స్థితిలో మేము ఏం చేయాలో సలహా ఇవ్వండి.

**- ఎన్.పద్మ,** అనంతపూర్

ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ, సెక్షన్ 54 ప్రకారం ఎవరైనా తమ స్థిరాస్తిని బదలాయింపు చేయాలంటే, దాని విలువ ఆధారంగా సరైన స్టాంప్‌పేపర్ మీద రాసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అలా కానప్పుడు ఆ స్థిరాస్తి కొన్న వ్యక్తికి బదలాయింపు జరగదు. మీ భర్తకు అతని అన్నదమ్ములు 20 రూపాయల స్టాంపు మీద ఒక అగ్రిమెంటు మాత్రమే రాసి ఇచ్చారని రాశారు. అయితే ఈ అగ్రిమెంటు ఆధారంగా ఆ ఆస్తి మీద మీకు కొన్ని చట్టపరమైన హక్కులు సంక్రమిస్తాయి. 2005లో ఈ కాగితాల ఆధారంగా ఎమ్మార్వో అనుబంధ పత్రాన్ని కూడా ఇచ్చారని పేర్కొన్నారు. ఆ భూమిలో మీ బావగారు దౌర్జన్యంగా ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకున్నాడని తెలిపారు. అసలు ఏదైనా ఖాళీ స్థలం ఉంటే ఆ స్థలంమీద చట్టపరంగా ఎవరికి హక్కులు ఉంటాయో వారికే చెందుతుంది. మీవారు ఆ స్థలాన్ని కొన్నప్పటికీ, వాటికి సంబంధించిన సరైన దస్తావేజులు లేనందుకే ఈ చిక్కులన్నీ వచ్చాయి. అయితే, ఎవరైనా ఇతరుల ఆస్తిని దౌర్జన్యంగా ఆక్రమించినప్పుడు ఆ ఆక్రమణ నుంచి తొలగించే అధికారం సివిల్ కోర్టులకు మాత్రమే ఉంటుంది. అందుకే వెంటనే సివిల్ కోర్టును సంప్రదించండి.

లోక్ అదాలత్ వారు మీ తరపున నియమించిన న్యాయవాది మీకు న్యాయం చేయడం లేదని డబ్బులు అడుగుతున్నాడని పేర్కొన్నారు. ఆ విషయాన్ని లోక్ అదాలత్‌లో ఉండే సెక్రెటరీకి గానీ, లేదా ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసి మీరు న్యాయవాదిని మార్పించుకోవచ్చు. వారు తమ ఖర్చులతోనే మరో న్యాయవాదిని నియమిస్తారు. అప్పుడు మీకు న్యాయం జరిగే వీలుంది.



• **ఒడ్నాల శ్రీహరి**
న్యాయవాది, హైదరాబాద్

విభిన్నం



# ఇది తొలి అడుగు మాత్రమే!

**భారత రాజ్యాంగంలోని 377వ అధికరణాన్ని రద్దు చేస్తూ ఏడాది క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు 'ఎల్‌జీబీటీ'ల తొలి విజయం. ఆ క్రమంలో ఏడాది పూర్తయిన సందర్భంగా ఇటీవల 'ఎల్‌జీబీటీ' కమ్యూనిటీ హైదరాబాద్‌లో సంబరాలు చేసుకుంది. 'విద్య, ఆరోగ్యం, ఉపాధి, సమానత్వం, వసతి, ఐడి, ఆధార్ వంటి వాటిని కూడా తమకు కల్పించాల'ని వారు డిమాండ్ చేశారు. 377 అధికరణం కేవలం లైంగిక హక్కుల కోసమే కాదని, అన్ని రకాల అసమానతల నుంచి విముక్తి పొందాలని కోరుకుంటున్నామని, ఆ దిశగా తమ పోరాటం ఆగదనీ అన్నారు. ఈ సందర్భంగా కొందరు వెలిబుచ్చిన అభిప్రాయాలివి...**

## సమాజాన్ని చైతన్యపరచాలి!



"నేను హైదరాబాదులో ఉంటా. స్వస్థలం భోపాల్. ఎంబీఏ చేశాను. నేను లెస్బియన్ని. నా స్నేహితులు, సన్నిహితులకు నాగురించి తెలుసు. వారు నాకు అండగా ఉంటారు. నేను పనిచేసే చోట కూడా నా జెండర్ ఐడెంటిటీ తెలుసు. నేను ఎదుగుతున్న క్రమంలో నా శరీర వ్యవస్థ గురించి నాకు మెల్లగా అర్థమవుతూ వచ్చింది. ఆ స్థితిని జీర్ణంచేసుకోవడం నాకు పెద్ద సవాలే అయ్యింది. నేను లెస్బియన్ అని తెలిసినపుడు బయట వ్యక్తుల నుంచి చాలా సమస్యలే ఎదుర్కొన్నా. అయితే నా పరిస్థితిని అర్థం చేసుకోవడానికి వారికి కొంత సమయం పట్టింది. ముఖ్యంగా ప్రజల్లో 'ఎల్‌జీబీటీ ప్లస్' సెక్సువాలిటీ (ఆల్టర్నేటివ్ సెక్సువాలిటీ)పై అవగాహన పెంచితే ఇలాంటి విషయాలను సహజంగా తీసుకుంటారు. అయితే మాలాంటి వాళ్లకి (సేమ్ సెక్స్) పెళ్లి, ఆస్తి అంశాలు, మెడికల్ క్లైమ్స్ వంటివి కష్టం. మీడియా కూడా ఎల్‌జీబీటీల పట్ల పాజిటివ్‌గా ప్రతిస్పందిస్తోంది. ఈ మధ్య మా సమస్యలపై సినిమాలు, సీరియల్స్ కూడా వస్తున్నాయి. ఎన్నో ప్రకటనల్లో ఎల్‌జీబీటీ వ్యక్తులు ఉంటున్నారు. ఇది మంచి పరిణామం"

**- అపూర్వ**

## పోరాటానికి ఆయుధంగా...



"మేము తెలుగువాళ్లమే కానీ పశ్చిమబెంగాల్‌లో స్థిరపడ్డాం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. క్లాసికల్ డాన్సర్‌ని. నా జెండర్ 'జండర్ ఫ్లూయిడ్'. అంటే మల్టీ సెక్సువాలిటీ అని చెప్పొచ్చు. బైసెక్సువల్‌తోపాటు ఇతరత్రా కూడా నా జండర్ ఐడెంటిటీ ఉంటుంది. మా తరహా కేటగిరిని ఎల్‌జీబీటీలో ప్లస్ సిస్టమ్‌గా చూస్తారు. నాకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. నాకు డాన్స్ ఇష్టమని మా నాన్న నన్ను సంప్రదాయ నృత్యంలో చేర్చారు. 'ఎక్స్‌పెరిమెంటలిజం' జెనీవాలో ఆధునిక నృత ఫార్మేట్. దాన్ని భూమికగా భరతనాట్యంతో ఎన్నో ప్రయోగాలు చేశా. క్రమంగా నా నృత్యాన్ని యాక్టివిజానికి ఆయుధంగా మలచుకున్నా. ఆర్టికల్ 377 రద్దు తర్వాత మాకున్న స్వేచ్ఛను ఎవరూ నేరంగా చూడటంలేదు. మాకు ప్రత్యేకంగా 'డ్రాగ్ ఫర్ఫామెన్స్ అని ఉంటుంది. గతంలో దీన్ని ప్రదర్శిస్తే 'నాచ్' అని నేరంగా పరిగణించేవారు. ఇపుడా స్థితి లేదు. ఇది మా హక్కుల సాధనలో కేవలం ఒక అడుగు మాత్రమే."

**- పాత్రుని చిదానంద శాస్త్రి**

## ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి...



"మాది హైదరాబాద్. నాకు మానసిక శాస్త్రమంటే ఇష్టం. అందులో మాస్టర్స్ చేశా. నేనేమిటో అమ్మకు తెలియదు. చాలామంది నన్ను నీ సెక్సువాలిటీ ఏమిటని అడుగుతుంటారు. నేను ట్రాన్స్ విమెన్‌ని. పుట్టింది అబ్బాయిగా. కాలేజీలో చదివేటప్పుడే నా జండర్‌ని బహిరంగంగా ప్రకటించా. నా స్నేహితులందరూ నాకెంతో అండగా నిలబడ్డారు. జండర్ ఐడెంటిటీ పరంగా ప్రజల్లో అవగాహన ఎంతో అవసరం. ఒక ట్రాన్స్-విమెన్‌గా నేను అమ్మాయిలా అలంకరించుకుని వస్తే చాలామంది నన్ను వెక్కిరించేవారు. కొంతకాలం డిప్రెషన్‌కి గురయ్యా. ఆతర్వాత సమాజంలో అవగాహన లేక ప్రజలు అలా ప్రవర్తిస్తున్నారని మెల్లగా అర్థంచేసుకోగలిగా. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన తర్వాత ఇప్పుడిప్పుడే రకరకాల జండర్ ఐడెంటిటీలపై ప్రజల్లో అవగాహన ప్రారంభమైంది. ఆడ, మగ అనే కాదు... జండర్‌లో ఎన్నో వైవిధ్యాలు ఉన్నాయన్న విషయం ప్రజలకు తెలియాలి. ఇంకా ప్రయాణించాల్సిన దూరం చాలా ఉంది. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలి. లేకపోతే వారు భిక్షాటన, సెక్సువర్కు చేసుకుంటూ బతకాల్సి వస్తోంది. వారికి ప్రత్యేక హక్కులు కల్పిస్తూ చట్టాలు రావాలి."

**-శ్రావణి**

## ఎంఎన్‌సీల ప్రోత్సాహం...



"మాది విజయవాడ. నేను సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌ని. నా జెండర్‌ని 'ఎసెక్సువల్'గా పేర్కొంటా. చిన్నతనంలో నేను విపరీతంగా లైంగిక దాడులకు గురవడం వల్ల భయకంపితుడినయ్యాను. వైవిధ్య భరితమైన జీవితాలు, భిన్న జాతులు, సంస్కృతి, మతాలు, కులాలు, జీవనశైలి, తెగలు ఉన్న మన దేశంలో ఆర్టికల్ 377ను రద్దు చేయడం గొప్ప విషయం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 మనిషి గోప్యత గురించి చెపుతుంది. 377వ అధికరణాన్ని రద్దు చేయకపోతే మనుషుల వ్యక్తిగత గోప్యతకు భద్రత ఉండదు. వారికి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అతిక్రమించినవారమవుతాం. ఇకపోతే ట్రాన్స్‌జెండర్లను ప్రత్యేక జండర్‌గా 2016లో గుర్తించారు. విద్య, ఉపాధి ఉన్న రిజర్వేషన్‌లలో తమకు ఒక శాతం ఇవ్వమని మాత్రమే ట్రాన్స్‌జెండర్లు కోరుతున్నారు. 377 రద్దు తర్వాత పలు ఎంఎన్‌సి కంపెనీలు ఎల్‌జీబీటీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. అంతేకాదు ట్రాన్స్‌జండర్లు సెక్సు మార్పిడి ఆపరేషన్లు చేయించుకోవాలనుకుంటే రుణ సౌకర్యం ఎంఎన్‌సీలు కల్పిస్తున్నాయి. పలు ఎంఎన్‌సీ కంపెనీల్లో ఇటీవల న్యూట్రల్ టాయ్‌లెట్లను కూడా పెడుతున్నారు. సెక్సువల్ దృష్టిలోంచో, లేదా జండర్ దృక్కోణంలోంచి కాకుండా మనిషిగా మమ్మల్ని చూడాలి. నేడు మనకు కావాల్సింది జెండర్ న్యూట్రాలిటీ.

**- శ్రవణ్‌కుమార్**

## హక్కుల కోసం...



'మొబ్బెర ఫౌండేషన్' జెండర్ ఆల్టర్నేటివ్ హక్కుల కోసం కృషిచేస్తోంది. ప్రధానంగా ట్రాన్స్‌జెండర్ల మీద దృష్టిసారించాం. ఎల్‌జీబీటీలు అన్ని రకాల స్వేచ్ఛను, హక్కులను కోరుకుంటున్నారు. అందరిలా వాళ్లు స్వేచ్ఛగా బయట మసలలేకపోవడం వారు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య. కుటుంబ సమస్యలు వీరికి ఎన్నో ఉన్నాయి. చాలా కుటుంబాల్లో వీరిని చిన్నచూపు చూడటమే కాక, అండగా ఉండాల్సింది పోయి అనేక అవమానాలకు గురి చేస్తున్నారు. దాంతో కొంతమంది ఇళ్లల్లోంచి బయటకు వచ్చి పోరాటం చేస్తున్నారు.

**- యశస్వీ,** 'మొబ్బెర ఫౌండేషన్' యాక్టివిస్టు

## లైంగిక హక్కులు సరిపోవు...



'ట్రాన్స్ జెండర్లు విప్లవాత్మకమైన సంస్కరణల దిశగా అడుగులు వేయాలి. వైద్యులు కూడా ఈ కమ్యూనిటీల పట్ల ప్రజల్లో అవగాహన తేవాలి. వీరికి చదువు చాలా అవసరం. 377వ అధికరణాన్ని రద్దు చేస్తే సరిపోదు. లైంగిక హక్కులు మాత్రమే వీళ్లు కోరుకోవడం లేదు. పౌరులతో సమానంగా సమానత్వం కోరుకుంటున్నారు. ఆ దిశగా సామాజిక అసమానతలు తొలగాలి. ఈ కమ్యూనిటీకి వసతి, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు లేకపోతే లైంగిక హక్కులకు అర్థం లేదు. ట్రాన్స్‌జెండర్లకు వ్యాపారాల్లో, అసెంబ్లీ, పార్లమెంట్లలో స్థానం కల్పించాలి'

**- వైజయంతి,** యాక్టివిస్ట్, న్యాయ సలహాదారు

• **నాగసుందరి,** ఫొటోలు: **జంపాల రాజేశ్**

డైటరీ హెల్త్



# ఇలాగైతే ఇట్టే జీర్ణం!

**రుచి నాలుక మీద ఉన్నంత వరకే!**
**అందుకే 'జిహ్వాచాపల్యం' అన్నారు!**
**అయినా వంటకాల ఘుమఘుమలు**
**ముక్కుకు సోకితే ఆగగలమా?**
**చటుక్కున అందుకుని లటుక్కున గుటకాయస్వాహా చేసేస్తాం.**
**పండగ రోజుల్లోనైతే నోరూరించే**
**పిండివంటలు ఎంచక్కా లాగించేస్తాం.**
**ఫలితం.... అజీర్తి, ఛాతిలో మంట, పొట్టలో నొప్పి!**
**పండగ తర్వాత కూడా ఈ సమస్యలు వేధిస్తూనే ఉంటాయి!**
**ఈ సమస్యలకు చరమగీతం పాడాలంటే?**

పిండిపదార్థాలు, మాంసకృత్తులు, పీచు... ఇలా పోషకాలన్నీ సమపాళ్లలో ఉన్న సమతులాహారం తీసుకుంటే జీర్ణవ్యవస్థ సమర్థంగా తన పని తాను చేసుకుపోతుంది. కానీ కొన్ని సందర్భాల్లో, మరీ ముఖ్యంగా పండగ రోజుల్లో చక్కెర, పిండిపదార్థాలు, కొవ్వులను పిండివంటల రూపంలో, ఎక్కువ పరిమాణాల్లో తీసుకుంటూ ఉంటాం. అయితే వాటిని అరిగించుకోవాలంటే జీర్ణవ్యవస్థకు సరిపడా సమయం ఇవ్వాలి. కానీ మామూలుగా తినే భోజనంతో పాటు స్వీట్ల పేరుతో పిండి వంటకాలను కూడా తినేయడంతో అరుగుదల సమస్యలు మొదలవుతాయి. ఆ సమయంలో కనిపించే లక్షణాలు....

- కడుపు ఉబ్బరం
- పొట్టలో నొప్పి
- తేన్పులు
- అజీర్తి
- జిగట విరేచనాలు

## తీపి ప్రభావం!

తీపి అందరికీ ఆరోగ్యకరం కాదు. మరీ ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన వారిలో అవసరానికి మించి తోడయ్యే అధిక చక్కెరలను శరీరం శక్తిగా మలుచుకోలేదు. పైగా చక్కెర స్థాయులు పెరిగేకొద్దీ వీరిలో ఆందోళన, చికాకు లాంటి మానసిక అసమతౌల్యాలు మొదలవుతాయి. ఆహారం అరుగుదలలో కాలేయం పాత్ర ప్రధానం. పిండి వంటకాల్లోని అధిక చక్కెరలను శక్తిగా మార్చుకోవడంలో కాలేయం విఫలమవడంతో, అవి కొవ్వు రూపంలో కాలేయంలోనే నిల్వ ఉండిపోతాయి. ఇది ప్రమాదకరం. మధుమేహులు తీపి తినేసి, షుగర్ మాత్ర మరొకటి వేసుకుంటే సరిపోతుంది అనుకుంటారు. కానీ ఇది సరి కాదు. తక్కువ చక్కెరతో తయారైన తీపి పదార్థాలను అరుదుగా కొద్ది పరిమాణాల్లో తీసుకుంటే ఫరవాలేదు. అయితే ఈ విషయాన్ని ముందుగానే వైద్యులకు చెప్పి, తీసుకునే మందుల్లో ఎలాంటి మార్పులు చేసుకోవాలో అడిగి తెలుసుకోవాలి.

## కాలేయం, జీర్ణాశయం మీద ఒత్తిడి!

పండగ రోజుల్లో చేసే ప్రధాన వంటకాలు అరిసెలు, కజ్జికాయలు, బాదుషా లాంటివన్నీ నూనెలో వేగించేవే! వీటిలో తీపితో పాటు నూనె పరిమాణం కూడా ఎక్కువగా ఉంటుంది. వీటికి తోడు గారెలు, బూరెలు, బొబ్బట్లు... వీటి తయారీలో నెయ్యి వాడతారు. ఈ పిండివంటలన్నీ అధిక కొవ్వులు, చక్కెర, పిండిపదార్థాలతో నిండి ఉంటాయి. నూనెలను అరిగించడానికి కాలేయం నుంచి జీర్ణరసాలు అధికంగా విడుదల కావలసి ఉంటుంది. అధిక నూనెలతో కూడిన పిండివంటకాలు తిన్నప్పుడు కాలేయం, జీర్ణాశయాల మీద ఒత్తిడి పెరుగుతుంది. దాంతో మధ్యవయస్కులు, 50 ఏళ్లు పైబడిన వారిలో అజీర్తి సమస్యలు మొదలవుతాయి.



### అజీర్తి చేయకుండా ..

అజీర్తి సమస్యలు తలెత్తకుండా పండగనాటి పిండివంటలను ఆస్వాదించాలంటే కొన్ని నియమాలు పాటించాలి. అవేంటంటే....

- భోజనం తర్వాత మాత్రమే మితంగా ఒకటి లేదా రెండు పిండివంటలు ఆస్వాదించాలి.
- ఏం తిన్నా, ఎప్పుడు తిన్నా పరిమితంగా తినాలి.
- రుచికరంగా ఉన్నాయి కదా అని ఒకేసారి అన్ని వంటకాలు రుచి చూస్తూ, భారీగా భోజనం చేయకూడదు.
- రోజుకు మూడు పూటలా కడుపు నిండా తినడం కన్నా, అదే ఆహార పరిమాణాన్ని 6 విడతల్లో తక్కువ పరిమాణాల్లో తీసుకుంటే జీర్ణవ్యవస్థ మెరుగ్గా పని చేస్తుంది.



**డాక్టర్ భవానీ రాజు**
సీనియర్ కన్సల్టెంట్
గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
హైదరాబాద్

## వృద్ధులు పిండివంటలు మితంగా తినాలి!

సెనగపిండి, మినప్పిండి, బియ్యం పిండి లాంటివి పూర్తిస్థాయి పిండిపదార్థాలే! వీటిలో అదనపు పోషకాలు ఉండవు. వీటిని జీర్ణం చేసుకోగలిగే శక్తి, జీర్ణం కావడానికి అవసరమైన జీర్ణరసాలు వృద్ధుల్లో ఉత్పత్తి కావు. కాబట్టి వృద్ధులు పిండివంటలను సాధ్యమైనంత తక్కువగా తీసుకోవాలి. వీరిలో చక్కెర స్థాయులు కూడా ఉన్నపళాన హెచ్చుతగ్గులకు గురవుతూ ఉంటాయి. దాంతో తలనొప్పి, తల తిరుగుడు లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి మధుమేహులు తీపి పదార్థాలకు దూరంగా ఉండడమే మేలు. వృద్ధుల్లో ఆహారనాళం, జీర్ణాశయం కలిసే జంక్షన్ బలహీనంగా ఉంటుంది. దాంతో పరిమితికి మించి తింటే, యాసిడ్లు గొంతులోకి ఎగదన్నుతాయి. దాంతో ఛాతిలో మంట, ఛాతి పట్టేయడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. రాత్రి వేళ నిద్రాభంగం కలుగుతూ ఉంటుంది.

## పిల్లలు ఏం తింటున్నారో గమనించాలి!

ఓ పక్క అమ్మలు పిండివంటలు చేస్తుంటే, మరోపక్క వండినవి వండినట్టు పిల్లలు తినేస్తూ ఉంటారు. పండగ సెలవులు కాబట్టి పిల్లలకు తెలియకుండా, చాటుగా పిండివంటలు వండడం వీలయ్యే పని కాదు. పైగా వాళ్లు ఇష్టంగా అందుకుని తింటూ ఉంటే, పెద్దలూ వారించలేరు. దాంతో పిల్లలు రోజంతా వాటితోనే కడుపు నింపుకొంటూ భోజనం మానేస్తూ ఉంటారు. పిండివంటల్లో ప్రధానంగా ఉండేవి పిండిపదార్థాలు, చక్కెరలే! మాంసకృత్తులు, పీచు వీటిలో అతి తక్కువ. దాంతో పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తుతుంది. అజీర్తి సమస్యలూ మొదలవుతాయి. కాబట్టి పిల్లలను కొంత కట్టడి చేయక తప్పదు. భోజనం చేస్తేనే స్వీటు ఇస్తానంటూ కండిషన్లు పెట్టి, పిల్లల చేత ఆహారం తినిపించాలి. పిండివంటకాలతో పాటు తాజాపండ్లు, సలాడ్లు కూడా తినేలా ప్రోత్సహిస్తే మలబద్ధకం లాంటి సమస్యలు తలెత్తవు. అలాగే నీళ్లు సరిపడా తాగేలా చూడాలి.

హోమియో

# అజీర్తికి అడ్డుకట్ట

ఆకలి.. తీసుకున్న ఆహారం జీర్ణం కావడం... మలమూత్ర విసర్జన... ఇవన్నీ జీర్ణమండల విధుల్లో అత్యంత కీలకమైనవి. మౌలికంగా మనిషికి ఆకలిని కలిగించే ప్రధాన కారణభూతం మెదడులోని 'హైపోథాలమస్'. ఇది నాడులు, హార్మోన్ల ప్రభావంతో పనిచేస్తుంది. జీర్ణమండలంలోని ఆయా భాగాలు, వాటి విధులను ఏమాత్రం సక్రమంగా నిర్వహించకపోయినా, వెనుకో ముందో మనిషి ఏదో ఒక వ్యాధి బారిన పడటం ఖాయం. అందువల్ల జీర్ణవ్యవస్థలో కనిపించే తేడాలు, లోపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైన వైద్య చికిత్సలను వెనువెంటనే తీసుకోవడం చాలా అవసరం.

**వైద్యపరంగా.....**

- సరిపడా నిద్ర, నిర్దిష్ట వేళల్లో భోజనం లేకపోవడం వంటి కారణాలతో ఛాతిలో మంట, కడుపులో బరువు, జీర్ణం కాని పదార్థాలు వాంతి కావడం, మాటిమాటికీ విరేచనానికి వెళ్లాలనే భావన కలిగే వారికీ, టీ, కాఫీలు, పొగాకు మత్తు పదార్థాలు అతిగా తీసుకోవడం వల్ల అజీర్తి, పుల్లటి తేన్పులు వస్తున్న వారికీ 'నక్స్ వామికా - 30' మందు బాగా పనిచేస్తుంది.
- పుల్లటి తేన్పులు, వాంతులు, భోజనం తర్వాత కడుపులో బరువు, ఛాతిలో మంట, కడుపు ఉబ్బరం, తలనొప్పి ఉంటే 'నేట్రంఫాస్-30' మందు వేసుకోవాలి.
- కొవ్వు పదార్థాలు, నూనెలు, కేకులు, స్వీట్స్ అతిగా తినడం వల్ల కలిగే అజీర్తి బాధలకు 'పల్సటిల్లా - 30' చక్కని మందు.
- పొట్టలో వాయువు ఎక్కువగా చేరి కొందరికి బాగా ఆకలి అనిపిస్తుంది. కానీ, కొంచెం తినగానే కడుపు నిండినట్లు అనిపిస్తుంది. కడుపు ఉబ్బరం, పొత్తికడుపులో బరువు, తేన్పులు, తరచూ అపాన వాయువులు విడుదల కావడం వంటి సమస్యలు ఉన్నప్పుడు 'లైకోపోడియం - 30' మందులు ఉపశమనం కలిగిస్తాయి.
- నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినడం వల్ల కలిగే బాధలకు, పుల్లటి వాంతులు, తేన్పులకు, తీపి పదార్థాలు తినగానే పులిసిన లక్షణాలు, ఛాతిలో మంట వంటి లక్షణాలకూ సల్ఫర్- 30 మందు బాగా పనిచేస్తుంది. ఆ తర్వాత 'కాల్కేరియా కార్బ్ - 30' మందు వేసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుంది.
- ఆకలి మందగించడం, వికారం, నీళ్ల విరేచనాలు, కడుపులో మంట, పుల్లటి పండ్లు, మత్తు పానీయాలు సేవించడం వల్ల కలిగే బాధలకు 'ఆర్సెనిక్ ఆల్బ్ - 30' మందు ఎంతో సమర్థంగా పనిచేస్తుంది.
- అజీర్ణం, వికారంతో పాటు వాంతులు, అజీర్ణ విరేచనాలు, వెక్కిళ్లు ఉంటే 'ఇపికాక్ - 30' మందు వాడితే మంచి ప్రయోజనం ఉంటుంది.

**- డాక్టర్ బి. అనిల్ కుమార్**
హోమియో
వైద్య నిపుణులు,
హైదరాబాద్



ఆయుర్వేదం



# జీర్ణం జీర్ణం... వాతాపి జీర్ణం!

ఆకలి లేకపోయినా తినడం, అతిగా తినడం, వేళ తప్పి తినడం, చిరుతిళ్లు, నిద్రలేమి, ఆహారంలో పీచుపదార్థం లేకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం వంటివి అజీర్తి వెనకున్న అనేక కారణాల్లో కొన్ని. వీటి నుంచి బయటపడడానికి జీవనశైలిలో మార్పులు చేసుకుంటూనే ఆహారంలో కొన్ని రకాల పదార్థాలు చేర్చుకోవడం చాలా అవసరం.

- అల్లం రెండు రకాలుగా ఉపయోగపడుతుంది. పరగడుపున తీసుకుంటే ఆకలి పెరుగుతుంది. భోజనం తర్వాత తీసుకుంటే జీర్ణశక్తి పెరుగుతుంది. తేన్పులు, కడుపు ఉబ్బరం, ఛాతిలో మంట, వికారం, వాంతి భావన తగ్గుతాయి. భోజనానికి ముందు అయితే అల్లం రసంలో తేనె కలిపి తీసుకోవచ్చు. భోజనంలో అయితే అల్లం చట్నీ వేసుకోవచ్చు. పచ్చి అల్లం ముక్కల్ని తేనెలో ముంచి కూడా తినవచ్చు.
- తమలపాకులో లవంగాలు, యాలకులు సోంపు వేసుకుని భోజనం తర్వాత తినవచ్చు. తమలపాకులో జాజికాయ ముక్క వేసుకుంటే జీర్ణక్రియ బాగా జరగడంతో పాటు రాత్రివేళ నిద్ర పట్టని వారికి ఆ సమస్య తొలగిపోతుంది.
- మెంతులు, సోంపు, నల్ల జీలకర్ర వేగించి, పొడి చేసుకుని భోజనం తర్వాత నోట్లో వేసుకుంటే అజీర్తి సమస్యలు తొలగిపోతాయి.
- భోజనం తర్వాత కాసేపు ఎడమ వైపు పడుకుంటే జీర్ణక్రియ మెరుగ్గా జరుగుతుంది.
- దాల్చిన చెక్క పొడి జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేసేందుకు తోడ్పడుతుంది. షుగర్ నిల్వల్ని నియంత్రిస్తుంది.
- భోజనం తర్వాత భాస్కర లవణం వేసుకుంటే, జీర్ణక్రియ సులువవుతుంది.
- జీలకారిష్టం, అర్జునారిష్టం ఇలా అరిష్టాలుగా పేర్కొనే ద్రావణాలన్నీ ఆమ్లాన్ని తగ్గించడంతో పాటు జీర్ణవ్యవస్థను ఉత్తేజితం చేస్తాయి.
- భోజనానికి గంట ముందు గోరువెచ్చని నీళ్లల్లో తేనె కలిపి తీసుకోవడం వల్ల గానీ, నిమ్మరసం కలిపి తీసుకోవడం వల్ల గానీ, ఆహారం సులువుగా జీర్ణమవుతుంది.
- వేడి అన్నంలో నెయ్యి వేసుకుని రెండు చిటికెల సైంధవ లవణం కలిపి తొలి మూడు ముద్దలు తింటే సులభంగా జీర్ణమవుతుంది.
- అరచెంచా ఇంగువ, ఐదారు చుక్కల నెయ్యి వేసి కాస్త వేగించి, ఆ పొడిని అన్నం తొలి మూడు ముద్దల్లో తింటే హాయిగా జీర్ణమవుతుంది.
- త్రికటు (శొంఠి, మిరియాలు, పిప్పళ్ళు సమ భాగాల్లో కలిపిన పొడి) చూర్ణాన్ని రెండు చిటికెలంత ఆహారంతో పాటే తీసుకుంటే సుఖంగా జీర్ణమవుతుంది.
- లవంగాదివటి లేదా జీలకాది చూర్ణం జీర్ణశక్తిని బాగా పెంచుతాయి.
- భోజనం చేసే సమయంలో మనసును ఆహారం మీదే లగ్నం చేయడం అవసరం. అలా లేకపోతే, అవసరమైన జీర్ణరసాలు ఉత్పన్నం కాక అజీర్తి సమస్య తలెత్తుతుంది.
- ధనియాలు వేసి మరిగించిన నీటిని తాగితే జీర్ణశక్తి బాగుంటుంది.
- బొప్పాయి పండు తింటే, జీర్ణశక్తి పెరగడంతో పాటు, మలబద్ధకం తొలగిపోతుంది. రోజూ ఒక యాపిల్ పండుగానీ, జామ పండుగానీ తీసుకోవడం ఎంతో అవసరం.
- భోజనం తర్వాత ఓ 10 నిమిషాలు వజ్రాసనంలో కూర్చుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది.



**- డాక్టర్ డి. విఠల్ రావు**
రిటైర్డ్ ప్రొఫెసర్
ప్రభుత్వ బి.ఆర్.కె.ఆర్ ఆయుర్వేద
కళాశాల, హైదరాబాద్

రెమెడీ

# కఫం కరగాలంటే?

శీతాకాలం కఫం సమస్య సర్వసాధారణం. అయితే ఊపిరితిత్తుల్లోని కఫం బయటకొస్తేగానీ దగ్గు, జలుబు, జ్వరం తగ్గవు. దాన్ని బయటకి రప్పించటం కోసం ఈ గృహవైద్యం ఉపయోగపడుతుంది. ప్రయత్నించండి.

**లెమన్ టీ:** బ్లాక్ టీకి ఒక టీస్పూన్ నిమ్మరసం, ఒక టీస్పూన్ తేనె కలిపి తాగండి.

**యూకలిప్టస్ ఆయిల్:** కఫాన్ని కరగించే పురాతనమైన గృహ చిట్కా ఇది. కొబ్బరి నూనెలో యూకలిప్టస్ ఆయిల్ కలిపి ఛాతీ మీద రాసుకోవాలి.

**ద్రాక్ష:** ఊపిరితిత్తులకు ఉపశమనాన్నిచ్చి కఫాన్ని అక్కడి నుంచి బయటకి తెప్పించటంలో ద్రాక్ష సమర్థమైనది. కాబట్టి ద్రాక్ష రసం తాగండి.

**నిమ్మకాయ:** శరీరం నుంచి కఫాన్ని పారదోలాలంటే నిమ్మ చెక్కకు ఉప్పు, మిరియాల పొడి అద్ది నాకుతూ ఉండాలి.

**ఉప్పు నీటి పుక్కిలింత:** గ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక టేబుల్‌స్పూను ఉప్పు కలిపి తలను కొద్దిగా వెనక్కి వంచి ఈ నీళ్లతో నోరు పుక్కిలించాలి. ఇలా చేసిన కొద్ది నిమిషాలకే కఫం వదులై బయటకొస్తుంది.

**మిరియాలు, పసుపు:** వేడి పాలలో అర టీస్పూను మిరియాల పొడి, చిటికెడు పసుపు కలుపుకుని తాగితే ఉపశమనం కలిగి కఫం కూడా బయటకొస్తుంది.

**అల్లం రసం:** వేడి నీటిలో ఒక టేబుల్‌స్పూను అల్లం రసం, ఒక టీస్పూను తేనె కలుపుకుని నెమ్మదిగా తాగాలి.



హార్మోనల్ హెల్త్

# నా అనుమానాలు తీరేదెలా?

**డాక్టర్! నాకు మరికొద్ది రోజుల్లో పెళ్లి కాబోతోంది. మద్యం, ధూమపానం అలవాట్లు ఉన్నాయి. అధిక బరువుతో బాధపడుతున్నాను. అయితే మద్యం తాగడం ప్రారంభించిన కొత్తలో స్తంభనాలు బాగా ఉండేవి. ఇప్పుడు ఆ తీవ్రత తగ్గింది. అలాగే లైంగిక సామర్థ్యం గురించి, పిల్లల గురించి కూడా నాకు ఎన్నో అనుమానాలు ఉన్నాయి. పెళ్లి అయిన తర్వాత భంగపడే బదులు, సంసారానికి, పిల్లలు కనడానికి నేను పూర్తిగా అర్హుడిని అని తెలుసుకోవాలంటే ఏం చేయాలి? ఈ అంశాలను నిర్ధారించే పరీక్షలు ఏవైనా ఉన్నాయా?**

**- అభిషేక్,** హైదరాబాద్

మీ లాంటి ఎంతోమంది పురుషులకు పెళ్లికి ముందు ఇలాంటి అనుమానాలు తలెత్తడం సహజం. అయితే వీటి నివృత్తి కోసం వైద్యులను కలవాలి. మీకు తలెత్తిన అనుమానాలను నిర్ధారించుకోవడానికి పరీక్షలు కూడా ఉన్నాయి. వీర్యకణాల సంఖ్య తెలుసుకోవడం కోసం స్పెర్మ్ టెస్ట్, టెస్టోస్టిరాన్, థైరాయిడ్ హార్మోన్లలో అవకతవకలు తెలుసుకోవడం కోసం హార్మోన్ పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది. ఈ పరీక్షల్లో హెచ్చుతగ్గులు ఉంటే, మందులతో సరిదిద్దుకోవచ్చు. స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉన్నా, దాన్ని పెంచే మందులు ఉన్నాయి. కాబట్టి కంగారుపడవలసిన అవసరం లేదు. పురుషులకు సంబంధించిన ఎన్నో రకాల సమస్యలకు సమర్థమైన మందులు, చికిత్సలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఇక మీకు ఉన్న అధిక బరువు కూడా హార్మోన్లలో అవకతవకలకు కారణం కావచ్చు. మద్యం తాగడం అలవాటు అయిన ప్రారంభంలో స్తంభనాలు ఎక్కువగా ఉండడానికి కారణం మందు ఇచ్చే కిక్. క్రమేపీ మద్యానికి అలవాటు పడడం వల్ల తర్వాతి కాలంలో స్తంభనాలు అంత తీవ్రంగా ఉండకపోవచ్చు. అయితే మీరు బరువు పెరగడానికి మద్యం కూడా ఓ కారణమే. మద్యం వల్ల శరీరంలో హార్మోన్ స్రావాల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. కాబట్టి పరీక్షల ఫలితాలతో పని లేకుండా మద్యం, ధూమపానానికి స్వస్తి పలకండి. అధిక బరువు తగ్గించుకోవడం కోసం క్రమం తప్పక వ్యాయామం చేయండి. అర్థం లేని అనుమానాలు వదిలి పెళ్లికి సిద్ధపడండి.



**- డాక్టర్ రాహుల్ రెడ్డి**
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్
8332850090
(కన్సల్టేషన్ కోసం)



బోన్ హెల్త్

# కీళ్లు దృఢంగా ఉండాలంటే?

కీళ్లు తేలికగా అరిగిపోకుండా ఉండాలంటే నిర్దిష్టమైన పదార్థాలు తీసుకోవాలి. కీళ్ల మధ్య మృదులాస్థి గట్టిపడిపోకుండా చేసే ఆ ఆహారం ఏదంటే?

**నీళ్లు:** కీళ్ల దగ్గర ఉండే మృదులాస్థి, ఇతర కణజాలాల మధ్య రాపిడి పెరగకుండా ఉండడం కోసం 'సైనోవియల్ ఫ్లూయిడ్' అనే ద్రవం ఉంటుంది. కీళ్లు కదిలేటప్పుడు ఈ ద్రవం ఆ ప్రదేశంలో ఒరిపిడి లేకుండా చేస్తుంది. ఈ ద్రవం సరిపడా తయారవాలంటే రోజుకు రెండు లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగుతూ ఉండాలి.

**ఉల్లి, వెల్లుల్లి:** ఎముకలు, మృదులాస్థి, టెండాన్ల తయారీకి తోడ్పడే ఖనిజ లవణాలు ఉల్లి, వెల్లుల్లిలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి కీళ్లు, మృదులాస్థి, టెండాన్లు, కొల్లాజెన్ ఆరోగ్యంగా ఉండాలంటే ఉల్లి, వెల్లుల్లి తరచుగా తింటూ ఉండాలి.

**విటమిన్ సి:** నారింజ, బత్తాయి, స్ట్రాబెర్రీ, నిమ్మలో ఉండే ఒమేగా 3, విటమిన్ సిల శరీరంలో తలెత్తే ఇన్‌ఫ్లమేషన్‌ను కుంటుపరుస్తాయి. కీళ్ల దగ్గర ఉండే మృదులాస్థి, కొల్లాజెన్ వృద్ధికి దోహదపడతాయి.



## డైలీ సుడోకు -178

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 9 | 3 | 7 | | | | | 5 |
| | 4 | | | | 3 | | | |
| 8 | | | | 4 | | | | 3 |
| | | 7 | 5 | | | | 3 | 4 |
| | 8 | | | | | | 5 | |
| 4 | 1 | | | | 2 | 9 | | |
| 9 | | | | 7 | | | | 2 |
| | | | 8 | | | | 4 | |
| 6 | | | | | 4 | 3 | 7 | |

**సుడోకు - 177 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 8 | 7 | 4 | 9 | 3 | 2 | 1 | 5 |
| 1 | 9 | 5 | 6 | 2 | 7 | 4 | 8 | 3 |
| 2 | 3 | 4 | 1 | 8 | 5 | 6 | 7 | 9 |
| 3 | 7 | 1 | 2 | 6 | 9 | 8 | 5 | 4 |
| 8 | 5 | 2 | 7 | 3 | 4 | 1 | 9 | 6 |
| 4 | 6 | 9 | 8 | 5 | 1 | 3 | 2 | 7 |
| 5 | 4 | 6 | 9 | 1 | 2 | 7 | 3 | 8 |
| 9 | 1 | 8 | 3 | 7 | 6 | 5 | 4 | 2 |
| 7 | 2 | 3 | 5 | 4 | 8 | 9 | 6 | 1 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

# సౌండు... రీసౌండు!



మహేశ్‌బాబు



బాలకృష్ణ

**దీపావళి రాత్రి దేశమంతా బాణాసంచా మోత మోగింది. సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలుగు సినిమా ప్రేక్షకులకు అంతకుమించి అనేలా మన హీరోలందరూ కొత్త లుక్కులు-ఫస్ట్ లుక్కులు, సినిమా కబుర్లు, పాటలు, ట్రైలర్లు, అనౌన్స్‌మెంట్లతో దీపావళి బాణాసంచాను మించిన పటాసులు వెలిగించి ప్రేక్షకుల ముందు వదిలారు. దీపావళి బాంబుల సౌండ్ తెల్లారికి సైలెంట్ అయితే... తెలుగు సినిమా ఇండస్ట్రీ వెలిగించిన బాంబులు ఇంకా రీసౌండ్ చేస్తున్నాయి. ఈ దీపావళికి తెలుగు తారలందరూ కలిసి సూపరో సూపర్ అనిపించారు.**

### లుక్... కిక్!

దీపావళికి నందమూరి అభిమానులకు బాలకృష్ణ డబుల్ బొనాంజా ఇచ్చారు. కెఎస్ రవికుమార్ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రానికి 'రూలర్' టైటిల్ ఖరారు చేసినట్టు ప్రకటించారు. అలాగే, సినిమాలో ఆయన రెండో లుక్, మోషన్ పోస్టర్ విడుదల చేశారు. పోలీసాఫీసర్‌గా బాలకృష్ణ లుక్ పవర్‌ఫుల్‌గా, టెన్ థౌజెండ్‌వాలా టైపులో ఉందంటున్నారు అభిమానులు. 'వెంకీమామ'లో మామాఅల్లుళ్లు వెంకటేశ్, నాగచైతన్య కొత్త లుక్కులూ విడుదల చేశారు. గడ్డంతో వెంకటేశ్, ఆర్మీ డ్రస్సులో నాగచైతన్య... సీరియస్ లుక్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'సరిలేరు నీకెవ్వరు'లో మహేశ్ బాబు లుక్ ఎప్పుడో విడుదలైంది. దీపావళికి ఆయన బుల్లెట్ మీదొచ్చారు. ఎప్పటిలా హ్యాండ్సమ్‌గా, స్టైల్‌గా ఉన్నారు. బుల్లెట్ బీటింగ్‌లా ఈ కొత్త స్టిల్ దీపావళికి సూపర్ సౌండ్ చేసింది. ఈ సినిమాతో పదమూడేళ్ల తర్వాత వెండితెరపైకి పునరాగమనం చేస్తున్న విజయశాంతి లుక్‌ను రివిల్ చేశారు. అలాగే హీరోయిన్ రష్మిక మందన్న కుటుంబాన్నీ ప్రేక్షకులకు చూపించారు. నవీన్ చంద్ర 'హీరో హీరోయిన్' కొత్త పోస్టర్‌నూ విడుదల చేశారు.



విజయశాంతి



వెంకటేశ్, నాగచైతన్య

### రాములో... రీసౌండ్‌రో!

అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అల... వైకుంఠపురములో' రెండో పాట 'రాములో రాములా' విడుదలైన 24 గంటల్లో ఎక్కువ వ్యూస్ సాధించిన పాటగా రికార్డు సృష్టించింది. యూట్యూబ్‌లో, సోషల్ మీడియాలో... ఎక్కడ చూసినా ఈ పాటే. భూచక్రంలా గిర్రున తిరుగుతూ రీసౌండ్ చేస్తోంది. 'అప్పుడు ఇప్పుడు' టైటిల్ సాంగును కె. విశ్వనాథ్ విడుదల చేశారు.



'అల... వైకుంఠపురములో' ఓ దృశ్యం

### కొత్త బాంబులు...

ఈ దీపావళికి ప్రేక్షకుల ముందుకొచ్చిన కొత్త సినిమా బాంబులు... అదే ఫస్ట్ లుక్కులు నితిన్ 'భీష్మ', రామ్ 'రెడ్', కల్యాణ్‌దేవ్ 'సూపర్ మచ్చి'. 'ఛలో' తర్వాత వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భీష్మ'. హీరోయిన్ రష్మిక నడుమును పట్టుకోవడానికి నితిన్ చేసే ప్రయత్నాన్ని ఫస్ట్ లుక్‌గా విడుదల చేశారు. సినిమాలో యాక్షన్ ఉందని చెప్పడానికి మరో స్టైలిష్ పోస్టర్ విడుదల చేశారు. 'ఇస్మార్ట్ శంకర్' విజయం తర్వాత రామ్ హీరోగా నటిస్తున్న సినిమా 'రెడ్'. కిశోర్ తిరుమల దర్శకత్వంలో 'స్రవంతి' రవికిశోర్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్, రామ్ ఫస్ట్ లుక్‌ను సోమవారం విడుదల చేశారు. నవంబర్ 16న చిత్రీకరణ ప్రారంభించనున్నారు. చిరంజీవి చిన్న అల్లుడు కల్యాణ్‌దేవ్ హీరోగా నటిస్తున్న రెండో సినిమా 'సూపర్ మచ్చి' ఫస్ట్ లుక్‌నూ దీపావళి రోజున విడుదల చేశారు. విజయ్ శంకర్, మౌర్యాని జంటగా ఎస్. వెంకటరమణ దర్శకత్వంలో వడ్డాన మన్మథరావు నిర్మించిన 'దేవరకొండలో విజయ్ ప్రేమకథ' ఫస్ట్ లుక్‌ను దీపావళి సందర్భంగా శ్రీకాంత్ విడుదల చేశారు. రాహుల్ విజయ్ హీరోగా నటిస్తున్న 'కాలేజ్ కుమార్' ఫస్ట్ లుక్ విడుదలైంది.



రశ్మిక మందన్నా, నితిన్



'కమ్మరాజ్యంలో కడపరెడ్లు' చిత్రంలో ఓ దృశ్యం



రామ్



రియా చక్రవర్తి, కల్యాణ్‌దేవ్

### ట్రెండింగ్ ట్రైలర్!

హీరోలందరూ లుక్కులు, పాటలతో సందడి చేస్తే... సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 'కమ్మరాజ్యంలో కడపరెడ్లు' ట్రైలర్‌తో వచ్చారు. ఇది యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతోంది. నవంబర్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. వీటితో పాటు మరికొన్ని విశేషాలతో దీపావళికి కొందరు సినిమా తారలు సందడి చేశారు.



తనయుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌తో పవన్ కల్యాణ్

# తారల ఇంట సందడే సందడి!



కృష్ణంరాజు, రాఘవేంద్రరావు, సత్యానంద్, చిరంజీవి, మోహన్‌బాబు

ఎప్పుడూ షూటింగ్స్‌తో బిజీగా ఉండే తారలు దీపావళి వేడుకలు కుటుంబసభ్యులతో సంబరంగా జరుపుకొన్నారు. . మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో జరిగిన వేడుకలకు ఆయన తమ్ముళ్లు నాగబాబు, పవన్‌కల్యాణ్ కుటుంబసభ్యులతో హాజరయ్యారు. అలాగే విశిష్ట కథానాయకుడు డాక్టర్ మోహన్‌బాబు ఇంట్లో జరిగిన వేడుకలకు చిరంజీవి, కృష్ణంరాజు, ప్రభాస్ సహా పలువురు తారలు, కె.రాఘవేంద్రరావు, సత్యానంద్ తదితర సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. అదే విధంగా నాగార్జున, అమల దంపతులు కుటుంబసమేతంగా దీపావళి టపాసులు కాల్చారు. పండగ రోజున సంప్రదాయ దుస్తుల్లో తారలు మెరిసిపోయారు. ఈ దీపావళి ఫొటోలు నెట్టింట్లో సందడి చేస్తున్నాయి.



నాగార్జున, అమల, సమంత, నాగచైతన్య, అఖిల్

## ఒకరు గుండె... మరొకరు ప్రాణం



శ్రీవిష్ణు, నిక్కీ తంబోలి

శ్రీవిష్ణు, నిక్కీ తంబోలి జంటగా నటించిన చిత్రం 'తిప్పరా మీసం'. విజయ్ కృష్ణ ఎల్. దర్శకుడు. రిజ్వాన్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయిన ఈ చిత్రం నవంబర్ 8న విడుదల కానుంది. ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడుతూ "విజయ్‌తో 'అసుర' నుంచి జర్నీ చేస్తున్నా. మాకో ప్లాట్‌ఫామ్ కోసం రెండు, మూడు సినిమాలు నిర్మించాం. సరైన విజయం వచ్చాక ఇద్దరం కలిసి సినిమా చేద్దాం అనుకున్నాం. మంచి కథాంశంతో తెరకెక్కిన సినిమా ఇది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కి స్పందన బావుంది" అని చెప్పారు. "ఒక మంచి సినిమా చేద్దామని నేను, శ్రీవిష్ణు ఈ సినిమాని స్టార్ట్ చేశాం. తర్వాత అచ్యుత రామారావు, రిజ్వాన్ మాతో కలిశారు. సురేశ్ బొబ్బిలి చక్కని పాటలు, నేపథ్యం సంగీతం అందించారు" అని దర్శకుడు చెప్పారు. "ఈ కథకి శ్రీవిష్ణుని సెలెక్ట్ చేసుకున్నప్పుడే ,మేం సక్సెస్ అయ్యాం. సినిమాకి విజయ్ గుండె అయితే.. శ్రీవిష్ణు ప్రాణమని చెప్పొచ్చు" అని రిజ్వాన్ తెలిపారు.

## ప్రేక్షకులు ఇచ్చిన గిఫ్ట్ ఇది

**- కె.కె.రాధామోహన్**



కార్తీ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించిన 'ఖైదీ' చిత్రాన్ని అదే టైటిల్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు నిర్మాత కె.కె. రాధామోహన్. సినిమాకు వస్తున్న స్పందన గురించి రాధామోహన్ ఇటీవల విలేకర్లతో మాట్లాడారు. "విభిన్నమైన కథతో ఎంతో నమ్మకంగా సినిమా చేసిన కార్తీకి, తెలుగులో విడుదల చేసే అవకాశం ఇచ్చిన తమిళ నిర్మాతలు ప్రకాశ్‌బాబు, ప్రభు, వివేక్‌కు థాంక్స్. సినిమాలో హీరోయిన్, పాటలు లేకపోయినా రెండు గంటల ఇరవై నిమిషాలపాటు ప్రేక్షకుల్ని కూర్చొపెట్టిన దర్శకుడికే ఈ సక్సెస్ క్రెడిట్ దక్కుతుంది. ఈ దీపావళికి ప్రేక్షకులు మాకు ఇచ్చిన కల్ట్ బ్లాక్ బస్టర్ హిట్ ఈ సినిమా" అని అన్నారు.

## షాక్ ఇచ్చారు

**- తరుణ్ భాస్కర్**



'పెళ్లి చూపులు' సినిమాతో దర్శకుడిగా తన సత్తా చూపించి బడ్జెట్ చిత్రాలకు ఓ క్రేజ్ తీసుకొచ్చారు తరుణ్ భాస్కర్. 'ఫలక్‌నుమాదాస్'తో ఆయనలో మంచి నటుడు ఉన్నాడని నిరూపించారు. ఇప్పుడు హీరోగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. 'మీకు మాత్రమే చెప్తా'తో హీరోగా అలరించనున్నారాయన. షమ్మీర్ సుల్తాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని విజయ్ దేవరకొండ నిర్మించారు. అనసూయ, అభినవ్ గోమటం కీలక పాత్రధారులు. నవంబరు 1న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రం గురించి తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ "నేను హీరో కావడం విజయ్ దేవరకొండ ఇచ్చిన షాక్. ఓ రోజు ఫోన్ చేసి 'హీరోగా చేస్తావా' అనడిగితే సరదా కోసం అనుకున్నా. సీరియస్‌గా చెప్పడంతో ఓకే అన్నా. ఇందులో క్యారెక్టర్ కోసం కాస్త బరువు తగ్గాను. ప్రస్తుతం సోషల్ మీడియాలో మనకు సంబంధించిన ప్రతి విషయాన్ని పబ్లిక్ చేసేస్తున్నాం. ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో ఓ మనిషి గురించి అంచనా వేసేయొచ్చు అన్నంతగా మారిపోయాం. మనిషికి ప్రైవసీ ఎంత అవసరమో ఎంటర్‌టైన్‌మెంట్ వేలో చెబుతున్నాం. అవకాశం వచ్చిన ప్రతి సినిమాలో నటించాలని నాకు లేదు. యాక్టింగ్ కంటే దర్శకత్వానికే ఎక్కువ సంపాదన ఉంటుంది. ఇప్పుడు యాక్ట్ చేయడం వల్ల 'దర్శకుడిగా అవకాశాల్లేవ్. అందుకే యాక్టింగ్ వైపు వచ్చాడన్న మాటలూ వినిపిస్తాయని తెలుసు. అవన్నీ నేను పట్టించుకోను. షూటింగ్ అయ్యాక ఇంటికెళ్తే హాయిగా నిద్ర పడుతుంది. అందుకే హీరోగా సాహసం చేశా. దర్శకుడు షమ్మీర్ చాలా తెలివైనవాడు. అతనికి సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదని సెట్‌లోకి వెళ్లిన నాలుగు రోజులకే తెలిసింది. వెంకటేశ్‌గారితో చేయబోయే సినిమా క్రీడా నేపథ్యంలో ఉంటుంది. ఆ కథ మీద కొంత పరిశోధన చేయాల్సి వచ్చింది" అని అన్నారు.













# ఏపీపీఎస్సీ ఇంటర్వ్యూలు...
# రద్దు మంచిదే కానీ...



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... రాష్ట్ర స్థాయిలోని అన్ని విభాగాలు, శాఖల్లో ముఖ్యమైన పోస్టులను భర్తీ చేసే కీలక సంస్థ. గతంలో చోటుచేసుకున్న వివాదాలు, కోర్టు కేసులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసే అన్ని రకాల ఉద్యోగాల్లో ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేస్తూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ విషయానికి సంబంధించి నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇంటర్వ్యూ రద్దు నిర్ణయం ఫలితంగా ఏర్పడే అనుకూల, ప్రతికూల పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై విశ్రాంత ఐఏఎస్ అధికారి **బి.రామాంజనేయులు** ఆంధ్రజ్యోతి దిక్సూచితో మాట్లాడారు. ఆ వివరాలు..



ఇంటర్వ్యూను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించవచ్చు. ఈ నిర్ణయం నిరుద్యోగులలో ఇంటర్వ్యూ విధానం పట్ల ఉన్న అపోహలను దూరం చేస్తుంది. ఇంటర్వ్యూ అంటే ఒక రకమైన ఆందోళనతో ఉండే నిరుద్యోగులు, ఔత్సాహికులు చాలా మంది గ్రూప్-1, గ్రూప్-2 నియామక పరీక్షలకు దూరంగా ఉంటున్నారు. అయితే ప్రస్తుత నిర్ణయం ఫలితంగా అధిక శాతం మంది అభ్యర్థులు గ్రూప్-1, గ్రూప్-2 వంటి గెజిటెడ్ పోస్టులకు పోటీపడేందుకు కావల్సిన ప్రోత్సాహక వాతావరణం ఏర్పడుతుందని చెప్పొచ్చు.

## గ్రామీణ అభ్యర్థులకు ప్రయోజనం

ఇంటర్వ్యూ విధానంతో కొంత మంది అభ్యర్థులు ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చేవారు నష్టపోతున్నారు. ఇంటర్వ్యూలో వేసే మార్కుల విషయంలో పారదర్శకత లోపించడం, పక్షపాత ధోరణి వంటి అంశాల కారణంగా చాలా మంది అభ్యర్థులు రాత పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించినప్పటికీ ఇంటర్వ్యూలో తక్కువ మార్కులు పొందుతున్నారు. దీంతో ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతోంది. కాబట్టి ఈ నిర్ణయం గ్రామీణ అభ్యర్థులకు మేలు చేస్తుందని చెప్పొచ్చు. అదేవిధంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఎటువంటి ఆందోళన లేకుండా, ఒత్తిడి దూరంగా ఉండేందుకు కూడా ఈ నిర్ణయం దోహదం చేస్తుంది. నియామక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఏర్పడుతుంది.

## ఇంటర్వ్యూ మార్కులే కీలకం

ఏపీపీఎస్సీ గ్రూప్-1లో రాత పరీక్షకు 750 మార్కులు, ఇంటర్వ్యూకు 75 మార్కులు కేటాయించారు. ఇక్కడ ఇంటర్వ్యూకు నిర్దేశించిన మార్కులు రాత పరీక్షకు ఇచ్చే మార్కులతో పోల్చితే తక్కువే. కానీ ఈ ఇంటర్వ్యూ మార్కులే అభ్యర్థి ర్యాంక్, పోస్ట్‌ను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక్క మార్కు తేడాతో పోస్టింగ్‌ను కోల్పోయిన సందర్భాలు ఎన్నో కనిపిస్తాయి. నా వ్యక్తిగతంగా చూసుకుంటే 1985వ సంవత్సరంలో జరిగిన గ్రూప్-1 పరీక్షలో ఇంటర్వ్యూలో 300 మార్కులకుగాను 135 మార్కులే వచ్చాయి. ఇంకానాతోపాటు ఇంటర్వ్యూకు ఎంపికయిన కొంత మంది అభ్యర్థులకు 235 మార్కులు వేసారు. అంటే ఇంటర్వ్యూలోనే 100 మార్కుల తేడా రావడంతో చాలా మంది అభ్యర్థులు వారు కోరుకున్న సర్వీస్ పొందలేక పోవడం, మరికొందరికయితే అసలు ఉద్యోగం రాకపోవడం జరిగింది.

### అనుకూలతలు

ఇంటర్వ్యూ రద్దు నిర్ణయం వల్ల ఎన్నో అనుకూలతలు ఉంటాయి. ఇంటర్వ్యూలో మార్కుల మీద ఉన్న అపోహలు తొలగిపోతాయి. ప్రతిభావంతులకు ఒక విధమైన భరోసా లభిస్తుంది. పరీక్ష నిర్వహణ, నియామక ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తవుతుంది. పలుకుబడి లేదా ఆర్థికపరమైన వ్యవహారాలు ఇంటర్వ్యూలను ప్రభావితం చేస్తాయనే అనే అభిప్రాయానికి అవకాశం ఉండదు. ఇంటర్వ్యూల్లో సాధారణంగా గ్రామీణ లేదా తెలుగు మీడియం అభ్యర్థులు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కోవడం కనిపిస్తుంది. అటువంటి వారికి ఇంటర్వ్యూ రద్దు నిర్ణయం ఉపశమనం కలిగిస్తుంది. ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కులు వచ్చేలా చేస్తామని ప్రలోభాలకు గురి చేసే దళారీ వ్యవస్థను ఈ చర్యతో నిర్మూలించవచ్చు.

SI, PC, GROUP-II
143 SI, 2119 PC ఉద్యోగాలు సాధించిన సంస్థ
త్వరలో TS 15 వేలు, AP 17 వేలకు నోటిఫికేషన్స్
Fee: PC- 8,000/- SI- 12,000/-
తెల్ల రేషన్ కార్డు వారికి 6,000/- మాత్రమే
రాజధాని ఇన్‌స్టిట్యూట్ దిల్‌సుఖ్‌నగర్, HYD 9959430501 9885361057

### ప్రతికూలతలు

ఇంటర్వ్యూ రద్దు నిర్ణయం మొత్తమ్మీద పాజిటివ్‌గా కనిపించినా కొన్ని ప్రతికూలతలు కూడా ఉంటాయి. ఇంటర్వ్యూ లేకపోవడంతో అభ్యర్థి వ్యక్తిత్వాన్ని పూర్తి స్థాయిలో కొలవడం సాధ్యం కాదు. ప్రభుత్వోద్యోగిగా ఎన్నో కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. కాబట్టి ఎంపికయిన వారి వ్యక్తిత్వాన్ని మూల్యాంకనం చేయడం తప్పనిసరి. ముఖ్యంగా ప్రజలకు సేవ చేయడంలో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సమస్యా పరిష్కార సామర్థ్యం, సమయస్ఫూర్తి వంటి నైపుణ్యాలు ఎంతో అవసరమవుతాయి. ఇంటర్వ్యూ లేకపోతే ఇటువంటి స్కిల్స్ అభ్యర్థిలో ఉన్నాయో లేవో పరిశీలించడం కష్టమవుతుంది. కేవలం రాత పరీక్షతో ఇటువంటి సామర్థ్యాలను నిర్ధారించడం సాధ్యం కాదు. రాత పరీక్ష ఆధారంగానే తుది ఎంపిక ఉంటుంది. కాబట్టి ఈ ప్రక్రియలో అవకతవలకు పాల్పడే అవకాశం కూడా లేకపోలేదు. అందుకే ఈ విషయంలో సంబంధిత సంస్థలు పకడ్బందీగా వ్యవహరించాల్సి ఉంటుంది.

### కొన్ని సూచనలు..

ఏపీపీఎస్సీ నియామక పరీక్షల్లో ఇంటర్వ్యూను ఎత్తి వేయడం అనేది అత్యధిక మంది హర్షించే నిర్ణయం. అయినప్పటికీ కొన్ని నిబంధనలను తప్పకుండా పాటించడం మంచిది. అవి.. ప్రధాన పరీక్షలో ప్రశ్నలకు రాసే సమాధానాలు విశ్లేషణాత్మకంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. ఇంటర్వ్యూలో అభ్యర్థుల నుంచి ఏయే అంశాలు ఆశిస్తున్నారో అవన్నీ సమాధానాల్లో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు తగ్గట్టుగా ప్రశ్నపత్రం స్వరూపం ఉండేలా చూసుకోవాలి. డైరెక్ట్ ప్రశ్నలు -సమాధానాలు అనే పద్ధతి కాకుండా అనేక విశ్లేషణలతో జవాబు ముడిపడి ఉండేలా ప్రశ్నలను రూపొందించాలి. పరీక్ష సమయంలో కాపీ చేయడానికి వీలు లేకుండా చూడాలి. ప్రధాన పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం అత్యంత గోప్యతతో జరిగేలా జాగ్రత్త వహించాలి. రిజర్వేషన్‌తో కూడిన మెరిట్ లిస్ట్ తోపాటు ఎంపికయిన అభ్యర్థుల జాబితాను కూడా ప్రకటించాలి. ఇటువంటి చర్యలను చేపడితే ఇంటర్వ్యూ రద్దు నిర్ణయాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయవచ్చు.

### రెగ్యులర్‌గా నోటిఫికేషన్లు ఇవ్వాలి

ప్రస్తుత పరిస్థితుల్లో అభ్యర్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ఒక ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ సాగించడం తప్పనిసరి. కాబట్టి ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఏపీపీఎస్సీ జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి దాని ప్రకారం రెగ్యులర్‌గా నోటిఫికేషన్ విడుదల చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. తద్వారా ఔత్సాహికులకు కూడా సదరు క్యాలెండర్‌ను అనుసరిస్తూ ఒక ప్రణాళికతో పోటీ పరీక్షలకు మరింత మెరుగ్గా సిద్ధం కావడానికి అవకాశం లభిస్తుంది.

### యూపీఎస్సీ కూడా

ఏపీపీఎస్సీ పరీక్షా విధానాలు, సిలబస్, ప్రశ్నపత్రం కూర్పు యూపీఎస్సీ స్థాయిలో ఉంటాయి. ఒకసారి యూపీఎస్సీ పరీక్షా విధానాన్ని పరిశీలిస్తే సివిల్స్ సర్వీసెస్ ప్రధాన పరీక్ష 7 పేపర్లు 1750 మార్కులకు, ఇంటర్వ్యూ 275 మార్కులకు ఉంటుంది. ఈ ఇంటర్వ్యూ మార్కులు అనేవి ఒక అభ్యర్థి ఫలితాన్ని నిర్దేశించడంలో కీలక భూమిక పోషిస్తున్నాయని కచ్చితంగా చెప్పొచ్చు. ముఖ్యంగా ప్రధాన పరీక్ష మార్కులకు, ఇంటర్వ్యూ మార్కులకు ఉన్న వ్యత్యాసం.. ఐఏఎస్ / ఐపీఎస్ / ఐఆర్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులు లభించడం, సొంత రాష్ట్ర కేడర్‌కు ఎంపికవ్వడం వంటి అంశాలను తప్పనిసరిగా ప్రభావితం చేస్తుంది. కొన్ని సందర్భాల్లో ఎంపిక జాబితాలో లేకపోవడానికి కూడా కారణమవుతుంది. కేవలం ఒక శాతం తేడాతో సర్వీసులు పొందలేని వారెందరో. ముఖ్యంగా గ్రామీణ అభ్యర్థులు ఎంతో నష్టపోతున్నారు. యూపీఎస్సీ బోర్డు సభ్యులు వారి ఆలోచనా విధానం, వ్యక్తిత్వం మేరకు ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థి వ్యక్తిత్వాన్ని అంచనా వేసి మార్కులు వేస్తారు. కానీ మనదేశంలో బహుభాషలు, ప్రాంతాలు, కులాలు, ఆచార వ్యవహారాలు, ప్రాంతీయ అసమానతలు, గ్రామీణ-పట్టణ వసతుల వ్యత్యాసాలు, ఆర్థిక పరిస్థితులు మొదలైనవి ఉంటాయి. కాబట్టి ఈ విషయంలో యూపీఎస్సీ సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఇంటర్వ్యూ రద్దయ్యే పోస్టులు

ఇంటర్వ్యూ రద్దు కారణంగా గ్రూప్-1, గ్రూప్-2లో పోస్టులను కేవలం రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగానే భర్తీ చేస్తారు. ప్రస్తుత పద్ధతిలో గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించినవారికి 750 మార్కులకు మెయిన్స్ నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైతే 75 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. అలాగే, గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మెయిన్ పరీక్ష 450 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో కొన్ని పోస్టులకు మాత్రమే 75 మార్కులకు ఇంటర్వ్యూలను చేపడుతున్నారు. అయితే ఏపీపీఎస్సీ జనవరి నుంచి కొత్తగా విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్లకు ఇంటర్వ్యూ విధానం రద్దు అమల్లోకి వస్తుంది. ఈ సందర్భంలో ఇంటర్వ్యూ రద్దవుతున్న పోస్టులను చూద్దాం..

*గ్రూప్-1 (గెజిటెడ్) కేటగిరీలో..* డిప్యూటీ కలెక్టర్, సీటీవో (కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్), డీఎస్పీ, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, ఎంపీడీవో (మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్), ప్రాంతీయ రవాణా శాఖాధికారి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్, డివిజనల్ ఫైర్ ఆఫీసర్, జిల్లా రిజిస్ట్రార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి, జిల్లా ఉపాధి కల్పనా శాఖాధికారి, అసిస్టెంట్ ట్రెజరీ / అకౌంట్స్ ఆఫీసర్, డిప్యూటీ రిజిస్ట్రార్ (సహకార శాఖ), జిల్లా సంక్షేమ శాఖాధికారి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 తదితర పోస్టులు.

★★★★★

*గ్రూప్-2 (గెజిటెడ్) కేటగిరీలో..* అసిస్టెంట్ కమిషనర్ (దేవాదాయ శాఖ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ (పరిశ్రమల శాఖ), అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్, డిప్యూటీ డీఈవో (పాఠశాల విద్య), జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి.

★★★★★

వీటితోపాటు గతంలో ఏయే పోస్టులకు ఇంటర్వ్యూలు ఉన్నాయో వాటిన్నింటిని కేవలం రాత పరీక్షలో సాధించిన మార్కులాధారంగానే భర్తీ చేస్తారు. సంబంధిత నోటిఫికేషన్లలో పూర్తి వివరాలు ప్రస్తావిస్తారు.

# దివ్యాంగులకు 39,520 స్కాలర్‌షిప్‌లు

ఉన్నత విద్యను అభ్యసించడానికి ఆసక్తి, ప్రతిభ ఉంటే చాలు... చేయూతనిచ్చేందుకు ఎన్నో స్కాలర్‌షిప్ పథకాలు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ ఇలా వివిధ కోర్సుల తరవాత ఉన్నత విద్య దిశగా పయనిస్తున్న దివ్యాంగులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను అందజేస్తోంది. ఉన్నత విద్య ఖరీదైన వ్యవహారంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆ భారాన్ని కొంత తగ్గించుకోవడానికి ఉపకారవేతనాలు ఇతోధికంగా తోడ్పడుతున్నాయి. ఈ స్కాలర్‌షిప్‌ల వివరాలను తెలుసుకుందాం...



కేంద్ర ప్రభుత్వంలోని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ స్కాలర్‌షిప్‌లను ప్రదానం చేస్తుంది. 9వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు వీటిని కేటాయించారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 39,520 స్కాలర్‌షిప్‌లను అందజేస్తారు.

### ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్

- అర్హత: 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 2.50 లక్షలకు మించకూడదు.
- స్కాలర్‌షిప్ విలువ: నెలకు రూ.500 (హాస్టలర్స్‌కు రూ. 800)
- ఏడాదికి అందజేసే స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 20,000

### పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్

- అర్హత: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం నుంచి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ లేదా డిప్లొమా స్థాయి కోర్సులో చేరి ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 2.50 లక్షలకు మించకూడదు.
- స్కాలర్‌షిప్ విలువ: నెలకు రూ.550 - 750 (హాస్టలర్స్‌కు రూ. 900-1600, కోర్సులను బట్టి స్కాలర్‌షిప్ విలువ వేర్వేరుగా ఉంటుంది)
- ఏడాదికి అందజేసే స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 17,000

### టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్స్

- అర్హత: గుర్తించిన 240 అత్యుత్తమ విద్యా సంస్థల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిగ్రీ లేదా డిప్లొమా కోర్సుల్లో చేరి ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 6 లక్షలకు మించకూడదు.
- స్కాలర్‌షిప్ విలువ: నెలకు రూ.1500 (హాస్టలర్స్‌కు రూ. 3000). రూ. 2 లక్షల వరకు ట్యూషన్ ఫీజును కూడా చెల్లిస్తారు.
- ఏడాదికి అందజేసే స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 300

### ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్

- అర్హత: విదేశాల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిగ్రీ, డాక్టోరల్ డిగ్రీ కోర్సులు చదువుతూ ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 6 లక్షలకు మించకూడదు.
- స్కాలర్‌షిప్ కింద ట్యూషన్ ఫీజు, కంటింజెన్సీ గ్రాంట్, ప్రయాణ ఛార్జీలను చెల్లిస్తారు. అదేవిధంగా ఖర్చుల కోసం సంవత్సరానికి అమెరికాలోనైతే 15,400 అమెరికన్ డాలర్లు, యూకేలోనైతే 9,900 బ్రిటిష్ పౌండ్లను ఇస్తారు.
- ఏడాదికి అందజేసే స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 20

### దివ్యాంగుల నేషనల్ ఫెలోషిప్స్

- అర్హత: ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సుల్లో చేరి ఉండాలి. ఎటువంటి ఆదాయ పరిమితి లేదు.
- జేఆర్ఎఫ్: నెలకు రూ. 31 వేలు, ఎస్ఆర్ఎఫ్: రూ. 35 వేలు
- ఏడాదికి అందజేసే స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 200

### ఫ్రీ కోచింగ్

- అర్హత: ప్రభుత్వ / ప్రభుత్వ రంగ సంస్థల్లో లేదా సాంకేతిక, వృత్తి విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం సిద్ధమవుతున్న ఔత్సాహికులు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 6 లక్షలకు మించకూడదు.
- స్కాలర్‌షిప్ విలువ: నెలకు రూ.4,500 (కోచింగ్ సెంటర్ ఉన్న ప్రదేశంలోని స్థానికులకు), స్థానికేతరులకు రూ. 7,000. కోచింగ్ ఫీజును సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌కు అందజేస్తారు.
- ఏడాదికి అందజేసే స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 2,000

### ముఖ్య సమాచారం

- స్కాలర్‌షిప్‌తోపాటు డిసెబిలిటీ అలవెన్స్, పుస్తకాల కోసం ప్రత్యేక గ్రాంట్‌ను కూడా అందజేస్తారు. ఎంఫిల్, పీహెచ్‌డీ అభ్యర్థులకు రీడర్ అలవెన్స్, హెచ్ఆర్ఏ సదుపాయం కూడా కల్పిస్తారు.
- విద్యార్థులు ఏ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ కనీసం 40శాతం పైగా వైకల్యం ఉండాలి.
- అలాగే ఇతర స్కాలర్‌షిప్‌ల ద్వారా ప్రయోజనం పొంది ఉండకూడదు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 31, 2019 (ప్రీ మెట్రిక్ గడువు ముగిసింది).
- వెబ్‌సైట్: https://scholarships.gov.in/

# జాబ్ కార్నర్

## జనరల్ మేనేజర్

ఖాళీలు 25

ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ - చెన్నై వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- పోస్టుల వివరాలు: జనరల్ మేనేజర్ (మైనింగ్), జనరల్ మేనేజర్ (మెకానికల్), మెడికల్ ఆఫీసర్, తదితరాలు.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ / ఇంజనీరింగ్ / ఎంబీబీఎస్ / పీజీతోపాటు అనుభవం.
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 18, 2019.
- వెబ్‌సైట్: www.nlcindia.com

## ప్రాజెక్ట్ ఇంజనీర్

ఖాళీలు 18

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) - బెంగళూరు, ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్, అనుభవం.
- ఎంపిక: రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఈమెయిల్ / ఆఫ్‌లైన్ ద్వారా.
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 6, 2019.
- వెబ్‌సైట్: www.cdac.in

## సైంటిస్టు / ఇంజనీర్

ఖాళీలు 21

ఇస్రోకి చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ) - తిరువనంతపురం, సైంటిస్టు / ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలు: థర్మల్, స్ట్రక్చరల్, మెషీన్ డిజైన్, క్రయోజనిక్స్, వెల్డింగ్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్, టర్బో మెషినరీ, సేఫ్టీ, మాన్యుఫ్యాక్చరింగ్.
- అర్హత: బీఈ / బీటెక్, ఎంఈ / ఎంటెక్
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 5, 2019.
- వెబ్‌సైట్: www.lpsc.gov.in



హైదరాబాద్‌కు చెందిన జీవీకే గ్రూప్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్క దెబ్బతో అన్ని సమస్యలను పరిష్కరించుకోనుంది! ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టులో వాటాను చేజిక్కించుకోవడానికి అదానీ గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడమే కాక.. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చుకోనుంది. గ్రూప్ రుణ భారాన్ని తగ్గించుకోనుంది.

## డిసెంబరు చివరినాటికి
# బంగారం రూ.42,000



### విశ్లేషకుల అంచనా

ముంబై: రానున్న కాలంలో బంగారం ధరలు మరింత ముందుకువెళ్లే అవకాశమే ఉందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, డాలర్ మారకంలో రూపాయి బలహీనత వంటివి బంగారం ధరలను ప్రభావితం చేయనున్నాయని, ఫలితంగా ఈ ఏడాది డిసెంబరు చివరినాటికే 10 గ్రాముల ధర రూ.42,000కు చేరుకోవచ్చని వారు చెబుతున్నారు. పశ్చిమాసియా దేశాల్లో భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో కామెక్స్ మార్కెట్లలో ఔన్స్ బంగారం ధర 1,650 డాలర్లకు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో రూ.42,000కు చేరుకోవచ్చని స్థాయికి చేరుకోవచ్చని కామ్‌ట్రెండ్జ్ రీసెర్చ్ కోఫౌండర్, సీఈఓ జ్ఞానశేఖర్ త్యాగరాజన్ తెలిపారు. ఈ ఏడాది చివరిదాకా బంగారం ధరల్లో బుల్లిష్ ట్రెండ్‌కు అవకాశం ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.38,302 స్థాయిలో ఉండగా.. కామెక్స్‌లో ఔన్స్ ధర 1,506 డాలర్లుగా ఉంది.

ఈ ఏడాదిలో బంగారం ధరలు 15 శాతం పెరిగాయని, ఫలితంగా మంచి రిటర్నులు వచ్చాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ (కమోడిటీ రీసెర్చ్) నవనీత్ దమానీ తెలిపారు. డాలర్ మారకంలో రూపాయి బలహీనత కూడా ఇందుకు దారితీసినట్టు ఆయన చెప్పారు. అనేక దేశాల్లో మందగమనం నెలకొందని, ఈ నేపథ్యంలో కేంద్ర బ్యాంకులు పసిడి కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆయన తెలిపారు. ఇలాంటి పరిణామాలు బంగారం ధరలకు రానున్న కాలంలో కూడా మద్దతుగా నిలువనున్నట్టు ఆయన చెప్పారు. అయితే అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధ వాతావరణం చల్లబడితే ధరల్లో కాస్త దిద్దుబాటు అవకాశం ఉందన్నారు. ధరల వృద్ధికి సానుకూల పరిణామాలున్న నేపథ్యంలో ఈ ఏడాది చివరినాటికల్లా మళ్లీ రూ.39,500 స్థాయికి బంగారం చేరుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

రానున్న కాలంలో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం సగటు ధర 1,460-1,530 డాలర్లుగా ఉండవచ్చని, రూపాయల్లో అయితే ఎంసీఎక్స్‌లో పది గ్రాముల సగటు ధర రూ.36,800-39,400 స్థాయిలో కదలాడవచ్చని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీస్ హెడ్ రవీంద్ర రావు తెలిపారు. మూడో త్రైమాసికంలో కూడా బంగారంలో పెట్టుబడుల డిమాండ్ పెరిగిందని ఆయన చెప్పారు. అమెరికా-చైనా మధ్య చర్చలు, బ్రెగ్జిట్‌కు సంబంధించిన ఆశావాహ సంకేతాలతో ఇప్పటికే ట్రేడర్లు కొంత వరకు లాభాలను స్వీకరించారని తెలిపారు.

# 'జీవీకే' కష్టాలకు చెల్లు!

## పెట్టుబడులకు వ్యూహాత్మక ఒప్పందం

### జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో 79% వాటా విక్రయం
### సమకూరనున్న రూ.7,614 కోట్లు.. తగ్గనున్న రుణ భారం
### నవీ ముంబై విమానాశ్రయం అభివృద్ధికి నిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అబుదాబి దుబాయ్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), పబ్లిక్ సెక్టార్ పెన్షన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్), నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్)లకు చెందిన అనుబంధ కంపెనీలతో జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ కంపెనీలు జీవీకే ఎయిర్‌పోర్ట్ డెవలపర్స్ (జీవీకేఏడీఎల్), జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ (జీవీకేఏహెచ్ఎల్)లు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పంద ప్రకారం జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో ఏడీఏఐ, పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్, భారత్‌కు చెందిన ఎన్ఐఐఎఫ్‌లు రూ.7,614 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (ఎంఐఏఎల్)కు జీవీకేఏహెచ్ఎల్ హోల్డింగ్ కంపెనీ. ఎంఐఏఎల్ అనుబంధ కంపెనీ నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ప్రైవేట్) లిమిటెడ్ (ఎన్ఎంఐఏఎల్) ద్వారా నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తోంది.

### ఏం చేస్తారు?

ఇన్వెస్టర్లు తీసుకువచ్చే నిధులను జీవీకే గ్రూప్ అనుబంధ కంపెనీల రుణ భారాన్ని తగ్గించుకోవడానికి ప్రధానంగా వినియోగిస్తారు. ఎంఐఏఎల్‌లో బిడ్‌వెస్ట్, ఏసీఎస్ఏలకు ఉన్న వాటాను జీవీకేఏహెచ్ఎల్ కొనుగోలు చేస్తుంది. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌లో జీవీకే గ్రూప్‌నకు ప్రస్తుతం 50.5 శాతం వాటా ఉంది. బిడ్‌వెస్ట్ వద్ద ఉన్న 13.5 శాతం, ఏసీఎస్ఏ వద్ద ఉన్న 10 శాతం వాటాను కొనుగోలు చేస్తే.. ఎంఐఏఎల్‌లో జీవీకే వాటా 74 శాతానికి చేరుతుంది. ఎంఐఏఎల్ నుంచి బయటపడే ఉద్దేశంలో అందులో వాటాను విక్రయించాలని బిడ్‌వెస్ట్, ఏసీఎస్ఏలు నిర్ణయించాయి. ఒప్పందం ప్రకారం (రైట్ ఆఫ్ ఫస్ట్ రిఫ్యూజల్) వాటాను ముందుగా జీవీకేకు ఆఫర్ చేశాయి. కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిన జీవీకే నిర్ణీత కాలంలో నిధులను సమకూర్చుకోలేకపోయింది. దీంతో వాటాను కొనుగోలు చేయడానికి అదానీ గ్రూప్ ఆసక్తి చూపింది. అయితే.. మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్ జీవీకేకు అక్టోబరు చివరి వరకూ గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా రానున్న నిధులను వాటా కొనుగోలు చేయడానికి జీవీకే గ్రూప్ వినియోగించనుంది. పెట్టుబడుల ద్వారా జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో ఏడీఐఏ, కెనడాకు చెందిన పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎన్ఐఐఎఫ్‌లకు 79.1 శాతం వాటా లభించనుంది. మిగిలిన వాటా జీవీకే చేతిలో ఉంటుంది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం సహా జీవీకే విమానాశ్రయాల ఆస్తుల విలువను రూ.9,608 కోట్లుగా అంచనా వేశారు. ఈ నిధులను నవీ ముంబై విమానాశ్రయ అభివృద్ధికి కూడా వినియోగిస్తారు.



'జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్‌లోకి ఏడీఐఏ, పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎన్ఐఐఎఫ్‌లను వాటాదారులుగా ఆహ్వానిస్తున్నాం. కొత్త ఇన్వెస్టర్లతో కలిసి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధిని కొనసాగిస్తాం. విమానయాన కేంద్రంగా అభివృద్ధి చేసి ముంబై అభివృద్ధికి దోహదపడతాం. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధిని వేగిరం చేస్తాం. ఎంఐఏఎల్ రియల్ ఎస్టేట్ ఆస్తుల ద్వారా నగదు రూపంలో లబ్ది పొందడానికి కృషి చేస్తాం. పటిష్ఠమైన విమానాశ్రయాల వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తాం. దేశంలోకి విదేశీ మదుపర్లను ఆకర్షించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ ఒప్పందం ఒక నిదర్శనం'.

**- జీవీకే రెడ్డి, జీవీకే గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్**

### మేనేజ్‌మెంట్ జీవీకే చేతిలోనే

జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో జీవీకే ఎయిర్‌పోర్ట్ డెవలపర్స్, ఏడీఐఏ, పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎన్ఐఐఎఫ్‌లు వాటాదారులుగా ఉంటాయి. ముంబై, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్వహణ, బ్రాండింగ్ జీవీకే గ్రూప్ చేతిలోనే ఉంటుంది. జీవీకే విమానాశ్రయాలుగానే కొనసాగుతాయి. రెండు విమానాశ్రయాలను నిర్వహిస్తున్న కంపెనీలకు జీవీకే రెడ్డి ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా, జీవీ సంజయ్ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతారు. జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో జీవీకే ఎయిర్‌పోర్ట్ డెవలపర్స్‌కు 20.9 శాతం వాటా ఉంటుంది. మిగిలిన 79.1 శాతం వాటా విదేశీ మదుపర్ల చేతిలో ఉంటుంది.

# మూరత్ ట్రేడింగ్ శుభారంభం



ముంబై: దీపావళి రోజు జరిగిన 'సంవత్ 2076' మూరత్ ట్రేడింగ్ లాభాలతో ముగిసింది. కొనుగోళ్ల మద్దతుతో 192.14 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 39,250.20 వద్ద, 43.25 పాయింట్ల లాభంతో నిఫ్టీ 11,627.15 వద్ద ముగిశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్ల లో 19 కంపెనీల షేర్లు లాభాలతో క్లోజయ్యా యి. ఆటో, ఐటీ, బ్యాంకింగ్ రంగాలకు చెంది న మంచి కంపెనీల షేర్లను ఇన్వెస్టర్లు కొనుగోలు చేశారు. రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల దన్నుతో టాటా మోటార్స్ షేర్లు అత్యధికంగా 16.54 శాతం లాభంతో రూ.147.95 దగ్గర ముగిశాయి. ఈ షేరు ఒక దశలో 18 శాతం వరకు దూసుకుపోయింది.

టెలికాం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ తప్ప, అన్ని బీఎస్ఈ సెక్టోరియల్ సూచీలు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో యస్ బ్యాంక్, ఎం అండ్ ఎం, వేదాంత, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు రాణించాయి. మారుతీ సుజుకీ, భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కంపెనీల షేర్లు మాత్రం మూరత్ ట్రేడింగ్ రోజూ మదుపరులను నిరాశపరిచాయి. ఈసారి మూరత్ ట్రేడింగ్‌లో స్మాల్ అండ్ మిడ్ క్యాప్ సూచీల్లోనూ లాభాలు నమోదయ్యాయి.



## బెంగళూరు-ఇథియోపియా మధ్య విమాన సర్వీసులు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఐటీ రాజధాని బెంగళూరు, ఇథియోపియా రాజధాని ఆడిస్ అబాబా మధ్య విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఇథియోపియా ఎయిర్‌లైన్స్ ప్రాంతీయ డైరెక్టర్ తదేస్ టిలహూన్ సోమవారం లాంఛనంగా ఈ విమాన సేవలను ప్రారంభించారు. ప్రతి మంగళ, గురు, శని, ఆదివారాలలో బెంగళూరు నుంచి ఆడిస్ అబాబాకు, మంగళ, గురు, శుక్ర, ఆదివారాల్లో బెంగళూరుకు ఈ విమాన సర్వీసులు నడుస్తాయి. ఇథియోపియా ఎయిర్‌లైన్స్ ఇప్పటికే దేశంలోని ముంబై, ఢిల్లీ నగరాల నుంచి విమాన సర్వీసులు నడుపుతోంది. కొత్తగా బెంగళూరు నుంచీ విమాన సర్వీసులు ప్రారంభించింది. ఐటీ, బీటీ రంగాలలో ప్రపంచంలోనే ప్రముఖమైన నగరమైనందునే బెంగళూరు నుంచి సేవలు ప్రారంభించామని తదేస్ టిలహూన్ చెప్పారు.

## తిరుపతికి కొత్తగా రెండు ఎయిర్ బస్‌లు

తిరుపతి (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగనాడు రెండు ప్రముఖ విమానయాన సంస్థలు తిరుపతికి నూతన విమాన సర్వీసులు ప్రారంభించాయి. ఎయిర్ ఇండియా, ఇండిగో 320-ఎయిర్ బస్ సర్వీసులు ఆదివారం తొలిసారిగా తిరుపతికి వచ్చాయి. ఢిల్లీ-విజయవాడ-తిరుపతి మధ్య నడిచే ఎయిర్ ఇండియా 320 ఎయిర్‌బస్ ఢిల్లీలో ఉదయం 6 గంటలకు విజయవాడకు బయలుదేరుతుంది. అక్కడనుంచి ఉదయం 8.45 గంటలకు బయలుదేరి ఉదయం 9.45 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఆది, మంగళ, శుక్రవారాల్లో మాత్రమే ఈ ఎయిర్ ఇండియా సర్వీసులు తిరుపతి వరకు నడుస్తాయి. అలాగే మరో విమానయాన సంస్థ ఇండిగో న్యూఢిల్లీ- తిరుపతి వయా హైదరాబాద్ సర్వీసును ప్రారంభించింది. ప్రతిరోజు మధ్యాహ్నం 1.55 గంటలకు హైదరాబాద్‌నుంచి తిరుపతికి చేరుకునే ఇండిగో ఎయిర్‌బస్ 2.40కి తిరిగి హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి ప్రయాణమవుతుంది.

## మళ్లీ విశాఖ-సింగపూర్ మధ్య విమాన సర్వీసు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): స్కూట్ ఎయిర్‌లైన్స్ సంస్థ విశాఖపట్నం-సింగపూర్ మధ్య కొత్త విమాన సర్వీసు ప్రారంభించింది. సిల్క్ ఎయిర్ విమాన సర్వీసు రద్దవడంతో, ఆ స్థానంలో బడ్జెట్ ఎయిర్‌లైన్స్ స్కూట్ ఈ సర్వీసు ప్రారంభించింది. ఈ విమానం సర్వీసు వారానికి ఐదు రోజులు (ఆది, సోమ, బుధ, శుక్ర, శనివారం) నడుస్తుంది. గతంలో టికెట్ కనీస ధర రూ.16 వేలు కాగా ఇప్పుడు రానుపోను టికెట్ రూ.10,000కే లభిస్తుంది.

## టెక్ వ్యూ

# 11700 పైన మరింత అప్‌ట్రెండ్



**వి సుందర్ రాజా**

నిఫ్టీ గత వారం 11700 వరకు వెళ్లి రియాక్షన్ సాధించింది. మైనర్ కరెక్షన్‌లో పడినా 11500 వద్ద రికవరీతో చివరికి సానుకూల ధోరణిలో నిలకడగా ముగిసింది. గత కొద్ది సెషన్లలో కరెక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం బలాన్ని సూచిస్తోంది. మరోసారి కీలక స్వల్పకాలిక నిరోధ స్థాయి 11700 వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. గత వారంలో స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితి కూడా సద్దుబాటయింది.

**బుల్లిష్ స్థాయిలు :** మరింత అప్‌ట్రెండ్‌లో పయనిస్తే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం 11700 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. ఇదే జూలై 17, సెప్టెంబరు 23 తేదీల్లో ఏర్పడిన టాప్. ఆ పైన నిరోధ స్థాయిలు 11830, 12000. గత కొద్ది నెలల్లో ఏర్పడిన టాప్‌లు కూడా ఇదే. ఆ పైన నిలదొక్కుకుంటే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది.

**బేరిష్ స్థాయిలు :** 11700 వద్ద విఫలమైతే కరెక్షన్ ముప్పు ఉంటుంది. మద్దతు స్థాయి 11500. ఇక్కడ కోలుకుని తీరాలి. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో ప్రవేశిస్తుంది.

**బ్యాంక్ నిఫ్టీ :** మరింత అప్‌ట్రెండ్‌లో పయనిస్తే గత వారం ఏర్పడిన టాప్ 29700 వద్ద నిరోధం ఎదుర్కొంటుంది. ఆ పైన మాత్రమే మరింత పురోగమించే అవకాశం ఉంటుంది. ప్రధాన నిరోధం 30100.

**స్వల్పకాలిక వ్యూహం :** 11700 కన్నా పైన నిలదొక్కుకుంటే గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు.

**పాటర్న్ :** మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ 11700 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్"ను బ్రేక్ చేయాలి. కరెక్షన్‌లో పడితే 11500 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు కనిపిస్తోంది. అయితే ప్రస్తుతం మార్కెట్ "ఏటవాలుగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా చాలా పైనే ఉంది. సాధారణ పరిస్థితుల్లో ఎలాంటి ముప్పు లేదనేందుకు ఇది సంకేతం.

**టైమ్ :** ఈ సూచి ప్రకారం వచ్చే బుధవారంనాడు తదుపరి మైనర్ రివర్సల్ ఉంది.




**రిలయన్స్ (రూ.1,435) - కొనుగోలు స్థాయిలకు చేరువలో**

| | | |
|---|---|---|
| రూ.1435 ఎగువన అప్‌ట్రెండ్ | మొదటి నిరోధం రూ.1465 | రెండో నిరోధం రూ.1500 |
| రూ.1420 దిగువన డౌన్‌ట్రెండ్ | మొదటి మద్దతు రూ.1390 | రెండో మద్దతు రూ.1360 |

**మంగళవారం స్థాయిలు**
నిరోధం: 11655, 11700
మద్దతు : 11600, 11560
www.sundartrends.in

## ఆస్ట్రో గైడ్

# తగ్గితే కొనడం బెస్ట్

### సంవత్ 2076 అంచనా

ఈ ఏడాదిలో అంతర్జాతీయ సంకేతాలు, ప్రభుత్వ సంస్కరణలు, ద్రవ్య విధానం, వ్యాపార వాతావరణం, కరెన్సీ ఎగుడుదిగుడులు మార్కెట్ గతిని నిర్దేశిస్తాయి. ఫండమెంటల్స్‌పరంగా నిఫ్టీ ఇపిఎస్ 450 వద్ద నిలకడగా ఉండగా పిఇ 25.5 నుంచి 27కి ఎగబాకింది. ఒక మోస్తరు ఆశావహ దృక్పథంతో పరిశీలిస్తే వచ్చే దీపావళి నాటికి నిఫ్టీ 10900 నుంచి 11700 మధ్యన కదలాడవచ్చు. ప్రభుత్వ సంస్కరణ ధోరణులను బట్టి చూస్తే హేతుబద్ధమైన కరెక్షన్ వచ్చినప్పుడల్లా కొనుగోళ్లకు అవకాశంగా మలుచుకోవచ్చు.

ప్రస్తుత గ్రహగతుల ప్రకారం సంవత్ 2076 ప్రారంభ సమయానికి సూర్యచంద్రులు వృశ్చిక లగ్నంలో 12వ ఇంటిలోను, బుధుడు, శుక్రుడు, గురుడు ఉచ్చదశలోను ఉన్నారు. కుజుడు కన్యా రాశిలోను, శని, కేతువులు ధనుస్సు రాశిలోను, రాహువు మిథునంలోను సంచరిస్తున్నారు.

**ఈ గ్రహగతులను బట్టి ఈ దిగువ తేదీల్లో ఆటుపోట్లతో ట్రేడింగ్ సాగవచ్చు...**

డిసెంబరు 29; 2020 జనవరి 30; మార్చి 31; మే 5; జూన్ 15; ఆగస్టు 18; సెప్టెంబరు 6; అక్టోబరు 8, 30.

**కీలక తేదీలు:** అక్టోబరు 31; నవంబరు 11, 30; డిసెంబరు 30; 2020 జనవరి 16; ఫిబ్రవరి 2, 9, 17; మార్చి 3, 18, 29; ఏప్రిల్ 6, 16, 18, 25; మే 3, 18, 22, 27; జూన్ 30; జూలై 16, 24, 31; ఆగస్టు 30; సెప్టెంబరు 23, 26; అక్టోబరు 21, 23.

**సునిశిత తేదీలు:** అక్టోబరు 31; నవంబరు 21; 2020 జనవరి 24; ఫిబ్రవరి 17 నుంచి మార్చి 10; మే 11; జూన్ 18 నుంచి జూలై 12; జూలై 28; ఆగస్టు 23; సెప్టెంబరు 13, 29

**నిరోధ స్థాయిలు :** 11750, 12170, 12750, 13170, 13750, 14500
**మద్దతు స్థాయిలు :** 11300, 10700, 10000, 9400

**సంవత్ 2075 ఇలా ఉంది..**

నిఫ్టీ సంవత్ 2075లో 10530 వద్ద ప్రారంభమై 10 శాతం పెరిగి 11584 వద్ద ముగిసింది.

గత ఏడాదిలో ప్రైవేటు బ్యాంకు షేర్లు మంచి లాభాలు గడించగా ఆటో, ఎఫ్ఎంసీజీ షేర్లు డీలా పడ్డాయి. విభాగాలవారీగా చూస్తే ఫార్మా విభాగం మాత్రమే సానుకూల రాబడులు అందించింది. నిఫ్టీ జీవితకాల గరిష్ఠ స్థాయి 12200 వరకు వెళ్లింది.

**గత ఏడాదిలో వివిధ సూచీల ఉత్థానపతనాలు**

| సూచీ | 2075 ముగింపు | 2074 ముగింపు | శాతం |
|---|---|---|---|
| నిఫ్టీ | 11584 | 10530 | 10 |
| బ్యాంక్ నిఫ్టీ | 29396 | 25598 | 14.84 |
| ఆటో | 25756 | 29149 | - 11.50 |
| ఎఫ్ఎంసీజీ | 8760 | 9215 | - 4.49 |
| ఫార్మా | 5952 | 5921 | 0.52 |

## ఆస్ట్రో గైడ్

# వారంలో 11800 పైన బుల్లిష్

**(అక్టోబరు 29- నవంబరు 1 తేదీల మధ్య వారానికి)**
**గత వారం నిఫ్టీ : 11584 (-78)**



**డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి**

నిఫ్టీ గత వారం 11714-11491 పాయింట్ల మధ్య కదలాడి 78 పాయింట్ల నష్టంతో 11584 వద్ద వారం మధ్య స్థాయిలో నెగిటివ్‌గా ముగిసింది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 11433, 11178, 11393, 11303 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం అధిక డీఎంఏలకన్నా పైన ఉంది. 50 డీఎంఏ 200 డీఎంఏకన్నా (డెత్‌క్రాస్) దిగువకు రావడంతో దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్ అయింది. ఈ వారాంతంలో 11800 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి :** 11800 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 11400
**నిరోధ స్థాయిలు :** 11735, 11810 (11660 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు :** 11430, 11355 (11505 దిగువన బేరిష్)

**ఇన్వెస్టర్లకు సూచన..**

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు

**గ్రహగతులు**

- తులలోని విశాఖ పాదం 2 నుంచి ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- తులలోని స్వాతి పాదం 1-3 మధ్యలో రవి సంచారం
- వృశ్చికంలోని విశాఖ పాదం 4లో వక్రగతిలో బుధ సంచారం
- వృశ్చికంలోని విశాఖ పాదం 4 నుంచి అనూరాధ పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- కన్యలోని హస్త పాదం 4 నుంచి చిత్త పాదం 1 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3లో తుల నవాంశలో శని సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 3-4 మధ్యలో మీన నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 4లో రాహువు, ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2లో కేతువు సంచారం

### ద్వితీయార్ధం మెరుగు (మంగళవారానికి)

**తిథి :** కార్తీక శుక్ల విదియ
**నక్షత్రం-అప్రమత్తం:** విశాఖ; అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, వృశ్చిక, మీన రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు: 11.59**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై తదుపరి మధ్యాహ్నం 1.25 వరకు మెరుగ్గా ట్రేడవుతూ ఆ తర్వాత చివరి వరకు నిలకడగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 1.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం: 11625, 11660**
**మద్దతు స్థాయిలు: 11545, 11510**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం

**గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.**

**28న ఫారం గేటు అమ్మకం ధరలు**
**రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.50 నెక్ (100 గుడ్లు)**



| | | 29వ తేదీకి.. | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 393 | విశాఖపట్నం | 400 |
| బెంగళూరు | 415 | వరంగల్ | 396 |
| విజయవాడ | 398 | చెన్నై | 430 |
| గోదావరి | 398 | చిత్తూరు | 423 |
| నమక్కల్ | 415 | ముంబై | -- |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 71 | విజయవాడ | 76 |
| వరంగల్ | 71 | గుంటూరు | 77 |
| మహబూబ్‌నగర్ | 71 | ఒంగోలు | 78 |
| కరీంనగర్ | 71 | చిత్తూరు | 91 |
| కర్నూలు | 71 | నెల్లూరు | 91 |
| విశాఖపట్నం | 64 | అనంతపురం | 92 |
| గోదావరి | 72 | | |

## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,760 | 38,670 | 39,790 | 38,850 | 38,480 |
| క్రితం ముగింపు | 38,540 | 38,850 | 40,100 | 38,500 | 38,580 |
| 22 క్యారెట్లు | 36,880 | 35,850 | 36,600 | 35,584 | 36,850 |
| క్రితం ముగింపు | 36,670 | 36,000 | 36,890 | 35,910 | 36,930 |
| వెండి (కిలో) | 46,500 | 48,200 | 47,700 | 47,700 | 50,400 |
| క్రితం ముగింపు | 45,500 | 47,800 | 48,600 | 47,200 | 50,600 |



## కుప్ప కూలిన తరగతి గది

సూరంపల్లి(గన్నవరం), అక్టోబరు 28: మధ్యాహ్నం క్లాసు జరుగుతున్న వేళ తరగతి గదిలో పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. ఉపాధ్యాయులు ముందుగానే ప్రమాదాన్ని ఊహించి వరండాలో బోధన చేస్తుండటంతో పెను ముప్పు తప్పినట్లైంది. కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు. పెను ప్రమాదం తప్పిందని తల్లిదండ్రులు, గ్రామస్తులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. 1961లో మూడు తరగతి గదులతో ఈ పాఠశాలను నిర్మించారు. జడ్పీహైస్కూల్ స్థాయికి ఎదిగింది. పక్కనున్న మరో భవనంలో హైస్కూల్ నిర్వహిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల భవనం 58 ఏళ్ల క్రితం నాటిది కావటంతో శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం దీనిలో 1, 2 తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకటిలో 17, రెండవ తరగతిలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. తరచూగా పైకప్పు నుంచి సున్నం రాలటంతోపాటు పెంకులు పడిపోతున్నాయి. రెండు నెలల క్రితం కలపదుంగలు విరగటంతో ఉపాధ్యాయులు అప్రమత్తమై వరండాలో పాఠాలు బోధిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం జరిగిన ఘటన ఆందోళనకు గురిచేసింది.



## నెల్లూరులో భారీ అగ్ని ప్రమాదం

నెల్లూరు ( క్రైం), అక్టోబరు 28 : దీపావళి సంబరంలో అపశ్రుతి చోటుచేసుకోవడంతో నెల్లూరులో భారీ అగ్నిప్రమాదం జరిగింది. నిప్పురవ్వ దుకాణంలో పడిన కారణంగా ఆదివారం రాత్రి చెలరేగిన మంటలు సోమవారం సాయంత్రం వరకూ కూడా అదుపులోకి రాలేదు. వివరాలు...నగరంలోని చిన్నబజారు ప్రాంతంలో ఆదివారం రాత్రి బాణసంచా కాలుస్తుండగా ఓ నిప్పురవ్వ అక్కడే ఉన్న శ్రీ కనక దుర్గా మెటల్ ఎంటర్ ప్రైజెస్ దుకాణంలో పడింది. దీంతో మంటలు ఎగసిపడ్డాయి. భవంతిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకాణం ఉండగా మొదటి, రెండో అంతస్తులను గోదాములుగా వాడుతూ సామగ్రి నింపారు. ఆక్వా రంగానికి సంబంధించిన ప్లాస్టిక్ సామగ్రిని ఇక్కడ నిల్వ ఉంచుకుని విక్రయిస్తున్నారు. నిప్పురవ్వ మిద్దెపై ఉన్న ప్లాస్టిక్ సామగ్రిపై పడి వేగంగా మంటలు వ్యాపించాయి. తొమ్మిది అగ్నిమాపక యంత్రాలను వినియోగించినా మంటలను అదుపులోకి రాలేదు. ఎట్టకేలకు సోమవారం రాత్రి ఏడుగంటల సమయానికి మంటలు అదుపులోకి వచ్చాయి. కలెక్టర్ ఎంవీ శేషగిరిబాబు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఆదివారం రాత్రి సంఘటనా స్థలం వద్దే ఉండి పర్యవేక్షించారు. రూ.3 కోట్ల ఆస్తినష్టం జరిగిందని దుకాణం యజమాని తెలిపారు.

# టీ నీళ్లకూ డబ్బుల్లేవు

## కేసులు రాసేందుకు పెన్నూ.. పేపరూ కరువే.. బయటి కెళ్దామంటే వాహనాల్లో పెట్రోల్ లేదు

- నెల రోజులుగా 'నాటు', 'బెల్టు'లపై దాడుల్లేవు
- ఎక్సైజ్ పోలీసుస్టేషన్లకు ఆర్థిక కష్టాలు
- ప్రభుత్వ మద్యం షాపులతోనే ఈ దీనస్థితి
- ఏడాదిగా నిలిచిపోయిన 'నిర్వహణ ఖర్చులు'

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'కేసులు రాసుకోడానికి పెన్నులు, పేపర్లు లేవు. ఎవరైనా పైఅధికారులు వస్తే కనీసం టీ ఇచ్చే పరిస్థితి లేదు. ముద్దాయిలను కోర్టుకు తీసుకెళ్లేందుకు చార్జీలకూ డబ్బుల్లేవు. చివరికి స్టేషన్ వాహనం బయటికి తీయాలంటే పెట్రోలు లేదు'. ఇవీ ఎక్సైజ్ స్టేషన్ల సినిమా కష్టాలు. కనీసం నిర్వహణ ఖర్చులకు డబ్బుల్లేక ఎక్సైజ్ స్టేషన్లు నానా పాట్లు పడుతున్నాయి. ఇప్పటి వరకూ దర్జాగా తిరిగిన సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఇప్పుడు కాలు తీసి బయట పెట్టాలన్నా పెట్రోలుకు డబ్బులు లేని దీనస్థితిలో ఉన్నారు. గత నెల రోజులుగా నాటుసారా స్థావరాలపైగానీ, బెల్టు దుకాణాలపైగానీ కనీసం ఒక్క రైడ్ చేయలేక స్టేషన్లకే పరిమితమయ్యారు. ఇక జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలో పనిచేసే ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు దూరం వెళ్లి రైడ్ చేయాలంటే సొంత జేబులో డబ్బులు పెట్టుకోవాల్సి వస్తుందని భయపడిపోతున్నాయి. ఇటీవల ఓ జిల్లాలో అసిస్టెంట్ కమిషనర్, సీఐలు, కానిస్టేబుళ్లు వారి జీతాల్లో నుంచి 5 శాతం రైడ్‌ల కోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. మరోవైపు స్టేషన్లకు ఇచ్చే నెలవారీ నిర్వహణ ఖర్చులు కూడా ఏడాది నుంచి ఆగిపోయాయి.

### ఎందుకీ దుస్థితి?

గతంలో ఎక్సైజ్ శాఖ, స్టేషన్లు అంటే కాసులతో ముడిపడిన వ్యవహారం అనే అభిప్రాయం ఉండేది. లక్ష్మీనరసింహం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితిలో ఎవ్వరూ ఒక్క రూపాయి తీసుకోవడానికి వీల్లేదని గట్టిగా ఆదేశించడంతో నెలవారీ మామూళ్లు ఆపేశారు. ఇప్పుడు మొత్తం ప్రైవేటు షాపులు తీసేసి, ప్రభుత్వ షాపులు ఏర్పాటుచేయడంతో పూర్తిగా స్టేషన్లకు చిల్లిగవ్వ దక్కే పరిస్థితి లేకుండా పోయింది. అద్దె, విద్యుత్ బిల్లు తదితరాలకు ఒక్కో స్టేషన్‌కు రూ.10వేలు చొప్పున ప్రభుత్వం ఇచ్చిన నిర్వహణ ఖర్చులూ ఏడాదిగా విడుదల కావడం లేదు. అద్దె, విద్యుత్ బిల్లు కాకుండానే నెలకు పట్టణాల్లో అయితే రూ.25వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.15వేల నుంచి రూ.20వేలు ఖర్చవుతున్నాయని ఎస్‌హెచ్‌వోలు అంటున్నారు. ఒక్కసారి ముద్దాయిని కోర్టుకు తీసుకెళ్లాలంటే రూ.500కుపైగా ఖర్చవుతోందని చెబుతున్నారు. తాగు నీరు, వార్తా పత్రికలు, కేబుల్ బిల్లులు, తెల్ల పేపర్లు, పెన్నులు కొనుగోళ్లకు సొంత డబ్బు పెట్టుకుంటున్నామని చెబుతున్నారు.

### రైడ్‌లు బంద్..

ఒక్కో స్టేషన్‌లో వాహనానికి ప్రభుత్వం రూ.35వేల నిధులు ఇస్తోంది. ఇప్పటి వరకూ ఆ మొత్తాన్ని వాహన యజమానికి ఇచ్చి, పెట్రోలు ఖర్చును అధికారులే మామూళ్ల సొమ్ముతో భర్తీ చేసేవారు. ఇప్పుడు ఆర్థిక కష్టాల వల్ల కనీసం వాహనం బయటకు తీయాలంటే భయపడే పరిస్థితి వచ్చింది. దీనివల్ల నాటుసారా స్థావరాలపై రైడ్‌లు పూర్తిగా ఆగిపోయాయి. ఒక రైడ్‌కు వెళ్తే భారీగా ఆయిల్ ఖర్చవుతుందని, మధ్యాహ్నం స్టేషన్‌కు రాలేకపోతే భోజనాల ఖర్చులు అవుతాయని ఎస్‌హెచ్‌వోలు చెబుతున్నారు. ఈ ఖర్చుల గోల భరించలేక కొన్ని చోట్ల సీఐలు స్టేషన్ల మొహం చూడటం లేదు. ఎస్ఐలపై భారం నెట్టేసి సొంత వ్యవహారాలు చూసుకుంటున్నారు. ఇప్పుడు ఎస్ఐలు కూడా చేతులెత్తేసే పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితిని ముందుగానే ఊహించిన సీఐలు సాధారణ బదిలీల్లో పట్టణ ప్రాంతాలను కోరుకున్నారు. పట్టణాల్లో అయితే షాపులు లేకపోయినా బార్లు ఉంటాయి కాబట్టి వాటినుంచి నిర్వహణ ఖర్చులు రాబట్టవచ్చనేది ఎస్‌హెచ్‌వోల ఆలోచన. రాజకీయ పలుకుబడి ఉన్నవారు పట్టణాల్లో పోస్టింగ్ దక్కించుకోగా, మిగిలిన వారు గ్రామీణ ప్రాంతాల్లో పడ్డారు. ఇప్పుడు స్టేషన్లను నడపలేక వారు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### సివిల్ పోలీసులకూ మామూళ్లు కట్..

ప్రభుత్వ మద్యం షాపుల ప్రభావం ఎక్సైజ్ స్టేషన్లతో పాటు సివిల్ పోలీసులపైనా పడింది. ఇప్పటివరకూ ఎక్సైజ్‌తో పాటు సివిల్ స్టేషన్లకూ నెలవారీ మామూళ్లు వచ్చేవి. ప్రాంతాల వారీగా ఒక్కో స్టేషన్‌కు నెలకు రూ.30వేల నుంచి రూ.90వేల వరకు వచ్చేవి. అవి ఎస్‌హెచ్‌వో నుంచి కానిస్టేబుల్ వరకూ చేరేవి. అప్పుడప్పుడు పోలీసుల పార్టీలకు మద్యం బాటిళ్లు కూడా ఇచ్చేవారు. ఇప్పుడు అవన్నీ ఆగిపోవడంతో సివిల్ పోలీసులూ అసహనం ప్రదర్శిస్తున్నారు. అయితే దీనివల్ల సివిల్ పోలీసులకు పోయేదేమీ లేదని, తాము సొంత డబ్బు పెట్టుకోవాల్సి వస్తోందని ఎక్సైజ్ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

## అవినీతి నిర్మూలనతోనే ప్రజాస్వామ్య ఫలాలు

- గవర్నర్ హరిచందన్



విజయవాడ/అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): "అవినీతి.. కేన్సర్ కన్నా భయంకరమైనది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న అవినీతిని పూర్తిగా నిర్మూలించినపుడే ప్రజాస్వామ్య ఫలాలను అందరూ ఆస్వాదించగలుగుతారు" అని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'విజిలెన్స్ అవగాహన వారం-2019' ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. గవర్నర్ హరిచందన్ దానికి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. సమాజంలో పాతుకుపోయిన అవినీతి దేశ సంపదను దోచుకోవడానికి దారితీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుపరిపాలన ప్రాథమిక సూత్రాలలో పారదర్శకత అత్యంత కీలకమైనదని తెలిపారు. సమాచార హక్కు చట్టం భారత పాలనా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమానికి హాజరైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆయా శాఖల అధికారులతో గవర్నర్ ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రంలోని 23 కేంద్ర ప్రభుత్వ విభాగాలు కలిసి ఈ 'విజిలెన్స్ అవగాహన వారం-2019' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని ఆదాయ పన్ను శాఖ కమిషనర్ భూపాల్ రెడ్డి తెలిపారు. అవినీతిని నిర్మూలించినపుడే ప్రభుత్వ పథకాల ఫలాలు క్షేత్రస్థాయి వరకు సక్రమంగా చేరతాయని గవర్నర్ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా అన్నారు. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతి ప్రధాన అవరోధమని ఏసీబీ డీజీ కుమార్ విశ్వజీత్ అన్నారు. విజయవాడలోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారంను సోమవారం ఆయన ప్రారంభించారు. ఏపీలోని 13 జిల్లాల నుంచి హాజరైన అధికారులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు.



నూతన పట్టువస్త్రాలతో ఆలయంలోకి వెళ్తున్న జీయరుస్వాములు, ఆదనపు ఈవో, డిప్యూటీ ఈవో తదితరులు

## శ్రీవారి ఆలయంలో వైభవంగా దీపావళి ఆస్థానం

తిరుమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం దీపావళి ఆస్థానం వైభవంగా నిర్వహించారు. జియ్యంగార్లు, అర్చకస్వాములు, ఉన్నతాధికారుల సమక్షంలో బంగారువాకిలి వద్ద ఈ కార్యక్రమం ఆగమోక్తంగా జరిగింది. ముందుగా మలయప్పస్వామి, అమ్మవార్లు, విష్వక్సేనుల ఉత్సవమూర్తులను గరుడాళ్వారు సన్నిధిలో వేంచేపు చేశారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి కర్పూర మంగళహారతులు సమర్పించి నైవేద్యాలు నివేదించారు. నూతన పట్టు వస్త్రాలను మూలవిరాట్టు, దేవతామూర్తులకు ధరింపజేసి రూపాయి, ప్రత్యేక హారతులు పట్టారు. అనంతరం తీర్థం, శఠారి మర్యాదలతో ఆలయ అధికారులను అర్చకులు ఆశీర్వదించారు. ఇదిలా ఉంటే.. నాగులచవితి సందర్భంగా ఈనెల 31 రాత్రి 7-9 గంటల మధ్య మలయప్ప దేవేరులతో కలసి పెద్దశేష వాహనంపై చతుర్మాడ వీధుల్లో విహరిస్తారు.

## బెదిరింపులపై రచయిత్రి వినోదిని ఫిర్యాదు

కడప (సిటి), అక్టోబరు 28: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిపై తాను రచించిన పుస్తకంలోని శూద్ర అనే పదంపై అభ్యంతరం తెలుపుతూ బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని యోగివేమన యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎం.వినోదిని కడప తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కలెక్టరుగారూ .. జీతాలు ఇప్పించండి

- వలంటీర్ల వినతి

కడప (కలెక్టరేట్), అక్టోబరు 28: రెండు నెలల నుంచి వలంటీర్లుగా పనిచేస్తున్న తమకు గౌరవ వేతనం అందడం లేదని, తమకు జీతాలు ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ కడప నగరంలోని కొందరు వలంటీర్లు జిల్లా కలెక్టర్‌కు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. తొలుత 35 ఏళ్ల వయసున్న వారిని కూడా వలంటీర్లుగా నియమించారని, జీవో 18 మేరకు ఇప్పుడా నిబంధనలు వర్తించవని అంటున్నారన్నారు. 2 నెలల పాటు ఇంటింటికీ తిరిగి రిపోర్టులు తయారు చేసి పంపిస్తే.. ఇప్పుడు వయసు మీరిందంటూ గౌరవ వేతనాలు రావని చెబుతున్నారని, తమ బతుకులు రోడ్డున పడతాయని వాపోయారు.

## శ్రీశైలానికి తగ్గిన వరద

శ్రీశైలం, అక్టోబరు 28: శ్రీశైల జలాశయానికి ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. దీంతో రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా మాత్రమే సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు, నీటినిల్వలు 215.8070 టీఎంసీలు. సోమవారం సాయంత్రం 6గంటల సమయానికి 884.70 అడుగులు, జలాశయ నీటినిల్వ సామర్థ్యం 213.8824 టీఎంసీలుగా నమోదయ్యాయి. జలాశయానికి 1,71,794 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కుడిగట్టు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ జలాశయం నుంచి 69,012 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. డ్యాం 2 రేడియల్ క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 55,874 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి ఔట్‌ఫ్లో 1,24,886 క్యూసెక్కులు ఉంది.

## తుంగభద్ర జలాశయానికి కొనసాగుతున్న వరద

ఆదోని, అక్టోబరు 28: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. బోర్డు అధికారులు 10 గేట్లు ఎత్తి 45,470 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 57,744 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 57,518 క్యూసెక్కులు ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1633 అడుగులు ఉండగా ప్రస్తుత నీటి మట్టం 1632.80 అడుగులు ఉంది. ప్రస్తుతం నీటి నిల్వ 100.086 టీఎంసీలు ఉంది.


దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayIndia

ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును

**ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)**

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాదు వారు దిగువ పనుల కొరకు సింగిల్ పాకెట్ టెండరింగ్ విధానం ద్వారా ఇ-టెండరు కోరుచున్నారు.

**క్రమ సంఖ్య:** 1 **నిట్ నెం.:** E.29/C/TRD/SC/08/2019-20 తేది 26.10.2019, **పని పేరు: టెండరు నెం. E.29/C/TRD/SC/08/2019-20 తేది 26.10.2019,** దక్షిణ మధ్య రైల్వే (TKM.21) చెర్లపల్లి స్టేషన్ వద్ద ప్రస్తుతం ఉన్న OHEకు ప్రతిపాదిత టెర్మినల్ ఫెసిలిటీస్ మాడిఫికేషన్స్‌తో కలుపుకొని LT సప్లై ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్స్, 65 sq.mm కేటనరీ మరియు 107 sq.mm HDG కాపర్ కాంటాక్ట్‌వైర్‌తో 25KV, 50HZ సింగిల్‌ఫేజ్ a.c. ట్రాక్షన్ ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్, డిజైన్, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట. **వివరాలు : అంచనా విలువ:** రూ. 4,42,68,235.00, **బయానా:** రూ. 3,71,400.00, **డాక్యుమెంట్ ధర:** రూ. 10,000/-, **పూర్తిచేయుకాలం** : 12 (పన్నెండు) నెలలు, **ముగింపు తేది:** 19.11.2019న 15 గం.లు

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్: **http://ireps.gov.in** లాగిన్ అవ్వవచ్చు.
2. కాంట్రాక్టర్లు టెండరుకు సంబంధించి టెండరు డాక్యుమెంట్‌కు మరియు బయానా చెల్లింపుల కొరకు IREPS పోర్టల్‌లో లభించే **ఆన్‌లైన్ చెల్లింపు విధానాలయిన** నెట్ బ్యాంకింగ్, డెబిట్‌కార్డ్, క్రెడిట్ కార్డ్ మొ॥వాటి ద్వారా మాత్రమే చెల్లించాలి. మాన్యువల్ చెల్లింపు విధానాలయిన డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రశీదులు, FDR మొ॥వి అంగీకరింపబడవు.
3. టెండరుదారు వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో టెండరు ముగింపు సమయం కంటే 15 రోజుల ముందు వరకు మాత్రమే టెండరుదాఖలు సమయం వరకు మాత్రమే దాఖలు చేయాలి.
4. టెండరుదారు ఏదైనా సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే) కొరకు టెండరు దాఖలు సమయం ముందు వరకు చూడవలయును.

**డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్/ TRD / సికింద్రాబాద్.**

**టెండరు ప్రకటన నం. CRS/E. 27, 35 & 37/2019-20**

DEE/CRS/TPTY కొరకు మరియు భారత రాష్ట్రపతి తరపున, 15.00 గం.ల వరకు దిగువ వివరించిన ప్రకారం దిగువ తెలిపిన ముగింపు తేది గల టెండరు నం.కు ఇ-టెండర్లు కోరబడుచున్నవి. బిడ్డర్లు ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే వారి ఒరిజినల్ / రివైజ్డ్ బిడ్లను దాఖలు చేయవలెను. ఈ టెండరులో ఎటువంటి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏదేని మాన్యువల్ ఆఫర్ స్వీకరించినట్లయితే తదుపరిగా తిరస్కరించబడును.

క్ర.సం.1 **పని వివరణ:** టెండరు నం. CRS-E-27/2019-20-CRS/TPTY వర్క్ షాప్ వద్ద ఓవర్ ఏజ్డ్ HT UG కేబుల్ రీప్లేస్‌మెంట్. **సుమారు విలువ:** రూ. 17,70,909/-, **బయానా:** రూ. 35,400/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 4 నెలలు. **ముగింపు తేది:** 25-11-2019 @ 15.00 గం.లు

క్ర.సం.2 **పని వివరణ:** టెండరు నం. CRS-E-35/2019-20-CRS/TPTY ఆసుపత్రి పాత OPD భవనంకు రీవైరింగ్. **సుమారు విలువ:** రూ. 15,86,784/-, **బయానా:** రూ. 31,700/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 3 నెలలు. **ముగింపు తేది:** 25-11-2019 @ 15.00 గం.లు

క్ర.సం.3 **పని వివరణ:** టెండరు నం. CRS-E-37/2019-20-CRS/TPTY: 3 సంవత్సరాల కాలానికి TPTY షాప్స్ వద్ద POH యాక్టివిటీతో కలుపుకొని AC కోచెస్‌లో RMPU's ఫిట్టెడ్ కాంట్రాక్టు సమగ్ర నిర్వహణ. **సుమారు విలువ:** రూ. 4,72,47,884/-, **బయానా:** రూ. 3,86,200/-, **పూర్తి చేయాల్సిన కాలం:** 36 నెలలు. **ముగింపు తేది:** 25-11-2019 @ 15.00 గం.లు

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in

టెండరు యొక్క పూర్తి వివరాలు చూచుటకు నోటీసు బోర్డు గల ప్రదేశం : డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కార్యాలయం, కారేజ్ రిపేర్ షాప్, తిరుపతి.

తదుపరి టెండరు నిబంధనలు / వివరాలు (టెండరు డాక్యుమెంట్‌లో లభించును) కొరకు మరియు టెండరు డాక్యుమెంట్లు, సవరణ యొక్క డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ https://www.ireps.gov.in

**డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి**

**బహిరంగ టెండరు ప్రకటన నం. B/E.29/TrD/Tender/39 (2019-20) తేది: 28-10-2019**

దిగువ సంతకందారుచే IREPS పోర్టల్ ద్వారా దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

క్ర.సం.1 **పని వివరణ:** టెండరు నం. B/E.29/TrD/ టెండరు/39 (19-20). **పని వివరణ:** విజయవాడ డివిజన్ - విజయవాడ డివిజన్‌లో OHE మాస్ట్ పై "KM/లొకేషన్" నం.కు స్టెన్సిలింగ్. **పూర్తి చేయాల్సిన కాలం:** 270 రోజులు. **సుమారు విలువ:** రూ. 18,93,375/-, **బయానా:** రూ. 37,900/-, **టెండరు ఫారం ధర:** రూ. 2,000/-. **ముగింపు తేది మరియు సమయం:** 20-11-2019న 15.00 గం.లు

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ /Trd/విజయవాడ**

A1776

**తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.**


## అకారణంగా జైలుకు పంపారు!

- గాజువాక పోలీసుల తీరుపై దివ్యాంగుడి ఆవేదన
- హైకోర్టు చొరవతో విడుదల



గురుమూర్తి

గాజువాక, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మానవత్వం మరిచి పోలీసులు తనను వేధించారని విశాఖపట్నం నగర శివారు పెదగంట్యాడకు చెందిన దివ్యాంగుడు కండిబిల్లి గురుమూర్తి (31) ఆరోపించాడు. హైకోర్టు జోక్యంతో జైలు నుంచి విడుదలైన ఆయన సోమవారం మీడియాతో మాట్లాడాడు. పెదగంట్యాడలో నివాసం ఉంటున్న తాను గతంలో ఆటో నడిపేవాడినని, 2015లో జరిగిన ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయానని తెలిపాడు. తానుంటున్న ఇంటిలో ఓ గదిని కొద్దిరోజుల క్రితం ఓ వ్యక్తికి అద్దెకు ఇచ్చానని, అందులో అతను గుట్కా నిల్వ చేసినట్టు సమాచారం అందుకున్న పోలీసులు సరుకు సీజ్ చేశారన్నాడు. వ్యాపారి ఆ సరుకు తనదేనని అంగీకరించినా, అతనిపై కేసు నమోదు చేయకుండా ఇంటి యజమానినైన తనపైనే కేసు నమోదు చేసి జైలుకు పంపారని వాపోయాడు. తనకు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఉత్తర్వులు ఇవ్వడంతో తాను బయటపడ్డానని చెప్పుకొచ్చాడు.

## ఏలూరులో బాలికపై అత్యాచారం

ఏలూరు క్రైం, అక్టోబరు 28: ఏలూరు నగరంలో పదహారేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేసి పారిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు కొత్త బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న ఒక కాంప్లెక్స్ పనులకు పట్టణానికి చెందిన 16ఏళ్ల బాలిక సోమవారం వెళ్లింది. మధ్యాహ్నం మూత్ర విసర్జన కోసం సమీపంలో ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లగా, మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు ఆమెను బలవంతంగా పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి లాక్కెళ్లారు. అందులో ఒకడు ఆమెపై అత్యాచారానికి పాల్పడగా ఆమె స్పృహ కోల్పోయింది. దీంతో దుండగులిద్దరూ పారిపోయారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

## పేకాట వదిలేసి.. అవయవాలు అమ్ముకుని బతుకుతా!

- సబ్‌కలెక్టర్‌కు పేకాట రాయుడి వినతి

మదనపల్లె టౌన్, అక్టోబరు 28: పేక ముక్కల్ని ఎలాగైనా కలపండి.. కత్తెర వేసినా సరే.. మధ్యలో నుంచి ఏదో ఒక ముక్క తీసి పక్కనబెట్టండి. దాని కింద ఏముందే ఇట్టే చెప్పేస్తాడు. అలాగని అతడేమీ జాదూగర్ కాదు. 12 ఏళ్లుగా పేకముక్కలే జీవితంగా బతికిన మహా జూదరి. పేకాటపై తనకున్న అసాధారణ పట్టుతో లక్షలు సంపాదించాడు. జల్సాగా ఖర్చు పెట్టేశాడు. అలాంటోడికి పేకాటపై విరక్తి పుట్టింది. ఈ క్రమంలో.. 'ఇన్నాళ్లు పేకాటే జీవితంగా బతికాను. నాకిక పేకాట వద్దు. నాకు తెలిసిన విద్య అదొక్కటే. మరి నేనూ బతకాలిగా.. అందుకే నా అవయవాలు అమ్ముకుంటాను. అనుమతి ఇవ్వండి' అంటూ సబ్ కలెక్టర్‌ను వేడుకున్నాడు. చిత్తూరు జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం బావాజీ అనే యువకుడు చేసిన హడావిడికి సబ్‌కలెక్టర్ కీర్తి విస్తుపోయారు. ఇంతలో బావాజీ తండ్రి అక్కడికి వచ్చి తన కొడుకు మానసిక స్థితి సరిగా లేదని సబ్ కలెక్టర్‌కు వివరించాడు. బావాజీని మానసిక వైద్యులకు చూపిస్తామని సబ్‌కలెక్టర్ చెప్పారు.



సబ్‌కలెక్టర్ ఎదుట బావాజీ పేకముక్కల ప్రావీణ్యం

# రుణపాశానికి ఇద్దరు రైతులు బలి

తోట్లవల్లూరు/గొలుగొండ, అక్టోబరు 28: అప్పుల బాధ తాళలేక ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం పాములలంకకు చెందిన పొత్తూరి సుధాకర్(45)కు 2.50 ఎకరాల పొలం ఉంది. దీనికితోడు మరో 1.50 ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. నాలుగు ఎకరాల్లో కంద, పసుపు సాగు చేశాడు. ఆగస్టులో వచ్చిన కృష్ణానది వరదకు నాలుగు ఎకరాల్లోని పంట ధ్వంసమైంది. సాగుకు లక్షల్లో ఖర్చు చేశాడు. మళ్లీ రెండోసారి మినుము విత్తనాలు చల్లాడు. మినుము చేతికొచ్చి కొంతైనా ఆదుకుంటుందని భావించినా అక్టోబరులో రెండోసారి వరదతో ఈపంట కూడా మునిగిపోయింది. దీంతో అప్పుల నుంచి కోలుకోలేననే మనోవేదనతో ఈనెల 23న పురుగుల మందు తాగాడు. బంధువులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతు సోమవారం మృతిచెందాడు. అలాగే...విశాఖ జిల్లా గొలుగొండ మండలం పాకలపాడుకు చెందిన ఉలబాల వెంకునాయుడు (71) తనకు ఉన్న రెండున్నర ఎకరాల సాగు నిమిత్తం పలువురి వద్ద సుమారు రూ. 3 లక్షలు అప్పు చేశాడు. పంటలు సరిగా పండక, వాటిని తీర్చే దారిలేక మానసిక వేదనకు లోనయ్యాడు. దీనికితోడు తన ఇద్దరు కుమారుల్లో పెద్ద కొడుకు అనారోగ్యంతో పదేళ్ల క్రితం మృతిచెందడం, రెండో కొడుకు మతి స్థిమితం లేక ఇల్లు విడిచి వెళ్లిపోవడం, భార్య యర్రమ్మ ఆరోగ్యం అంతంత మాత్రం కావడం వంటి కారణాలతో కుంగిపోయాడు. ఈ పరిస్థితుల్లో సోమవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

## లారీతో ఢీకొట్టి ఈడ్చుకుపోయాడు!

- డ్రైవర్ నిర్లక్ష్యానికి యువకుడు బలి



ఆరిలోవ/మధురవాడ (విశాఖపట్నం), అక్టోబరు 28: లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయింది. లారీతో బైకును ఢీకొట్టడమే కాకుండా, ఆగకుండా వెళ్లిపోవడంతో ఓ యువకుడి జీవితం అర్థాంతరంగా ముగిసిపోయింది. విశాఖలోని మధురవాడ ఆదిత్యనగర్‌కు చెందిన సత్యాల చరణ్ (25) ఓ హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్నేహితుడిని రైల్వే న్యూకాలనీలో దింపేందుకని ఇద్దరు స్నేహితులు ఒక బైక్‌పైన, చరణ్ ఒక్కడూ ఒక బైక్‌పైనా బయలుదేరారు. డెయిరీఫారం జంక్షన్ దాటుతుండగా విజయనగరం వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ చరణ్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. లారీ వెనుక చక్రాల మధ్యలో బైక్‌తో పాటు చరణ్ చిక్కుకుపోయాడు. లారీ డ్రైవర్ దీన్ని గమనించకుండా వేగంగా ముందుకు వెళ్లిపోవడంతో రోడ్డు రాపిడికి బైక్‌కు మంటలంటుకున్నాయి. కొంతమంది చూసి కేకలు వేయడంతో కృష్ణా కాలే జీ జంక్షన్ సమీపంలో లారీ ఆపి, పా రిపోయాడు. అప్పటికే మూడు కిలోమీటర్ల దూరం ఈడ్చుకుని రావడంతో బైక్ కాలిపోగా ఆ మంటల్లో చరణ్ మృతదేహం పాక్షికంగా కాలడంతోపాటు ఛిద్రమైపోయింది. లారీని వెం బడించిన స్నేహితులు చరణ్ మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. తలకు హెల్మెట్ ఉన్నా చరణ్ మృత్యు వు నుంచి బయటపడలేకపోయాడంటూ విలపించారు. చరణ్ మ.దురవాడలో క్రికెటర్‌గా గుర్తింపు ఉండడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. పండగపూట తమ జీవితంలో చీకట్లు అలముకున్నాయని మృతుడి తల్లి, సోదరుడు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రభుత్వ బోనస్.. ప్రకటనలకే పరిమితం

- ధరల తేడాతో నష్టపోతున్న ఆయిల్‌పామ్ రైతులు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. నూనె శాతం తక్కువగా రావడమే ఇందుకు కారణం. పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలోని పామాయిల్ ఫ్యాక్టరీలో వచ్చే నూనె శాతాన్ని ప్రామాణికంగా తీసుకుని ధర నిర్ణయిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలో ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్) 17% దాటడం లేదు. తెలంగాణలోని ఆయిల్ ఫ్యాక్టరీలో 19%దాకా వస్తోంది. ఈ తేడా వల్ల ఏపీ రైతులు టన్నుకు రూ.వెయ్యి దాకా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని ఆయిల్‌పామ్ రైతులు గతేడాది అప్పటి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నూనె శాతంలో 1% నష్టాన్ని భరించి, రైతులకు టన్నుకు రూ.450దాకా బోనస్ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. దీనికి బడ్జెట్లో రూ.65 కోట్లు కేటాయించారు. కానీ సకాలంలో నిధులు విడుదల చేయలేదు. ప్రస్తుత సీఎం జగన్ కూడా ఆయిల్‌పామ్ రైతుల కోసం ఓఈఆర్ వ్యత్యాసం కింద రూ.85 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినా ఇంకా నిధులు విడుదల చేయలేదు. ఆయిల్‌పామ్ టన్నుకు రూ.10వేలు మద్దతు ధరగా నిర్ణయించాలని, ప్రకటించిన బోనస్ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేయాలని ఏపీ ఆయిల్‌పామ్ రైతుల సంఘం అధ్యక్షుడు వీరరాఘవరావు కోరారు.

## నాగులపాడులో న్యాయమూర్తులు

- హాస్టల్ విద్యార్థులకు ఏక రూప దుస్తులు అందజేత

పెదనందిపాడు, అక్టోబరు, 28: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండల పరిధిలోని నాగులపాడులో ఎస్‌సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వర రావు, జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఏక రూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు విద్యార్థుల భోజన సదుపాయాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వి ద్యార్థులు క్రమశిక్షణతో పాటు మంచి నడవడిక కలిగి ఉండాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. హరిహరనాథశర్మ, హైకోర్టు లీగల్ సర్వీస్ మెంబర్ సెక్రటరీ కృపాసాగర్, ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ జాగిలానికి

## అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ఒంగోలు (క్రైం) అక్టోబరు 28 : ప్రకాశం పోలీసుల షాడో డాగ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ షాడోడాగ్ మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. మృత దేహాన్ని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం వరకు ర్యాలీగా తీసుకెళ్లి అక్కడ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో షాడో చేసిన సేవలను కొనియాడారు. పోలీస్ శాఖలో డాగ్‌లకు ఇచ్చే శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిందని అన్నారు.

## సోనోవిజన్‌లో 'లక్కీడ్రా'

విజయవాడ(పాయకాపురం), అక్టోబరు 28: సోనోవిజన్ షోరూంలలో దసరా, దీపావళి పండుగల సందర్భంగా లక్కీడ్రా నిర్వహించారు. దీనిలో విజేతలైన వినియోగదారులకు సోమవారం కార్లను బహుమతిగా అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, బాపట్ల ఎంపీ నందిగం సురేశ్‌లు హాజరయ్యారు. కొనుగోలుదారుల సమక్షంలో నిర్వహించిన డ్రాలో భుజంగరావు(విజయవాడ) టయోటా ఎథియోస్, కాకినాడలో జరిగిన డ్రాలో విజయలక్ష్మి(కాకినాడ) హోండా అమేజ్, గుంటూరులో నిర్వహించిన డ్రాలో శివప్రసాద్ హోండా అమేజ్, తిరుపతి షోరూంలో నిర్వహించిన డ్రాలో రాఘవేంద్ర చెవర్లెట్ బీట్, నెల్లూరు షోరూంలో జరిగిన డ్రాలో మురళి, ఒంగోలు నిర్వహించిన డ్రాలో టి. సతీష్‌బాబు, ఏలూరులో నిర్వహించిన డ్రాలో జె.పవన్‌సాయిలు మారుతి ఆల్టో కార్లను గెలుపొందినట్టు షోరూం ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న కార్మికుడి భార్య రాశిని ఓదారుస్తున్న నేతలు

## కార్మికుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

▸ గుంటూరులో బాధితుని కుటుంబానికి టీడీపీ 2 లక్షల సాయం

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే అని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, టీడీపీ నాయకుడు నసీర్ అహ్మద్ విమర్శించారు. పనులు దొరక్క ఆత్మహత్య చేసుకున్న గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు పోలేపల్లి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని టీడీపీ నేతలు సోమవారం పరామర్శించారు. పార్టీ తరఫున రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్వరరావు రెండేళ్ల కుమారుడి చికిత్స కోసం రూ.50 వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నేతలు మీడియాతో మాట్లాడారు. ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవితం గడుపుతున్న వెంకటేశ్వరరావు పనులు దొరక్క సెల్ఫీ వీడియో తీసుకొని మరీ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఏ ఆధారం లేని కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని, వెంటనే ప్రభుత్వం రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. 'నా భర్త మరణానికి కారణం ఇసుక కొరతే. పని లేదని నాలుగు నెలలుగా బాధపడుతూ చేసేది లేక ఆత్మహత్య చేసుకున్నాడు" అని బాధితుడి భార్య రాశి కన్నీటి పర్యంతమయ్యారు.

## ఉపాధికి దూరమై..ఉసురు తీసుకుంటున్నారు!

▸ విశాఖ లాంగ్ మార్చ్‌కు మద్దతివ్వండి.. పార్టీలకు పవన్ పిలుపు

▸ నాగ బ్రహ్మాజీ కుటుంబానికి లక్ష సాయం

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలు తనను కలచివేశాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇసుక లేక నెలల తరబడి ఉపాధికి దూరమై ఉసురు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల మంది కార్మికుల కోసం బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీలుగా కలిసి సంఘటితంగా పోరాడాలని సోమవారం ఓ ప్రకటనలో పిలుపిచ్చారు. అసమగ్ర ఇసుక విధానం వల్ల బాధితులుగా మిగిలిన ఆ కార్మికుల ఆక్రోశం, ఆవేదన ప్రభుత్వానికి అర్థమయ్యేలా చేయాలని కోరారు. ఇప్పటికే బీజేపీ, వామపక్షాలు స్పందించాయని.. మిగిలిన పార్టీలు కూడా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులపై పోరాడేందుకు ముందుకు రావాలని సూచించారు. విశాఖపట్నంలో నవంబరు 3న తాము తలపెట్టిన 'చలో విశాఖపట్నం' నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలపాలని విన్నవించారు. 'రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన అస్తవ్యస్త ఇసుక విధానంతో ప్రత్యక్షంగా 19.6 లక్షల మంది, పరోక్షంగా 10 లక్షల మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. ఫలితంగా వారి కుటుంబాలు కష్టాల పాలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించాలి' అని కోరారు. నాగ బ్రహ్మాజీ కుటుంబానికి రూ.లక్ష సహాయం ప్రకటించారు.

### 30న పోస్టర్ విడుదల..

ప్రతి నియోజకవర్గంలో 30న విశాఖ లాంగ్‌మార్చ్‌కు సంబంధించిన పోస్టర్‌ను కార్మికుల చేతుల మీదగా విడుదల చేయించాలని జనసేన నిర్ణయించింది. 'చలో విశాఖ' ఏర్పాట్లు, సన్నాహాలపై పొలిటికల్ అఫైర్స్ కమిటీ (ప్యాక్) సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. కార్మికుల దుస్థితిని ప్రతి జిల్లా కేంద్రంలో ఎలుగెత్తి చాటాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా 31వ తేదీన జనసేన నేతలు జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందిస్తారు.

# కాసులకు రాసులు!

▸ ఇసుకపై దళారుల దర్జా
▸ లారీ ఇసుక 50 వేలుపైనే
▸ అడ్డగోలు ధరలతో హడల్
▸ ఆన్‌లైన్‌లో దొరికేది సగమే
▸ ఆ మాత్రానికే పడిగాపులు
▸ బుక్‌చేసుకొని పాయింట్‌కి వెళ్లేటప్పటికే నో స్టాక్ బోర్డు
▸ భవన యజమానుల గగ్గోలు
▸ ఎక్కడి నిర్మాణాలు అక్కడే
▸ నిర్మాణ కూలీలకూ వెతలు



అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇసుక కొరత భవన నిర్మాణ కూలీల ఉసురు తీస్తే, దొరికినా అంతంత ధరకు ఇసుక కొనలేక భవన యజమానులు, కాంట్రాక్టర్లు విలవిల్లాడుతున్నారు! వెరసి ఇసుక అందరి కళ్లలో నీళ్లు తెప్పిస్తోంది. నూతన విధానం రాష్ట్రంలో అమల్లోకి వచ్చినా, ఇసుక కొరత వేధిస్తూనే ఉంది. ఆన్‌లైన్‌లో పెడుతున్న స్టాక్‌పాయింట్ల వద్ద దొరుకుతోంది 50శాతం ఇసుకే. అవసరాల కోసం మరో 50శాతం ఇసుకను దళారుల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి! ఎలాంటి బిల్లు లేని ఈ ఇసుకను టన్ను రూ.1500-1700కు అమ్ముతున్నారు. అంటే ఒక ట్రాక్టర్ ఇసుక సుమారు రూ.6వేలు, ఒక చిన్నలారీ ఇసుక రూ.18వేలన్నమాట! ఇక పెద్ద లారీలు అయితే రూ.50వేల వరకు ఖర్చవుతోంది. ఆన్‌లైన్‌లో ఇసుక అమ్మకం కోసం కొన్ని స్టాక్‌పాయింట్లను చూపిస్తున్నా, అది నిమిషాల్లోనే అయిపోతుండడంతో వినియోగదారులు విసిగిపోతున్నారు. రోజుల తరబడి చూసినా, ఇంటర్నెట్ ద్వారా బుక్ చేద్దామని ప్రయత్నించినా సాధ్యం కాక ఆ ప్రయత్నమే వదిలేస్తున్నారు. వారిలో చాలామంది దళారులను పట్టుకుని ఇసుక కొనుగోలు చేస్తున్నారు. ఏపీఎండీసీ నిర్వహిస్తున్న వెబ్‌సైట్‌లో బుకింగ్ కోసం ప్రయత్నాలు చేసినా ఫలించకపోవడంతో అనివార్యంగా దళారులపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఉదాహరణకు విజయవాడ భవానీపురంలో ఒక స్టాక్‌పాయింట్‌ను ఏర్పాటుచేసి కొన్నిరోజులపాటు ఇసుక విక్రయించారు. అయితే పెట్టిన రెండు, మూడు రోజులే అది నడిచింది. ఆ తర్వాత నో స్టాక్ బోర్డు! అయితే కావాల్సిన వారికి, కాసులు ఎక్కువిచ్చినవారికి బ్లాక్‌లో అమ్మేశారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇలా చేయడంతో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి ఇసుక లేకుండా పోతోంది. అదే సమయంలో ఈ రీచ్‌లో ఇసుక బుక్ చేసుకుని...డీడీ కట్టి లారీ పంపించాక ఇసుక లేదని చెప్పిన సందర్భాలూ ఉన్నాయి. స్టాక్‌పాయింట్‌లో ఎంత ఇసుక ఉంటే అంతవరకే ఆన్‌లైన్‌లో అమ్ముతారు. ఆన్‌లైన్‌లో బుక్ అయిందంటే దాని అర్థం అక్కడ ఇసుక ఉందనే! కానీ బుక్ అయి డీడీ కట్టి లారీ కూడా పంపించాక...ఇసుక లేదనడం ఏంటని పలువురు వాదిస్తున్నారు. ఇసుక పక్కదారి పట్టడం వల్లే ఈ దుస్థితి ఎదురైందని పలువురు ఆరోపిస్తున్నారు.

### బుక్ చేసినా గ్యారంటీ లేదు

గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో ఇసుక దళారుల ద్వారానే ఎక్కువగా ఇసుక సరఫరా అవుతోంది. ప్రభుత్వం రూ.375గా టన్ను ఇసుక ధరను నిర్ణయిస్తే...దానికి ఒక రెండింతలు, మూడింతలు అధికంగా ఇచ్చినవారికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి బుక్ చేస్తున్న వ్యవహారాలు కొన్నిచోట్ల నడుస్తున్నాయని అంటున్నారు. మరోవైపు ఇసుక ధర ఇంకా ఆకాశంలోనే ఉంది. ఐదు నెలల క్రితం ఇసుక ప్రాంతాన్ని బట్టి ట్రాక్టరుకు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు లభించగా...ఇప్పుడది మూడురెట్లయింది. మూడువేలనుంచి ఆరువేల వరకు ధర నడుస్తోంది. గతంలో ఉచిత ఇసుక విధానం ఉంది. ఇప్పుడు ధర పెట్టారని అనుకున్నా ఇంత ధర ఉండకూడదు. ఒక ట్రాక్టరుకు సుమారు 3.3టన్నుల ఇసుక పడుతుంది. ప్రభుత్వ ధర ప్రకారం రూ.1,237అవుతుంది. దీనికి ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీ రూ.700-800అనుకున్నా....మొత్తంగా రెండువేల లోపే ఇసుక లభించాలి. కానీ రాష్ట్రంలో దాదాపుగా ఏ ప్రాంతంలోనూ ఈ ధరకు ఇసుక దొరకడంలేదు. ఈ ధర ఎప్పటికి దిగొస్తుందన్నది అర్థం కాకుండా ఉందని పలువురు వాపోతున్నారు. ధర ఇంత పెరిగిపోవడంతో అవసరమున్నా చాలామంది కొనుగోలు చేయడం లేదు. మరికొన్ని రోజులు చూద్దాం అన్న ధోరణిలో ఆగిపోతున్నారు. ఇక తప్పదు అనుకున్నవారు, ఆగినా నష్టమే అని తెగించినవారు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో కొన్ని పనులు కొనసాగుతుండగా...కొన్ని పనులు ఆగిపోయాయి. కొత్త ప్రాజెక్టుల ప్రారంభాలు వాయిదా వేసుకుంటూ వెళ్తున్నారు. దీంతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది.

## డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

▸ కార్యాచరణ సిద్ధం చేయండి: మంత్రి బాలినేని

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగే అవకాశముందని, అందుకు అనుగుణంగా కరెంట్ సరఫరా చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 150 మిలియన్ యూనిట్లుగా ఉందని, ఇది డిసెంబరు ఆఖరుకు 175 మిలియన్ యూనిట్లకు, వచ్చే మార్చికి 200 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సాగునీరు పుష్కలంగా ఉండటంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరిగినందున రబీ సాగు విస్తీర్ణం పెరుగుతోందన్నారు. రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్తు అందించడంపైనా దృష్టి పెట్టాలన్నారు. రైతుల అవసరాలను తీర్చే దిశగా క్షేత్రస్థాయి ఇంజనీర్లు, సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నామని ఇంధనశాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ మంత్రికి వివరించారు. రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో అక్టోబరు మూడో వారంలో కరెంట్ డిమాండ్ 139 మిలియన్ యూనిట్లకు తగ్గిందన్నారు. ఇది విద్యుత్ సంస్థలకు భారీగా ఊరటనిచ్చే అంశమని చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబరులో శ్రీశైలంలో 335.9 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామని, గత ఏడాది ఇదే సమయంలో 106.50 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేశారని జెన్‌కో ఎండీ బి. శ్రీధర్ తెలిపారు. శ్రీశైలం విద్యుత్పత్తి ద్వారా ఇంత భారీ ఎత్తున సరసమైన ధరల్లోనే విద్యుత్ ఉత్పత్తి జరగడం జెన్‌కోకు కలిసి వచ్చే అంశమని ఎండీ శ్రీధర్ చెప్పారు.

### వార్డు సచివాలయాల్లో మౌలిక వసతుల కల్పన

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో వార్డు సచివాలయ భవనాల నిర్మాణంతోపాటు వాటికి అవసరమైన ఫర్నిచర్, తదితర మౌలిక వసతులను కల్పించే అధికారాన్ని పురపాలక కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమం జిల్లాలవారీగా జరగాలని పేర్కొంది. ఇందుకోసం సంబంధిత జిల్లా కేంద్రపు మున్సిపల్ కమిషనర్లు, అన్ని పట్టణ స్థానిక సంస్థల నుంచి ఇండెంట్లు తీసుకోవాలని ఆదేశించింది.

# సర్కారీ పాయింట్‌లో 'ప్రైవేట్' స్టాక్

▸ కార్పొరేషన్ నిర్వహించాల్సిన ఇసుకపై అజమాయిషీ అంతా వైసీపీ నేతలదే
▸ బిల్లు ట్రాక్టరుకు.. లోడింగు లారీలకు
▸ లోడు బండ్లన్నీ బయటజిల్లాల వారివే
▸ ఎక్కడా కనిపించని అధికారుల జాడ
▸ నెక్కల్లు ఎన్‌సీసీ పాయింట్‌లో గడబిడ
▸ ఇదేమిటన్న విలేకరులపై దౌర్జన్యం
▸ బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు

తుళ్లూరు, అక్టోబరు 28 : ఇసుక కొరత తీర్చటానికి ఏపీ మినరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ కొన్ని ప్రయత్నాలు చేస్తోంది. పదిరోజుల క్రితం రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంలోని ఎల్అండ్‌టీ కంపెనీ నిల్వ చేసిన 81 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను స్వాధీనం చేసుకొని ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించింది. అయితే, ఎల్అండ్‌టీ కంపెనీ దీనిపై హైకోర్టును ఆశ్రయించగా, లోడింగ్ ఆపాలని కోర్టు స్టే ఇచ్చింది. తాజాగా ఏపీఎండీసీ.. నెక్కల్లు ఎన్‌సీసీ కంపెనీలో ఉన్న ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకొంది. గత నాలుగు రోజుల నుండి ఇక్కడి ఇసుకను లోడింగ్ చేస్తోంది. అయితే, ఈ స్టాక్ పాయింట్ నిర్వహణ తీరుపై స్థానికంగా విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఆరా తీయడానికి ఆదివారం అక్కడికి వెళ్లిన విలేకరులకు స్టాక్ పాయింట్ వద్ద అంతా ప్రైవేటు వ్యక్తులే కనిపించారు. వారిలో అధికార పార్టీ వ్యక్తులు ఉన్నట్టు విలేకరులు గుర్తించారు. అక్కడ ఎక్కడా ఏపీఎండీసీ తాలూకా అధికారులే కనిపించలేదు. లోడింగ్ కోసం నిలిపి ఉంచిన వాహనాల్లో ఎక్కువగా ఇతర జిల్లాలవే కనిపించాయి. ఇసుక ఆన్‌లైన్‌లో తమకు అందటం లేదని ఇప్పటికే స్థానికులు వాపోతున్నారు. ఓపెన్ చేసిన ఐదు నిమిషాలకే ఆన్‌లైన్‌లో పెట్టిన ఇసుక బుకింగ్ అయిపోతోందని చెబుతున్నారు. నెక్కల్లు ఎన్‌సీసీ స్టాక్ పాయింట్‌లోనే ఏదో గడబిడ ఉందని అనుమానిస్తున్నారు. ట్రాక్టర్ లోడింగ్‌కు బుక్ చేసుకొని, ఆ బిల్లుతో స్టాక్ పాయింట్ వద్ద లారీకి ఇసుక ఎత్తుకొంటున్న వైనం విలేకరులు గమనించారు. దీనిపై వివరాలకు ప్రయత్నించగా, విలేకరుల పట్ల అక్కడి స్టాక్ పాయింటు నిర్వాహకులు దురుసుగా వ్యవహరించారు. వారిని భయపెట్టడానికి ప్రయత్నించారు. అక్కడకు పోలీసులను పిలిపించారు. విలేకరులను పోలీసులు తమ వెంట తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విలేకరులను తీసుకెళ్లారని తెలుసుకొని.. పెద్దఎత్తున మీడియా ప్రతినిధులు స్టేషన్ వద్దకు చేరుకొన్నారు. వాస్తవానికి, స్టాక్ పాయింట్ దగ్గర తమ దృష్టికి వచ్చిన విషయాలను, తమతో అక్కడివారు దురుసుగా ప్రవర్తించిన సంగతిని విలేకరులు అంతకు ముందే సీఐకి ఫోన్ చేసి చెప్పారు. అయినప్పటికీ పోలీస్ స్టేషన్‌కు విలేకరులను బలవంతంగా తీసుకెళ్లి, కొద్దిసేపు కూర్చోబెట్టి ఆ తరువాత పంపించి వేశారు.



నెక్కల్లు ఎన్‌సీసీ ఇసుక స్టాక్ పాయింటు వద్ద బారులు తీరిన ఇతర జిల్లాలకు చెందిన లారీలు

### పులివెందుల నియోజకవర్గంలో
## వైసీపీ, టీడీపీ ఘర్షణ

▸ ఇద్దరికి తీవ్ర గాయాలు... 30 మందిపై కేసు

చక్రాయపేట, అక్టోబరు 28: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం కుమారకాల్వ హరిజనవాడలో ఆదివారం సాయంత్రం టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో 11 మంది గాయపడగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... తాళ్లపల్లె రాజేశ్, కుమారకాల్వ హరిజనవాడ గ్రామ వలంటీర్. ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో విధి నిర్వహణలో భాగంగా ఓటర్ కార్డు, ఆధార్ లింక్, ఇతర వివరాల కోసం గ్రామంలోకి వెళ్లాడు. ఏసురత్నం ఇంటి దగ్గరకు వెళ్లి వివరాలు అడుగుతుండగా వారు వలంటీర్‌పై దాడికి దిగారు. విషయం తెలిసిన ఇరువర్గాలు అక్కడకు చేరుకున్నాయి. పరస్పరం ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో మొత్తం 11 మంది గాయపడ్డారు. వీరిలో టీడీపీకి చెందిన గంగరాజు, వైసీపీకి చెందిన జ్ఞానముత్తు తీవ్రంగా గాయపడ్డారు. వారిని కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వైసీపీకి చెందిన జ్ఞానముత్తు, సుందరరాజుతో పాటు మరో 13 మంది, టీడీపీకి చెందిన తాళ్లపల్లె ప్రసాద్, ఏసురత్నంతో పాటు మరో 13 మంది... మొత్తం 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాకూ అర్హత మార్కులు తగ్గించండి

▸ సచివాలయాల పోస్టులపై బీసీ, ఓసీ అభ్యర్థులు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భర్తీ కాకుండా మిగిలిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే తమకూ కనీస అర్హత మార్కులు(క్వాలిఫై మార్కులు) తగ్గించాలని ఓసీ, బీసీ అభ్యర్థులు కోరారు. పలు జిల్లాల నుంచి సోమవారం అమరావతి సచివాలయానికి వచ్చిన బీసీ, ఓసీ అభ్యర్థులు... మంత్రులు పిల్లి సుభాష్ చంద్రబోస్, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పలువురు అధికారులను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగ పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది అర్హత సాధించలేదన్నారు. చాలా డిపార్ట్‌మెంటుల్లో బీసీ, ఓసీలకు చెందిన పోస్టులు 7వేల వరకూ ఖాళీగా ఉన్నాయని, అలాంటి పోస్టులకు అర్హత మార్కులు తగ్గించి భర్తీ చేయాలని కోరామన్నారు. మంత్రులు సానుకూలంగా స్పందించారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారని అభ్యర్థులు తెలిపారు.

### వరదొచ్చినా
# ప్రాజెక్టులు నిండలేదేం?

▸ జలవనరుల శాఖపై సీఎం అసంతృప్తి
▸ 40 రోజుల్లో వాటిని నింపాలని గడువు
▸ సమీక్షలో 'ఆంధ్రజ్యోతి' కథనాలపై చర్చ
▸ అత్యవసర కొత్త ప్రాజెక్టులకే పచ్చజెండా
▸ అధికారులకు ముఖ్యమంత్రి హితవు



ప్రాజెక్టులపై అధికారులు ఇచ్చిన వివరాలను పరిశీలిస్తున్న సీఎం

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వరదలొచ్చినా కృష్ణా జలాలపై ఆధారపడ్డ సాగు నీటి ప్రాజెక్టులు నిండలేదేమని జల వనరుల శాఖ అధికారులను సీఎం జగన్ నిలదీశారు. సోమవారం జరిపిన సమీక్షలో.. వరుసగా వరదలు వచ్చినా కృష్ణా జలాలపై ఆధారపడి నిర్మించిన సాగు నీటి ప్రాజెక్టులేవీ పూర్తిగా నిండకపోవడం.. నీరంతా సముద్రంపాలుకావడం, శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమలో నిర్మించిన ప్రాజెక్టులు పూర్తిసామర్థ్యానికి చేరుకోలేదని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వరుస కథనాల ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది. ఇంత భారీగా వరదలొచ్చినా కృష్ణా జలాలపై ఆధారపడ్డ ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో ఎందుకు నీరు చేరలేదని సీఎం ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులన్నిటిలో 40 రోజుల్లో నీళ్ల చేరేలా చర్యలు తీ సుకోవాలని ఆదేశించారు. ఇంత వరద వ చ్చినా రాయలసీమలోని కొన్ని రిజర్వాయర్లు నిండకపోవడంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కారణమేంటని అధికారులను ప్రశ్నించారు. ముఖ్యంగా చిత్రావతి, బ్రహ్మంసాగర్ పూర్తిగా నిండకపోవడాన్ని ప్రస్తావించారు. కాలువల సామర్థ్యం తక్కువగా ఉందని, అక్కడక్కడా ఆశించినంత మేర నీరు పోవడం లేదని అధికారులు చెప్పారు. శ్రీశైలం నుంచి సీమకు జలాలను తరలించే కాలువల సామర్థ్యాన్ని పెంచేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. పత్తికొండ రిజర్వాయరు సమస్యలను సీఎం తెలుసుకున్నారు. అక్కడ రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

### పెండింగ్ ప్రాజెక్టులపై..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రా జెక్టులు, పెండింగ్ ప్రాజెక్టులు, అత్యవసరంగా చేపట్టాల్సిన కొత్త ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్య క్రమంలో పూర్తి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేయాలని జల వనరుల శాఖ అధికారులకు సీఎం కర్తవ్యబోధ చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నవారేనని.. వారికి సాగునీరు, తాగు నీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని స్పష్టం చేశారు.

### ప్రాజెక్టుల వారీ సమీక్ష..

● శ్రీకాకుళం జిల్లా హిరమండలం రిజర్వాయరు నీటి నిల్వ సామర్థ్యం 19.3 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నిల్వ 5.61 టీఎంసీలేనని అధికారులు వివరించారు. కాలువ పనులు మిగిలిపోయాయని చెప్పారు. 2020 నాటికి పనులు పూర్తవుతాయన్నారు. ఈ ప్రాజెక్టులో 8 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇదే సమయంలో నేరడి వద్ద నిర్మించదలచిన బ్యారేజీపై విస్తృతంగా సమీక్షించారు. ట్రైబ్యునల్ ఆదేశాలు, కోర్టు తీర్పుల తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

● తూర్పు గోదావరిజిల్లా ముసురుమల్లి ప్రాజెక్టుకు మార్చి నాటికి గేట్లు అమర్చే ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెప్పారు.

● నెల్లూరులో సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడుకు వెళ్లే కాలువ సామర్థ్యాన్ని పెంచి నీటిని తరలించే ఆలోచన చేయాలని సీఎం ఆదేశించారు. కంభం చెరువుకు వెలిగొండ నుంచి నీటిని తీసుకెళ్లే అవకాశాన్ని పరిశీలించాలన్నారు.

● సోమశిల రిజర్వాయరుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, సహాయ పునరావాసాన్ని వెంటనే అందజేయాలని సీఎం సూచించారు.

● కండలేరు పూర్తి సామర్థ్యం 68.03 టీఎంసీలని.. 32.30 టీఎంసీలు నింపగలిగామని అధికారులు తెలిపారు. సోమశిల నుంచి కండలేరుకు సమాంతరంగా మరో కాలువ తవ్వకంపై ప్రణాళిక సిద్ధం చేయాలని జగన్ ఆదేశించారు.

● కనిగిరి రిజర్వాయరు అభివృద్ధికి రూ.20 కోట్లు ఇవ్వాలన్న స్థానిక ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారు.

● తిరుపతి కల్యాణి డ్యాం, ఎన్టీఆర్ జలాశయాలను ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నింపడంపై దృష్టిసారించాలని జగన్ సూచించారు.

● కర్నూలు జిల్లా అవుకు రిజర్వాయరుకు సంబంధించి అటవీ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని, 4.15 టీఎంసీలకు 3.3 టీఎంసీలు మాత్రమే నింపగలుగుతున్నామని అధికారులు వివరించారు. ఈ సమస్య ప రిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

● పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రిజర్వాయర్ కు తెలుగుగంగ నుంచి 5,000 క్యూసెక్కులకు బదులు 1,300 నుంచి 2,000 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయని అధికారులు తెలిపారు.

### ఆంధ్రా ప్రాంత సీనియర్ టెక్నికల్ అధికారిగా రోశయ్య

రిటైర్డ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ బి.రోశయ్యను ఆంధ్రా ప్రాంత సీనియర్ టెక్నికల్ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు.

## సముద్రంలోకి 4250 టీఎంసీలు

▸ గోదావరి నుంచి 3554.. కృష్ణా నుంచి 696 టిఎంసీలు

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):కృష్ణా గోదావరి నదులనుంచి గత ఏడాది సముద్రంలోకి వదిలిన నీరు 2485 టీఎంసీలు కృష్ణా గోదావరి నదులనుంచి ఈ ఏడాది ఇప్పటివరకు సముద్రంలోకి వదిలిన నీరు 4250 టీఎంసీలు కృష్ణా, గోదావరి నదుల నుంచి ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరదనీరు సముద్రంలోకి వెళుతోంది. ఈ రెండు నదుల్లో ఇంకా ప్రవాహాలు అధికంగానే ఉండడంతో సముద్రంలో కలిసే నీరు మరింత ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురియడంతో కృష్ణా బేసిన్‌లోని ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నారాయణపూర్, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల వంటి అన్ని ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. దీంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు శ్రీశైలం ప్రాజెక్టులోకి సుమారు 1582 టీఎంసీల నీరు వచ్చింది. అలాగే నాగార్జునసాగర్‌లోకి 1100 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఇలా ప్రాజెక్టులన్నీ నిండడంతో వరద నీటిని సముద్రంలోకి వదిలి పెడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కృష్ణా నది నుంచి సుమారు 696 టీఎంసీల నీటిని సముద్రంలోకి వదిలిపెట్టారు. అలాగే గోదావరి బేసిన్‌లోనూ వరద ప్రవాహం భారీగానే నమోదవుతోంది. సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులు మినహా మిగిలిన ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండాయి. శ్రీరామసాగర్ ప్రాజెక్టు కూడా నిండింది. దాంతో వరద నీటిని దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గోదావరి నది నుంచి సముద్రంలోకి ఇప్పటి వరకు సుమారు 3,554 టీఎంసీల నీటిని వదిలారు.

## పనికొచ్చేది రంగులకే

(మొదటి పేజీ తరువాయి)



నెల్లూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మాట్లాడారు. "తనకు అత్యధికంగా 151 సీట్లు ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ గిఫ్ట్‌గా ఇసుక కొరత ఇచ్చారు. సీఎం మాటకు, మంత్రుల మాటలకు సంబంధం ఉండడం లేదు. జగన్ ప్రకటిస్తున్న వరాలకు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఎంత మాత్రం పొంతన కుదరటం లేదు" అని కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నా సీఎం జగన్ స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

### పోలవరాన్ని ఆపేందుకు రివర్స్: పైడికొండల

"పోలవరం ప్రాజెక్టు పనులు ముందుకు వెళ్లకుండా ఆపేందుకే వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌కు వెళ్లింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందన్న వైసీపీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి ఆధారాలు చూపకుండా రివర్స్ టెండరింగ్‌తో చేతులు దులుపుకుంది" అని బీజేపీ నేత పైడికొండల మాణిక్యాలరావు మండిపడ్డారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగి ఉంటే, అవినీతి పరులను శిక్షించాలి తప్ప స్వలాభం కోసం రాజకీయాలు చేయడం సబబు కాదని ఎంపీ సుజనా చౌదరి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జగన్ ఛిన్నాభిన్నం చేశారని విమర్శించారు. సోమవారం నెల్లూరులో జరిగిన గాంధీజీ సంకల్పయాత్ర ముగింపు సభలో ఎంపీ మాట్లాడారు. ఇప్పటివరకు తానెప్పుడూ ఇలాంటి పాలనను చూడలేదన్నారు.

# జలం కోసం రుణం!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నందున బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు... కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమే మంచిదని అభిప్రాయపడ్డారు. సోమవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖపై సీఎం సమీక్ష జరిపారు. జల వనరుల మంత్రి పి.అనిల్‌కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, కృష్ణా డెల్టా సిస్టమ్, పోలవరం సాగు నీటి ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు. ప్రాధాన్య ప్రాజెక్టులు పీ-1 జాబితా.. అప్రధాన జాబితా పీ-2లో ఉన్న పథకాలపైన, అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పైన ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాధాన్య జాబితాలోని ప్రాజెక్టుల వ్యయం రూ.20,000 కోట్లకు మించి ఉండడం.. అప్రాధాన్య జాబితాలోని ప్రాజెక్టుల వ్యయం రూ.1200 కోట్లు మాత్రమే ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అన్నీ రద్దు చేయక్కర్లేదు...

హంద్రీ-నీవా ప్రాజెక్టు పూర్తవ్వాలని.. అది చేయకుండా దానితో అనుసంధానించిన ప్రాజెక్టులు పూర్తయినా నిష్ఫలమేనని జగన్ స్పష్టం చేశారు. ప్రాధాన్య ప్రాజెక్టులను నిర్ణయించేటప్పుడు కాస్త ఆలోచించాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రాజెక్టుల్లో 25 శాతంలోపు చేపట్టిన అన్నిటినీ రద్దు చేయాల్సిన అవసరం లేదని.. వాటిని కొనసాగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని పేర్కొన్నారు. ప్రాజెక్టుల ప్రాధాన్యాన్ని సరిచేసి వచ్చే నెల 8వ తేదీన మరోసారి భేటీ అవుదామన్నారు. అప్పటి భేటీకి ఆదిత్యనాథ్‌దాస్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, రాయలసీమ సీఈ నారాయణరెడ్డి హాజరైతే సరిపోతుందని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రాధాన్యాలేమిటో.. ఏయే ప్రాజెక్టులను నిలిపివేస్తారో తేలిపోతుందని జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

## భూ వివరాల నమోదులో జాగ్రత్త

▸ అధికారులకు డిప్యూటీ సీఎం బోసు సూచన

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూరికార్డుల స్వచ్ఛీకరణపై 13 జిల్లాల జాయింట్ కలెక్టర్లతో డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్ సోమవారం అమరావతి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. రాష్ట్రంలోని భూమి వివరాలు సేకరించి వాటిని క్రోడీకరించడంలో రెవెన్యూ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉగాది నాటికి పేదలందరికీ ఉచిత ఇళ్ల స్థలాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోన్నందున రికార్డులను సరి చేయాలన్నారు. రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం ఇప్పటికే 78 లక్షల దరఖాస్తులు వచ్చాయని, అవికాక పట్టణ ప్రాంతాల నుంచి 3.48 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు.



## అరగంట నెట్‌ఫ్లిక్స్.. 1.6 కిలోల కార్బన్ డై ఆక్సైడ్

న్యూఢిల్లీ, అక్టోబరు 28: ఇప్పుడు సినిమాలను నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ తదితర వీడియో స్ట్రీమింగ్‌లో స్మార్ట్ ఫోన్‌లోనే చూస్తున్నారు. అయితే, వీటితో పర్యావరణానికి చేటు జరుగుతోందని నిపుణులు అంటున్నారు. నెట్‌ఫ్లిక్స్‌లో అరగంట పాటు వీడియో వీక్షణం 1.6 కిలోల కార్బన్ డై ఆక్సైడ్ విడుదలకు కారణం అవుతుందని వారు చెబుతున్నారు. ఈ విడుదల పరిమాణం 6.28 కిలోమీటర్ల దూరం వాహనం నడిపిన దానితో సమానమని పేర్కొంటున్నారు.



## ఇసుక రేణువంత కెమెరా సెన్సర్

కాలిఫోర్నియా, అక్టోబరు 28: ఈ ఫొటోలో కనిపిస్తున్నది ప్రపంచంలోనే అతిచిన్న మెడికల్ కెమెరా సెన్సర్. దీని పేరు ఓవీ6948. ఇది ఇసుక రేణువంతే ఉండటంతో గిన్నిస్ బుక్‌లో చోటు దక్కింది. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన ఓమ్నీవిజన్ టెక్నాలజీస్ సంస్థ దీన్ని అభివృద్ధి చేసింది. దీని పరిమాణం 0.575ఎం.ఎంx 0.575 ఎం.ఎంx0.232 ఎం.ఎం. ఇందులోని పిక్సెల్ పరిమాణం 1.75 మైక్రాన్లు. అయితే, దాని సామర్థ్యమేం తక్కువ కాదు. 200x200 రెజల్యూషన్ ఉన్న వీడియోను సెకనుకు 30 ఫొటో ఫ్రేముల చొప్పున నిక్షిప్తం చేసుకోగలదు.



## చైనా బామ్మ.. 67 ఏళ్లకు తల్లి

బీజింగ్, అక్టోబరు 28: చైనాలో 67 ఏళ్ల బామ్మ బిడ్డకు జన్మనిచ్చింది. జోజ్వాంగ్ నగరంలోని ఓ ఆస్పత్రిలో ఆమెకు ఆడ శిశువు పుట్టింది. దీంతో బామ్మ టియాన్, ఆమె భర్త హువాంగ్(68)ల ఆనందానికి అవధులు లేకుండాపోయింది. 'ఈ పాప మనకోసమే స్వర్గలోకం నుంచి వచ్చింది' అంటూ ఒకరినొకరు అభినందించుకున్నారు. హువాంగ్ న్యాయవాదిగా పని చేస్తుండగా, టియాన్ నర్సుగా పనిచేసి రిటైర్ అయ్యారు. 9 నెలల క్రితం ఆరోగ్యం బాగాలేదంటూ ఆస్పత్రికి వెళ్లగా గర్భంతో ఉన్నట్లు టియాన్‌కు తెలిసింది. ఇప్పటికే వారికి ఇద్దరు పిల్లలున్నారు.




## అమ్మకానికి 'డైలీ టెలిగ్రాఫ్!'

లండన్, అక్టోబరు 28: బ్రిటన్‌లో 165 ఏళ్ల చరిత్ర కలిగిన డైలీ టెలిగ్రాఫ్, సండే టెలిగాఫ్ పత్రికలను అమ్మకానికి పెట్టారు. ఈ పత్రికలను సర్ ఫ్రెడ్రిక్, సర్ డేవిడ్ బార్క్‌లే సోదరులు 2004లో కొన్నారు. గత కొన్నేళ్లుగా లాభాలు భారీగా తగ్గడంతో వాటిని అమ్మేయాలని ఆ సోదరులు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ రెండు పత్రికలు కన్సర్వేటివ్ పార్టీకి అనుకూలమని చెబుతుంటారు. ఈ పత్రికలను అమ్ముతారంటూ గత ఏడేళ్లుగా వార్తలొస్తున్నాయి. గతంలో ఈ వార్తలను ఖండించిన బార్క్‌లే సోదరులు ఇప్పుడు మాత్రం నో కామెంట్ అంటున్నారు.



## పాక్‌లో గుడి పునరుద్ధరణ!

లాహోర్, అక్టోబరు28: పాకిస్థాన్‌లో వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఒక పురాతన దేవాలయాన్ని పునరుద్ధరించారు. సియాల్‌కోట్‌లోని ధారోవాల్ ప్రాంతంలో శ్వాలా తేజ్ సింగ్ ఆలయాన్ని ప్రభుత్వం పునరుద్ధరించి అక్కడి హిందూ కౌన్సిల్‌కు అప్పగించింది. దీపావళి సందర్భంగా హిందువులు ఇక్కడ పూజలు చేసి మిఠాయిలు పంచిపెట్టారు. 1992లో బాబ్రీ మసీదు విధ్వంసానికి ప్రతీకారంగా కొందరు దుండగులు ఈ గుడిని కొంతమేర ధ్వంసం చేశారు. కాగా, పాకిస్థాన్‌లో మైనారిటీలుగా ఉన్న అహ్మదీయులకు చెందిన ఒక మసీదును అధికారులు కూల్చివేశారు.



## ఎడారి దేశం సౌదీలో వరదలు

రియాద్, అక్టోబరు 28: ఎడారి దేశం సౌదీ అరేబియాలోని ఈశాన్య ప్రాంతాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరదల ధాటికి ఏడుగురు మృతి చెందగా, మరో 11 మందికి గాయాలయ్యాయి. హఫర్ అల్ బాతిన్ నగరంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సోమవారం ఇక్కడి పాఠశాలలకు సెలవు ఇచ్చారు. 16 మందిని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ఖాళీ చేయించారు. సౌదీ అరేబియాలో ఈ ఏడాది జనవరిలో భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదల ధాటికి 12 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# కాలిఫోర్నియాలో దావానలం

### తీర రాష్ట్రాన్ని చుట్టుముట్టిన కార్చిచ్చు.. గంటకు 164 కిలోమీటర్ల వేగంతో భీకర గాలులు





- 2 లక్షల మంది తరలింపు
- 28 లక్షల మందికి నిలిచిన విద్యుత్తు

శాంటా రోసా, అక్టోబరు 28: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రాన్ని కార్చిచ్చు కమ్మేసింది. అసలే పొడి వాతావరణం.. ఆపై భీకరమైన గాలులు తోడవడంతో అడవులతోపాటు ఇళ్లు, ఇతర నిర్మాణాలు పెద్ద మొత్తంలో కాలి బూడిదయ్యాయి. అరిజోనా, ఫ్లోరిడా, కాలిఫోర్నియాలలో కార్చిచ్చు చెలరేగడం కొత్తేమీ కాదు! కానీ, కాలిఫోర్నియా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన విపత్తుగా నిలిచిపోయే స్థాయిలో ప్రస్తుత కార్చిచ్చు దహించివేస్తోంది. గవర్నర్ గావిన్ న్యూసమ్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. సొనోమా కౌంటీలోని కిన్‌కేడ్ అడవిలో బుధవారం అర్ధరాత్రి రాజుకున్న కార్చిచ్చు 54 వేల ఎకరాలకు పైగా విస్తరించి కాలిఫోర్నియా వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. భూతల మార్గంతోపాటు హెలికాప్టర్ల ద్వారా నీళ్లు చల్లుతూ మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక దళాలు తీవ్రంగా శ్రమించినా మంటలు 5 శాతమే అదుపులోకి వచ్చాయి. గంటకు 164 కిలోమీటర్ల వేగంగా భీకరమైన గాలులు వీస్తుండడంతో మంటలు ఇతర ప్రాంతాలకూ విస్తరించాయి. దీంతో, కిన్‌కేడ్, శాంటా రోసా, సొనోమా ప్రాంతాల్లోని 2 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలెగ్జాండర్ వ్యాలీలో 1869లో స్థాపించిన 'సోడా రాక్' మద్యం తయారీ కేంద్రం పూర్తిగా బూడిదైంది. శనివారం నుంచి 28 లక్షల మందికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

# ఐఎస్ అధిపతి హతం

## బగ్దాదీని మట్టుపెట్టిన అమెరికా సైన్యం.. కలుగులో ముగిసిన 'ఉగ్ర నేత' కథ

*అబూ బకర్ అల్-బగ్దాదీ! అతిక్రూర, అరాచక ఐఎస్‌కు అధిపతి! అతని కథ ముగిసింది. అమెరికా సైన్యం అత్యంత పకడ్బందీగా నిర్వహించిన ఆపరేషన్‌లో బగ్దాదీ 'అంతమయ్యాడు!' అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఈ ప్రకటన చేశారు. 'ఔను! అల్ బగ్దాదీని చంపేశాం. ఇది జాక్‌పాట్' అని తెలిపారు. శనివారం రాత్రి నిర్వహించిన ఈ దాడికి 'ఆపరేషన్ కెలా ముల్లర్' అని పేరుపెట్టారు. ఈ ఆపరేషన్ ఎలా జరిగిందంటే...*





అల్ బగ్దాదీ తలదాచుకున్న ఇంటిని ధ్వంసం చేసిన అమెరికా దళాలు.. ఇన్‌సెట్‌లో ఐఎస్ అధిపతి అల్ బగ్దాదీ

వాషింగ్టన్, అక్టోబరు 28: 'బగ్దాదీ సిరియాలోని ఇడ్లిబ్‌లో ఉన్నాడు'... నెల క్రితం అమెరికా నిఘా విభాగానికి అందిన సమాచారమిది! దీనికి తోడు కుర్దులు మరికొంత 'కీలకమైన' వివరాలు అందించారు. అంతే... 'ఆపరేషన్ కెలా ముల్లర్' మొదలైంది. ఉగ్రవాదులపై రహస్య ఆపరేషన్లు నిర్వహించడంలో చేయి తిరిగిన 'డెల్టా ఫోర్స్' కమెండోలు రంగంలోకి దిగారు. పశ్చిమ ఇరాక్‌లోని అల్-అసద్ ఎయిర్ బేస్ నుంచి ఎనిమిది సీహెచ్-47 హెలికాప్టర్లలో కమెండోలు సిరియావైపు కదిలారు. వారి వెంట... ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలాలు, ఒక మిలిటరీ రోబో! వారికి ఒక యుద్ధ విమానం, కుదిరిన చోట సముద్రంలో యుద్ధ నౌకలూ అండగా నిలిచాయి. శనివారం రాత్రి 10.30 గంటలకు డెల్టాఫోర్స్ కమెండోల హెలికాప్టర్లు సిరియాలోని ఇడ్లిబ్ ప్రాంతానికి చేరుకున్నాయి. బగ్దాదీ బస చేసిన భారీ భవంతి సమీపానికి రాగానే... హెలికాప్టర్లపైకి కింది నుంచి తుపాకీ గుళ్ల వర్షం కురిసింది. కమెండోలు తుపాకులకు పనిచెప్పి.. నిమిషాల్లోనే గ్రౌండ్ 'క్లియర్' చేసేశారు. హెలికాప్టర్లు భద్రంగా కిందికి దిగాయి. భారీ ప్రహరీ... దానికి ఒక ద్వారం! తాళాలను బద్దలు కొట్టి లోపలికి వెళ్లొచ్చు. కానీ... తలుపులు బలవంతంగా తీస్తే భారీ పేలుడు జరిగే ఏర్పాటు చేసి ఉండొచ్చు! దీంతో పేలుడు పదార్థాలతో గోడను బద్దలు కొట్టారు. ఊహించినట్లుగానే లోపల కొందరు ఉగ్రవాదులున్నారు. కమెండోలు అత్యాధునిక ఆయుధాల నుంచి కురుస్తున్న గుళ్ల వర్షానికి ఐఎస్ ఉగ్రవాదులు చెల్లాచెదురయ్యారు! కమెండోలు ఆరు రాకెట్లను ప్రయోగించారు. ప్రతిదాడిలో కొందరు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు లొంగిపోయారు. పరిస్థితి చేయిదాటిపోయిందని బగ్దాదీకి అర్థమైపోయింది. 'పోరాటం' పక్కనపెట్టాడు. విశాలమైన ఆ ఆవరణలో... ముందుగానే ఏర్పాటు చేసుకున్న ఒక సొరంగంలోకి పరుగు తీశాడు. తనతోపాటు తన ముగ్గురు పిల్లలనూ తీసుకెళ్లాడు. బగ్దాదీ ఇంట్లో సొరంగం ఎక్కడుందో కూడా డెల్టా ఫోర్స్ కమెండోలకు ముందుగానే తెలుసు. వారు కూడా లోపలికి వెళ్లి అతడిని వెంటాడవచ్చు! కానీ... సొరంగంలో అనుకోని ప్రమాదం ఎదురు కావొచ్చు. అందుకే... బగ్దాదీని తరిమే పనిని తమ జాగిలాలకు అప్పగించారు. ఒకవైపు యమదూతల్లా వెంటాడుతున్న జాగిలాలు! చెవుల్లో మార్మోగుతున్న వాటి అరుపులు! సొరంగంలో మరింత ముందుకెళ్తే మార్గం లేదు. ఈ పరిస్థితుల్లో బగ్దాదీకి మరో 'మార్గం' కనిపించలేదు. అంతటి క్రూరుడిలోనూ చావంటే భయం! ఆ భయంతో అరిచాడు. కేకలు పెట్టాడు. ఏడ్చాడు! ఇక ఏమీ చేయలేక... జాగిలాలు తనదాకా రాకముందే... నడుముకు కట్టుకున్న బాంబుల బెల్టు మీట నొక్కాడు. అంతే... భారీ పేలుడు! బగ్దాదీ దేహం... ముక్కలు ముక్కలు! అతనితోపాటు ముగ్గురు పిల్లలూ మరణించారు. ఆ పేలుడుకు సొరంగమూ కుప్పకూలింది. ఈ పేలుడులో ఒక జాగిలం గాయపడింది. ఈ ఆపరేషన్ కోసం ఆర్మీ రోబోను తీసుకొచ్చినా వాడలేదు.

### ఎవరీ కెలా ముల్లర్?

అమెరికాకు చెందిన కెలా ముల్లర్(26) ది విషాద గాథ! సంక్షుభిత ప్రాంతాల్లో బాధితులకు సాయం చేసే కెలా 2013లో సిరియాలోని అలెప్పోలో ఓ ఆస్పత్రి నుంచి వస్తుండగా ఐఎస్ ఉగ్రవాదులు బంధించారు. ఆమెపై ఐఎస్ చీఫ్ అల్ బగ్దాదీ రెండేళ్లపాటు అత్యాచారం చేసి 2015 ఫిబ్రవరిలో చంపేశారు. ఈ ఆపరేషన్‌కు కెలా పేరు పెట్టారు.

### అక్కడ 11 మంది పిల్లలు!

బగ్దాదీ ఇంటి ఆవరణలో కమెండోలకు 11 మంది పిల్లలు కనిపించారు. వీరు బగ్దాదీ సంతానం కావొచ్చునని ట్రంప్ చెప్పారు. వారందరినీ క్షేమంగా ఒక సంస్థకు అప్పగించామన్నారు. ఈ దాడిలో మొత్తం 8 మంది మరణించారు. ఒక్క కమెండో కూడా గాయపడలేదు.

### 15 నిమిషాల్లోనే నిర్ధారణ

బగ్దాదీ శరీర భాగాలకు డీఎన్ఏ పరీక్షలు జరిపారు. అనంతరం 15 నిమిషాల్లోనే అతడి మృతిని అమెరికా ధ్రువీకరించింది. "ఎస్... చనిపోయింది అతనే. మాకు జాక్‌పాట్.. ఆపరేషన్‌ను సినిమాలాగా లైవ్‌లో చూశాం' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ ఆపరేషన్ కోసం గగనతలాలను వాడుకునేందుకు రష్యా, టర్కీల అనుమతులనూ తీసుకున్నారు. ఈనేపథ్యంలో "అబూ బకర్ అల్ బగ్దాదీ, ఇస్లామిక్ స్టేట్ రాజ్యంలో మత పండితుడు, 48వ ఏట మరణించాడు" శీర్షికతో వాషింగ్టన్ పోస్ట్ వార్తను ప్రచురించింది. శీర్షికపై విమర్శలు వెల్లువెత్తడంతో పత్రిక తన తప్పును సరిదిద్దుకుంది. కాగా, బగ్దాదీ మరణించాడన్న అమెరికా ప్రకటనపై రష్యా అనుమానం వ్యక్తం చేసింది.

### 'ఖలీఫా'తో పాటు వారసుడూ ఖతం



బాగ్దాద్: ఖలీఫాగా తనను తాను ప్రకటించుకున్న అబూ బకర్ అల్ బగ్దాదీ మరణం ప్రపంచవ్యాప్తంగా జిహాదిస్టులకు కోలుకోలేని దెబ్బ. తన వారసుడిగా ఆంతరంగికులకు పరిచయం చేసిన వ్యక్తి, ఐఎస్ అధికార ప్రతినిధి అబూ హసన్ అల్ ముహాజిర్ కూడా బగ్దాదీ మరణించాక కొన్ని గంటలకు కుర్దుల దాడిలో చనిపోయాడు. బగ్దాదీకి ఆంతరంగికుడిగా పేరొందిన అబ్దుల్లా ఖర్దాష్ ఐఎస్ కొత్త నేతగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రచురించింది. ఇరాక్ మాజీ అధినేత సద్దాం హుస్సేన్ వద్ద ఆర్మీ కమాండర్‌గా పనిచేసిన ఖర్దాష్ ఆ తరువాత బగ్దాదీకి చేరువయ్యాడు.

## ఎవరీ అల్ బగ్దాదీ?

### సద్దాం అంతంతో మొదలైన ఉగ్ర కథ

- లాడెన్ హత్యతో అగ్ర ఉగ్రవాది ముద్ర
- అల్‌కాయిదానే తలదన్నేలా రక్తపాతం

ఇరాక్‌లోని సమర్రా ప్రాంతంలో 1971లో అబూ బకర్ అల్ బగ్దాదీ జన్మించాడు. తండ్రి షేక్ అవాద్ ఇస్లామిక్ ధర్మ బోధకుడు. చదువులో అల్ బగ్దాదీ చురుగ్గా ఉండేవాడు. కంటి సమస్య కారణంగా అతడిని సైన్యంలోకి తీసుకోలేదు. బాగ్దాద్ యూనివర్సిటీలో చేరి వైజ్ఞానిక, భాషా శాస్త్రాలు చదివాడు. ఇస్లామిక్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. విద్యార్థి దశలో తోర్చీలోని మసీదులోని ఒక గదిలో ఒంటరిగా గడిపేవాడు.హింస అంటేనే ఏవగించుకొనేవాడు. ఇరాక్‌పై 2003లో అమెరికా దాడి, సద్దాం హుస్సేన్‌ను పదవీచ్యుతుడిని చేయడం వంటి పరిణామాలు బగ్దాదీ ఆలోచనల్లో మార్పు తెచ్చాయి. ఆ సమయంలో అతడు షరియా మండలి పెద్దగా వ్యవహరించేవాడు. ఈ మండలి.. జమాత్ జైష్ అహిల్ ఎల్ సున్నీ అనే మిలిటెంట్ సంస్థను నడిపించేది. ఈ సంస్థను 2006లో అతడు ముజాహిద్దీన్ సురా మండలిలో విలీనం చేసి.. ఆ మండలి అధ్యక్షునిగా ఎదిగాడు. ఆ హోదాలో ఖలీఫాగా అవతరించి, ఇస్లామ్‌కు పెద్ద దిక్కుగా ప్రకటించుకున్నాడు. ఈ మండలే 2006లో ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్, సిరియా (ఐఎస్ఐఎస్)గా పేరు మార్చుకుంది. అమెరికా సేవలకు సద్దాం పట్టుబడింది ఇదే సంవత్సరం. అప్పటి నుంచే అల్ బగ్దాదీ... ఐఎస్ఐఎస్‌లో చురుగ్గా మారాడు. ఈ సంస్థ వ్యవస్థాపకుడు అల్ ఒమర్ అల్ బగ్దాదీ 2010లో అమెరికా సేనల దాడిలో చనిపోయాక... ఐఎస్ఐఎస్‌కి సారథి అయ్యాడు. తమ నాయకుడి పేరులోని అల్ బగ్దాదీని తన పేరుగా మార్చుకొన్నాడు.

## భారత్‌పైనా ఐఎస్ గురి!

- హైదరాబాద్‌లో 'అబుధాబి మాడ్యుల్'

భారత్‌పైనా గురిపెట్టిన ఐఎస్ ఉగ్రవాదులు విధ్వంసాలకు వ్యూహరచన చేశారు. అబ్దుల్లా బాసిత్ అరెస్టుతో హైదరాబాద్‌లో ఐఎస్ (అబుధాబి మాడ్యుల్) మూలాలు బయటపడ్డాయి. బాసిత్‌తో పాటు మరికొందరు ఐఎస్‌లో చేరేందుకు వెళుతూ మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక బృందానికి దొరికారు. గత ఏప్రిల్ 20న హైదరాబాద్ కింగ్స్ కాలనీలో ఎన్ఐఏ తనిఖీలు నిర్వహించి, నఫీజ్ ఖాన్, ఒబేదుల్లా ఖాన్, మహ్మద్ షరీఫ్ మొహియుద్దీన్, అబు హన్స్‌లను అరెస్టు చేసింది. వీరంతా ఐఎస్ అనుబంధ సంస్థ జునూద్ అల్ ఖలీఫా-ఎ-హింద్ సభ్యులని గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన నలుగురు యువకులు సిరియా వెళ్లి, ఐఎస్‌లో చేరారని ఎన్ఐఏ దర్యాప్తులో నఫీజ్‌ఖాన్ వెల్లడించినట్లు తెలిసింది.

ఇరాక్‌లో 2014లో ఐఎస్ అపహరించిన 40 మంది భారతీయుల్లో 39 మందిని దారుణంగా హతమార్చారు. 40వ వ్యక్తి (హర్జీత్ మసీహ్) ముస్లిం అని చెప్పుకొని బయటపడ్డాడు. లిబియాలో ప్రొఫెసర్లు బలరాం కిషన్ (కరీంనగర్), గోపీకృష్ణ (శ్రీకాకుళం)ను ఐఎస్ ఉగ్రవాదులు 2015లో అపహరించారు. వారిద్దరూ 2016లో క్షేమంగా విడుదలై.. భారత్‌కు తిరిగి వచ్చారు.

- సెంట్రల్ డెస్క్



ఉగ్రవాదుల గ్రెనేడ్ దాడిలో గాయపడిన మహిళ

## కశ్మీర్‌లో ట్రక్కు డ్రైవర్ హత్య

### బస్టాండ్‌పై గ్రెనేడ్ దాడి.. 20 మందికి గాయాలు.. ఆరుగురు విషమం

శ్రీనగర్, అక్టోబరు 28: కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కనిల్వాన్ ప్రాంతంలో ఓ ట్రక్కు డ్రైవర్‌ను మిలిటెంట్లు హత్యచేశారు. మృతుడిని ఉధంపూర్ జిల్లావాసి నారాయణ్ దత్‌గా గుర్తించారు. మరోవైపు సోపోర్ పట్టణంలోని ఓ బస్టాండ్‌లో ఉగ్రవాదులు సోమవారం గ్రెనేడ్ విసిరారు. దీంతో బస్సుల కోసం ఎదురుచూస్తున్న 20 మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. కశ్మీర్‌లో యూరోపియన్ యూనియన్ ఎంపీల పర్యటనకు ముందే ఈ ఘటన జరిగింది.

## ఇమ్రాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ మార్చ్

ఇస్లామాబాద్, అక్టోబరు 28 : ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ జమాతే ఉలెమాయె ఇస్లాం పార్టీ ఆధ్వర్యంలో 'ఆజాదీ మార్చ్' మొదలైంది. ఆదివారం కరాచీ సహా వివిధ నగరాల నుంచి ప్రజలు ర్యాలీగా రాజధాని ఇస్లామాబాద్ వైపు బయలుదేరారు. దాదాపు లక్ష మంది నిరసనకారులు ఈనెల 31న పాకిస్థాన్ రాజధానిలో దాదాపు లక్షమంది ఆందోళనకారులు ఏకమై తమ గొంతు వినిపించనున్నారు. ఈ మార్చ్‌కు ప్రతిపక్ష పార్టీలన్నీ ఇప్పటికే మద్దతు ప్రకటించాయి. కాగా, కార్యక్రమం కోసం రూ.100 కోట్ల విరాళాలు సేకరించారు.

## ఎయిమ్స్‌కు చిదంబరం తరలింపు; డిశ్చార్జి

న్యూఢిల్లీ, అక్టోబరు 28: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరాన్ని అనారోగ్య కారణాలతో సోమవారం ఎయిమ్స్‌లో చేర్చారు. కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పడంతో ఉదయం ఆ యనను రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం ఎయిమ్స్‌కు మార్చారు. వైద్యుల బృందం చికిత్స అనంతరం గంటన్నరలోనే డిశ్చార్జి చేశారు. చిదంబరం ఆరోగ్యం బాగోలేదని సన్నిహితులు చెబుతోంటే.. తీవ్రమైన ఇబ్బందేమీ లేదని ఈడీ వర్గాలు అంటున్నాయి.

## ఐఐఎమ్‌సీ 'ఎంబీఏ' ప్రోగ్రాంకు 20వ ర్యాంకు

కోల్‌కతా, అక్టోబరు 28: ఫైనాన్షియల్ టైమ్స్ ప్రకటించిన 'మాస్టర్ ఇన్ మేనేజ్‌మెంట్ ర్యాంకింగ్స్- 2019'లో కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రపంచంలో 17వ స్థానం దక్కించుకుంది. తమ సంస్థలో ఎంబీఏ ప్రోగ్రాంకు ఈ ర్యాంకు వచ్చిందని ఐఐఎం(సీ) సోమవారం తెలిపింది. ఇక భారత్‌లోని బిజినెస్ స్కూల్స్‌లో తమ సంస్థ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొంది.

# ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే చర్యలు

- ఈయూ ఎంపీలతో ప్రధాని మోదీ
- ఈయూ ఎంపీల కశ్మీరు సందర్శన

న్యూఢిల్లీ అక్టోబరు 28: ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారిపై వెంటనే చర్య తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐరోపా సమాఖ్య(ఈయూ) ఎంపీల ప్రతినిధి బృందంతో ప్రధాని మోదీ అన్నారు. 28 మంది సభ్యుల బృందం జమ్మూకశ్మీరు సందర్శనకు వెళ్లే ముందు సోమవారం ప్రధానిని కలిసింది. ఉగ్రవాదంపై పోరుకు అంతర్జాతీయ సహకారం అవసరమని వారితో మోదీ అన్నారు. ఈ పర్యటనతో జమ్మూకశ్మీరు, లద్దాఖ్ ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతపై వారికి స్పష్టమైన అభిప్రాయం ఏర్పడుతుందన్నారు. కశ్మీరులో పర్యటించేందుకు ఈయూ బృందాన్ని అనుమతించిన ప్రభుత్వం మన దేశ నాయకులను ఎందుకు అడ్డుకుంటోందని కాంగ్రెస్, సీపీఎం ప్రశ్నించాయి. ఇది భారత పార్లమెంటుకు, ప్రజాస్వామ్యానికి అవమానమని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయం అనైతికమని బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి సైతం అన్నారు. కాగా, ప్రధాని విమానం తమ గగనతలం మీదుగా ప్రయాణించడానికి పాకిస్థాన్ మళ్లీ అనుమతి నిరాకరించింది.



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి ఇంటికెళ్లిన ప్రధాని మోదీ

### మోదీ నోట అయోధ్య మాట..!

అయోధ్య వివాదంపై మరో మూడు వారాల్లోగా తీర్పు వెలువడనున్న దశలో ప్రధాని మోదీ ఈ అంశాన్ని పరోక్షంగా లేవనెత్తారు. సంయమనానికి పిలుపునిచ్చారు. "2010లో అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చిన సమయాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. పరిస్థితిని తమకు అనుకూలంగా మల్చుకోడానికి కొన్ని శక్తులు కాచుక్కూచున్నాయి. తీర్పు రాగానే విరుచుకుపడదామని ఎదురుచూశాయి. ఆహ్లాదకరమైన ఆ తీర్పు దేశంలో వాతావరణాన్నే మార్చేసింది" అని ఆయన మన్ కీ బాత్ కార్యక్రమంలో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. తీర్పు ఎలా ఉన్నా రాజకీయ పక్షాలు, సామాజిక సంస్థలు, పౌర హక్కుల సంఘాలు, అన్ని వర్గాల ప్రతినిధులు, సాధువులు.. అందరూ సంయమనంతో ఉండాలని, ఉద్రిక్తతలకు తావిచ్చే రీతిలో ప్రవర్తించొద్దని సలహా ఇచ్చారు.



## రాజకీయాల్లో కాదెవరూ పు'నీతులు'

- ప్రత్యామ్నాయాలు చూసుకొనే స్థితి తేవొద్దు
- శివసేన వ్యాఖ్య.. రేపు ముంబైకి షా..?

ముంబై, అక్టోబరు 28: మహారాష్ట్రలో శివసేన-బీజేపీ మధ్య కీచులాట తీవ్రమవుతోంది. ఎన్నికలకు ముందు ఒప్పందం ప్రకారం అధికారం చెరి సగం పంచుకోవాల్సిందేనని శివసేన సోమవారం కూడా స్పష్టం చేసింది. "మేం ప్రత్యామ్నాయాలు అన్వేషించుకునేట్లుగా బీజేపీ పురికొల్పరాదు" అని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ హెచ్చరించారు. "రాజకీయాల్లో ఎవరూ సాధుసంతులు కాదు. పునీతులు కాదు. అవసరమైతే కాంగ్రెస్, ఎన్సీపీల మద్దతు తీసుకొనేందుకు వెనుకాడం. అయితే మేం కొన్ని విలువలకు కట్టుబడ్డాం. ఎన్నికల ముందు కుదిరిన పొత్తును గౌరవిస్తున్నాం. అందుకే ఇంకా నిర్ణయం తీసుకోలేదు" అని రౌత్ పేర్కొన్నారు. బీజేపీ మాత్రం 50-50 ఫార్ములాకు ససేమిరా అంటోంది. సీఎం పదవి రొటేషన్‌గా పంచుకోవడం సమ్మతం కానే కాదని తేల్చిచెబుతోంది. సీఎం దేవేంద్ర ఫడణవీస్, శివసేన సీనియర్ నేత దివాకర్ రౌత్ సోమవారం గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీని విడివిగా కలిశారు. బీజేపీ బుధవారం శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటుంది. దానికి పార్టీ అధ్యక్షుడు అమిత్ షా వస్తారు. శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేను షా కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది.

## హరియాణాలో సంకీర్ణం

### సీఎంగా ఖట్టర్, డిప్యూటీగా దుష్యంత్



దుష్యంత్ చౌతాలా

చండీగఢ్, అక్టోబరు 28: హరియాణాలో బీజేపీ-జేజేపీ సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరింది. సీఎంగా మనోహర్‌లాల్ ఖట్టర్; డిప్యూటీ సీఎంగా జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలా ప్రమాణ స్వీకారం చేశారు. దీపావళి సందర్భంగా రాజ్‌భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీరిద్దరి చేత గవర్నర్ సత్యదేవ్ నారాయణ ఆర్య ప్రమాణ స్వీకారం చేయించారు. సుస్థిర ప్రభుత్వాన్ని అందిస్తామని, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రమాణం చేసిన తర్వాత ఖట్టర్, దుష్యంత్ తెలిపారు. తీహార్ జైలు నుంచి పెరోల్‌పై బయటికొచ్చిన దుష్యంత్ తండ్రి అజయ్ చౌతాలా, ఆయన కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రన్నరప్ సాత్విక్ జోడీ

● ఫైనల్లో ఓడిన భారత ద్వయం
● ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్

**పారిస్:** ఇటీవల అంతర్జాతీయ వేదికపై అద్భుతంగా రాణిస్తున్న భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచారు. టోర్నీ ఆరంభం నుంచే దూకుడుగా చెలరేగి డబుల్స్ ఫైనల్ చేరిన సాత్విక్-చిరాగ్ జోడీ టైటిల్ పోరులో ప్రత్యర్థికి తలవంచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి జరిగిన తుదిపోరులో తెలుగు కుర్రాడు సాత్విక్-చిరాగ్ ద్వయం 18-21, 16-21తో ఇండోనేసియాకు చెందిన ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంకర్ జంట మార్కస్ ఫెర్నాల్డి గిడన్-కెవిన్ సంజయ సుకముల్జో చేతిలో ఓటమిపాలైంది. టాప్‌ర్యాంక్‌లో కొనసాగుతున్న మార్కస్-కెవిన్ జోడీ చేతిలో ఓడడం సాత్విక్ ద్వయానికిది వరుసగా ఏడోసారి. ఇప్పటిదాకా ఒక్కసారి కూడా ఆ జోడీపై భారత జంట గెలవలేకపోయింది. టైటిల్ నెగ్గకపోయినా టోర్నీలో సాత్విక్ జోడీ పోరాడిన తీరు ఆకట్టుకుంది. వరల్డ్ టూర్ 750 టోర్నీలో పురుషుల డబుల్స్ ఫైనల్ చేరిన తొలి భారత జోడీగా సాత్విక్-చిరాగ్ రికార్డు సృష్టించారు. డబుల్స్‌లో ప్రపంచ 11వ ర్యాంక్‌లోనున్న ఈ జంట ఈ ఏడాది ఆగస్టులో థాయ్‌లాండ్ ఓపెన్‌తో కెరీర్‌లో తొలి సూపర్ 500 టైటిల్‌ను సాధించింది. ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ చెన్ లోంగ్ (చైనా) నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో చెన్ లోంగ్ 21-19, 21-12తో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్ తుది పోరులో కొరియా యువ కెరటం అన్ సె యంగ్ 16-21, 21-18, 21-5తో ఒలింపిక్ చాంప్ కరోలినా మారిన్‌కు షాకిచ్చి విజేతగా నిలిచింది.


జహీర్-సాగరిక


రైనా కుటుంబం


కోహ్లీ-అనుష్క

## విరుష్క.. సెలబ్రేషన్స్ అదుర్స్!

**ముంబై:** టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, అతని భార్య అనుష్క శర్మ దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అభిమానులకు ట్విటర్‌లో పండుగ శుభాకాంక్షలు తెలిపిన విరుష్క.. సంప్రదాయ దుస్తులు ధరించి ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలను పోస్ట్ చేశారు. తెల్లటి డ్రెస్‌లో విరాట్.. అందమైన లెహెంగాలో అనుష్క మెరిసిపోయారు. ఇప్పుడీ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక.. టీమిండియా ఆటగాళ్లు సురేశ్ రైనా, బుమ్రా, విహారి, మాజీ ఆటగాడు జహీర్ ఖాన్‌తో పాటు విదేశీ క్రికెటర్లు స్టీవ్ స్మిత్, డుప్లెసి, ఇమ్రాన్ తాహిర్, మైకేల్ క్లార్క్, బ్రెట్ లీ అభిమానులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈడెన్‌లో డే/నైట్ టెస్టు!

బంగ్లా క్రికెట్ బోర్డుకు బీసీసీఐ లేఖ

**న్యూఢిల్లీ:** డే అండ్ నైట్ టెస్టు ఆడేందుకు ఇప్పటిదాకా సుముఖత చూపని భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) తన పంథాను మార్చుకుంది. సౌరవ్ గంగూలీ కొత్త బాస్‌గా వచ్చాక ఈ దిశగా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే పింక్ బాల్ టెస్టుపై దాదా ఆసక్తి చూపడంతో పాటు కెప్టెన్ కోహ్లీ కూడా సానుకూలత వ్యక్తం చేస్తున్నట్టు తెలిపాడు. ఈ నేపథ్యంలో అంతా సవ్యంగా జరిగితే ఈడెన్ గార్డెన్స్‌లో భారత జట్టు తొలిసారిగా డే/నైట్ టెస్టు ఆడే అవకాశముంది. బంగ్లాదేశ్‌తో వచ్చే



నెల 22 నుంచి సిరీస్‌లో చివరిదైన రెండో టెస్టు ఇక్కడ జరుగుతుంది. మరోవైపు ఈ విషయమై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు బీసీసీఐ ఇప్పటికే లేఖ రాసింది. అయితే బీసీబీ నుంచి ఇంకా అధికారిక సమాచారం రావాల్సి ఉంది. 'డే/నైట్ టెస్టుకు సంబంధించి బీసీసీఐ విజ్ఞప్తిపై చర్చించాం. ఆటగాళ్లు, టీమ్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడాకే ఈ టెస్టుపై నిర్ణయం తీసుకుంటాం. ఎందుకంటే పింక్ బాల్‌తో సన్నద్ధమయ్యేందుకు వారికి తగిన సమయం ఉందా? లేదా అనే విషయం ముందు తేలాలి' అని బీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిజాముద్దీన్ చౌధురి తెలిపారు.

**ప్రయోగాత్మకంగా దులీప్ ట్రోఫీలో:** భారత్‌లో 2016 నుంచి మూడు సీజన్లు దులీప్ ట్రోఫీని ప్రయోగాత్మకంగా డే/నైట్‌లోనే నిర్వహించారు. కానీ ఈ ఏడాది ఫైనల్‌ను మాత్రమే ఈ తరహాలో ఆడించి మిగతా మ్యాచ్‌లను రెడ్ బాల్‌తోనే కానిచ్చారు. సమీప భవిష్యత్‌లో భారత టెస్టు జట్టు రాత్రివేళ ఆడే చాన్స్ లేదని, అలాంటప్పుడు ఈ తరహా మ్యాచ్‌లను ఆడించి ఏం ప్రయోజనమని ఇటీవల బోర్డు సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ప్రస్తుత టెస్టు సభ్యులైన మయాంక్ అగర్వాల్, జడేజా, పుజారా, రోహిత్, విహారి, కుల్దీప్, బుమ్రాకు పింక్‌బాల్ మ్యాచ్ ఆడిన అనుభవముంది. అయితే ఆటగాళ్ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌లో మాత్రం మిశ్రమ స్పందన లభించింది. దులీప్ ట్రోఫీకి ముందే 2016, జూన్‌లో ఈడెన్‌లో తొలిసారి క్యాబ్ సూపర్ లీగ్ ఫైనల్‌ను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆడించారు. నాలుగు రోజుల ఈ మ్యాచ్‌లో పేసర్ షమి ఏడు వికెట్లతో రాణించాడు. మరోవైపు పొరుగు దేశంలో 2013లో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ అయిన బంగ్లాదేశ్ క్రికెట్ లీగ్ ఫైనల్ మాత్రమే ఈ తరహాలో జరిగింది.


బంగ్లాదేశ్ ఆటగాళ్లు

# అంతా సవ్యంగా సాగేనా?

కీలక భారత పర్యటనకు ముందు బంగ్లాదేశ్ క్రికెట్‌లో నెలకొన్న సంక్షోభం తరచూ వార్తల్లో నిలుస్తోంది. అదను చూసి దెబ్బ కొట్టాలన్నట్టుగా షకీబల్ ఆధ్వర్యంలో ఆటగాళ్లంతా పలు డిమాండ్లపై సమ్మెకు దిగడం.. గతిలేని పరిస్థితిలో ఆమోదిస్తున్నట్టుగా బంగ్లా క్రికెట్ బోర్డు కూడా మెట్టు దిగాల్సి వచ్చింది. అయితే ఆటగాళ్ల సమ్మె వెనక కుట్ర దాగుందని, అసలు సినిమా ముమ్ముందు కనిపిస్తుందని స్వయానా బీసీబీ అధ్యక్షుడే చెబుతుండడం ఇక్కడ మరింత ఆసక్తికరంగా మారింది. దీంతో మరో రెండు రోజుల్లో ఆ జట్టు భారత్‌లో పర్యటన సస్పెన్స్‌గా మారింది.

● భారత్‌లో బంగ్లా టూర్‌పై అనిశ్చితి
● పలువురు ఆటగాళ్ల అనాసక్తి
● ఇప్పటికే తమీమ్ దూరం
● అదే దారిలో షకీబల్!


షకీబల్

**ఢాకా:** పలు డిమాండ్లతో హఠాత్తుగా సమ్మెకు దిగిన ఆటగాళ్లతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) సంధి కుదుర్చుకుని దాదాపు వారం రోజులైనా పరిస్థితి అంత సజావుగా ఏమీ లేదు. అసలు బంగ్లా జట్టు భారత్‌లో పర్యటించకుండా వెన్నుపోటు ప్రయత్నాలు జరుగుతున్నాయని బీసీబీ అధ్యక్షుడు నజ్ముల్ హసన్ ప్రకటించడం సంచలనం రేపింది. అందులో భాగంగానే ఊహించని విధంగా ఆటగాళ్ల సమ్మె తెరపైకి వచ్చిందని ఆయన వాదిస్తున్నారు. అలాగే కొంతమంది ఆటగాళ్లు కూడా టూర్ నుంచి తప్పుకోవచ్చని చూచాయగా చెప్పారు. అంతర్జాతీయ, ఫస్ట్‌క్లాస్ స్థాయి ఆటగాళ్ల వేతనాల పెంపు వంటి 11 డిమాండ్లతో కెప్టెన్ షకీబల్ హసన్ నేతృత్వంలో కీలక ఆటగాళ్లు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ డిమాండ్లకు బీసీబీ అంగీకారం తెలపడంతో ఇక బంగ్లా జట్టు భారత్‌లో పర్యటించేందుకు ఎలాంటి అడ్డంకీ లేదని అంతా భావించారు. నాలుగు వారాల పాటు సాగే ఈ పర్యటనలో భారత్‌తో మూడు టీ20లు, రెండు టెస్టులు ఆడాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారమైతే బంగ్లా జట్టు బుధవారం న్యూఢిల్లీలో అడుగుపెట్టాల్సి ఉంటుంది. 'భారత పర్యటన గురించి మీడియాకు ఇంకా ఏమీ తెలీదు. కొద్ది సమయం వేచి ఉండండి. ఈ టూర్‌ను అస్థిరపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నా దగ్గర సమాచారం ఉంది. ఇదే విషయాన్ని మీరు కూడా నమ్ముతారు. ఎందుకంటే తమీమ్ ఇక్బాల్ ఇప్పటికే టూర్‌కు దూరమయ్యాడు. అయితే భార్య డెలివరీ కారణంగా అతడు మొదట్లో కేవలం చివరి టెస్టు మాత్రమే ఆడనని నాతో చెప్పాడు. కానీ ఆటగాళ్లతో సమావేశమయ్యాక మొత్తం టూర్‌కే వెళ్లనని మాట మార్చాడు. ఇదేకాదు చివరి నిమిషాల్లో మరికొంతమంది కూడా తప్పుకొన్నా నేనేమీ ఆశ్చర్యపోను. అసలు వారి డిమాండ్లను అంగీకరించడమే నేను చేసిన తప్పు' అని నజ్ముల్ అన్నారు.

### షకీబల్ కూడా దూరమేనా?

బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబల్ హసన్ కూడా భారత పర్యటనకు డుమ్మా కొట్టే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. సమ్మెకు నేతృత్వం వహించిన అతడు ఇప్పటికే బ్రాండ్ అంబాసిడర్ విషయంలో బీసీబీ రూల్స్‌ను అతిక్రమించినందుకు మందలింపునకు గురయ్యాడు. తాజాగా జట్టు మూడు రోజులపాటు చేసిన ప్రాక్టీస్‌లో ఒక్కసారే హాజరయ్యాడు. 'మా ఆటగాళ్లు భారత్‌కు వెళ్లరనే అనిపిస్తోంది. ముఖ్యంగా షకీబల్‌పై నాకు అనుమానంగా ఉంది. మేమేమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు వారు మాకు సమాచారం ఇస్తారేమో. షకీబల్‌తో సమావేశం కాదలుచుకున్నా. అతడేం చెబుతాడో వినాలి. ఒకవేళ ఈనెల 30నే మేం వెళ్లబోమని చెబితే నేనేం చేయాలి? అసలు కెప్టెన్‌ను ఎక్కడి నుంచి తేవాలి? మొత్తం కాంబినేషన్‌నే మార్చుకోవాల్సి ఉంటుంది' అని నజ్ముల్ ఆవేదన వెలిబుచ్చారు. తమీమ్‌తో పాటు వెన్నునొప్పి కారణంగా మహ్మద్ సైఫుద్దీన్ కూడా ఈ టూర్‌కు దూరమయ్యాడు.

# దాదా సీఎం అవుతాడు!



**న్యూఢిల్లీ:** సౌరవ్ గంగూలీకి రెండు కీలకమైన పదవులు లభిస్తాయని తాను ఊహించానని, అందులో ఒకటి నిజమైందని..రెండోది కూడా దక్కుతుందన్న నమ్మకముందని మాజీ ఓపెనర్ సెహ్వాగ్ చెప్పాడు. సౌరవ్ బీసీసీఐ అధ్యక్షుడు అవుతాడని తనతోపాటు మరికొందరు టీమిండియా సభ్యులు 2007లోనే ఊహించామని వెల్లడించాడు. అది ప్రస్తుతం నిజమైందన్నాడు. ఇక తాను ఊహిస్తున్న రెండో పదవి గంగూలీ..పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావడమన్నాడు. ఈ సందర్భంగా 2007లో సౌతాఫ్రికా పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న సంభాషణను వీరూ గుర్తుచేసుకున్నాడు. 'అది కేప్‌టౌన్‌లో జరిగిన మూడో టెస్ట్. నేను, వసీం జాఫర్ త్వరగా అవుటయ్యాం. నాలుగో నెంబర్‌లో సచిన్ బదులు సౌరవ్ బరిలోకి దిగాడు. అది అతడికి పునరాగమన సిరీస్. సహజంగా ఎంతో ఒత్తిడి ఉంటుంది. కానీ ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన బ్యాటింగ్ చేయడం ద్వారా అది తనకే సాధ్యమవుతుందని గంగూలీ నిరూపించాడు. ఆరోజు డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చ జరిగింది. మాలో ఎవరికైనా బీసీసీఐ చీఫ్ కాగల సత్తా ఉందంటే అది దాదాకేనని మేమంతా ముక్తకంఠంతో అంగీకరించాం. అంతేకాదు..అతడు పశ్చిమబెంగాల్ సీఎం అవుతాడని కూడా నేను చెప్పా. నా భవిష్యవాణిలో ఒకటి నిజమైంది. మరొకటి బాకీ ఉంది' అని 41 ఏళ్ల సెహ్వాగ్ ట్వీట్ చేశాడు.

## హామిల్టన్‌దే మెక్సికన్ గ్రాండ్ ప్రీ



**మెక్సికోసిటీ:** లూయిస్ హామిల్టన్ మెక్సికన్ ఫార్ములావన్ గ్రాండ్ ప్రీ విజేతగా నిలిచాడు. ఈ మెర్సిడెస్ డ్రైవర్ ఫైనల్ రేసును ప్రథమస్థానంలో ముగించి ఈ సీజన్‌లో తన జట్టుకు పదో విజయాన్ని అందించాడు. వెటెల్‌కు రెండు, వల్టారి బొటాస్‌కు మూడో స్థానం దక్కాయి.





బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ ముంబైలో ఏర్పాటు చేసిన దీపావళి విందుకు హాజరైన సానియా మీర్జా, పరిణీతి చోప్రా, హర్భజన్ సింగ్ దంపతులు

## గోవా-బెంగళూరు మ్యాచ్ డ్రా



**మార్గోవా:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో బలమైన జట్లు గోవా, బెంగళూరు ఎఫ్‌సీ మధ్య సోమవారం జరిగిన మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. 62వ నిమిషంలో బెంగళూరు ఆటగాడు ఉదాంత గోల్ చేసి బ్రేక్ ఇచ్చాడు. పాస్‌ను అందుకున్న ఉదాంత.. ప్రత్యర్థి ఆటగాళ్లను నేర్పుగా తప్పించుకుంటూ నేరుగా గోల్ చేశాడు. అయితే, ఇంజ్యూరీ టైమ్‌లో గోవా ప్లేయర్ ఫెర్రన్‌ను అభ్యంతరకరంగా అడ్డుకోవడంతో రిఫెరీ పెనాల్టీ ఇచ్చాడు. కోరో దీన్ని గోల్‌గా మలచి 1-1తో సమం చేశాడు.

# ఫెడరర్.. దస్ కా దమ్

పదోసారి 'బాసెల్' విజేత



**బాసెల్ (స్విట్జర్లాండ్):** లేటు వయసులోనూ కుర్రాళ్లకు దీటుగా ఆడుతున్న టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ సొంతగడ్డపై అదరగొట్టాడు. ఈ స్విస్ మాస్టర్ బాసెల్ ఓపెన్‌లో పదోసారి చాంపియన్‌గా నిలిచి ఇక్కడ తనకు తిరుగులేదని చాటుకున్నాడు. ఆదివారం రాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఫెడరర్ 6-2, 6-2తో ఆస్ట్రేలియాకు చెందిన యువ ఆటగాడు అలెక్స్ డి మినార్‌ను వరుస సెట్లలో చిత్తుచేసి పదోసారి ట్రోఫీని ముద్దాడాడు. అంతకుముందు హాలె టైటిల్‌ను కూడా పదిసార్లు నెగ్గాడు. 38 ఏళ్ల ఫెడరర్‌కిది కెరీర్‌లో 103వ ట్రోఫీ కావడం విశేషం. దీంతో అమెరికా దిగ్గజం జిమ్మీ కానర్స్ అత్యధిక ట్రోఫీ (109)ల రికార్డుకు రోజర్ కేవలం ఆరు టైటిళ్ల దూరంలో నిలిచాడు.


వార్నర్

# వార్నర్ తొలిసారి..

● టీ20ల్లో సెంచరీ ● లంకపై ఆసీస్ గెలుపు

**అడిలైడ్:** యాషెస్ సిరీస్‌లో విఫలమై విమర్శలపాలైన డేవిడ్ వార్నర్ జూలు విదిల్చాడు. శ్రీలంకతో జరిగిన తొలి టీ20లో (56 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సులతో 100 నాటౌట్) సెంచరీతో కదం తొక్కి తన 33వ పుట్టినరోజును చిరస్మరణీయం చేసుకున్నాడు. దాంతో మూడు టీ20ల్లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 134 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో వార్నర్‌కిదే తొలి శతకం. వార్నర్‌కు తోడు మరో ఓపెనర్ ఫించ్ (64), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (62) సత్తా చాటడడంతో ఆసీస్ 233/2 స్కోరు చేసింది. భారీ ఛేదనలో శ్రీలంక ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లకు 99 పరుగులే చేసింది. దాసున్ షనక (17) టాప్ స్కోరర్. ఆడమ్ జంపా 3, కమిన్స్ 2 వికెట్లు సాధించారు.

**రికార్డులే రికార్డులు..:** ఆసీస్ జట్టుకు స్వదేశంలో టీ20ల్లో ఇదే అత్యధిక స్కోరు. అంతకుముందు 221 స్కోరును 2007లో ఇంగ్లండ్‌పై సిడ్నీలో చేసింది. ఇక టీ20ల్లో శ్రీలంకకిదే అతి పెద్ద పరాజయం. శ్రీలంక పేసర్ కసున్ రజిత (0/75) పొట్టి క్రికెట్‌లో అత్యంత చెత్త ప్రదర్శన చేసిన బౌలర్‌గా రికార్డుకెక్కాడు.

● **టీ20 వరల్డ్‌కప్ బరిలో పపువా న్యూ గినియా**

**దుబాయ్:** వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌నకు పపువా న్యూగినియా (పీఎన్‌జీ) అర్హత సాధించింది. టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ గ్రూప్-ఎలో కెన్యాపై పీఎన్‌జీ 45 పరుగులతో నెగ్గింది. ఈ మ్యాచ్‌లో గెలవడంతోపాటు నెదర్లాండ్స్ మ్యాచ్‌పై కూడా ఫలితం ఆధారపడింది. ఆదివారం కెన్యాతో మ్యాచ్‌లో పీఎన్‌జీ ఒకదశలో 19/6తో పీకల్లోతు కష్టాల్లో పడ్డప్పుడు నార్మన్ వనువా (54) ధనాధన్ బ్యాటింగ్‌తో 19.3 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌటైంది. అయితే, కెన్యా 18.4 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్ స్కోరు 130/8ని నెదర్లాండ్స్ 17 ఓవర్లలో 131/6తో ఛేదించింది. కానీ, 12.3 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుని ఉంటే నెట్ రన్‌రేట్ ఆధారంగా నెదర్లాండ్స్ అర్హత సాధించి ఉండేది.

● **పాకిస్థాన్ హాకీ జట్టుకు షాక్**

**ఆమ్‌స్టర్‌డ్యామ్:** మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ పాకిస్థాన్ హాకీ జట్టుకు షాక్ తగిలింది. ఈ జట్టు విశ్వక్రీడలకు అర్హత సాధించడంలో విఫలమైంది. ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో పాక్ 1-6 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ చేతిలో కంగుతింది. దీంతో వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌కు పాక్ బెర్త్ దక్కించుకోలేకపోయింది. 1960, 68, 84లో ఒలింపిక్ స్వర్ణాలు నెగ్గిన పాక్.. చివరిసారిగా 1992లో కాంస్య పతకం గెలిచింది. ఆ తర్వాత నుంచి విశ్వక్రీడల్లో పతకం సాధించడంలో పాక్ విఫలమవుతూనే ఉంది.

## క్రికెట్ దేశాలకు టీమిండియా ఆదర్శం



**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో అత్యున్నత శిఖరాలు అందుకొనేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలు అద్భుతమని ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాట్స్‌మన్ ఇయాన్ చాపెల్ కొనియాడాడు. క్రికెట్‌లో తమదైన ముద్ర వేయాలని తపించే దేశాలు భారత్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించాడు. తద్వారా టెస్ట్ క్రికెట్ మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డాడు. ఇటీవలి టెస్ట్ సిరీస్‌లో సౌతాఫ్రికాను 3-0తో వైట్‌వాష్ చేసిన టీమిండియాను చూసి మిగతా క్రికెట్ దేశాలు అసూయ చెందుతుంటాయన్నాడు. 'భవిష్యత్‌లో టెస్ట్ క్రికెట్ బతికి బట్టకట్టాలంటే ఆటలో ప్రమాణాలు పెరగాలి. భారత్‌లో క్రికెట్ ప్రమాణాలు అమోఘంగా ఉన్నాయంటే అందుకు..ప్రతిభావంతులకు కొదవలేకపోవడం, అపార ఆర్థిక వనరులతోపాటు ఐపీఎల్ కారణం. అంతేకాదు అత్యున్నత శిఖరాలు చేరేందుకు భారత్ అనుసరిస్తున్న విధానాలను క్రికెట్‌లో బలమైన జట్టుగా మారాలని భావించే దేశాలు అనుసరించాలి' అని చాపెల్ ఓ ప్రముఖ క్రీడా వెబ్‌సైట్‌కు రాసిన కాలమ్‌లో సూచించాడు.

గోదావరి జలాలను..

# బానకచర్లకు ఎత్తిపోద్దాం!

- గోదావరి-కృష్ణా నదుల మహా సంగమం!
- కుడికాలువ గుండా కృష్ణా నదిలోకి.. అక్కడి నుంచి సాగర్‌కు
- బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీల రిజర్వాయర్
- దాని నుంచి నల్లమల మీదుగా బానకచర్లకు
- ముఖ్యమంత్రి వద్ద ప్రాథమిక సమీక్ష
- ఈ పథకంపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కృష్ణా నదుల మహా సంగమ పథకానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గోదావరి జలాలను కృష్ణా నదీ జలాలతో కలిపే ఆలోచనను తెలంగాణ ప్రభుత్వంతో పంచుకునేందుకు సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం.. సొంతంగా ఇప్పుడు భగీరథ ప్రయత్నానికి పూనుకుంటోంది. సముద్రంలోకి పోతున్న వందలాది టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. పోలవరం కుడి కాలువ నుంచి గోదావరి జలాలను రోజుకు 23,000 క్యూసెక్కుల (2 టీఎంసీలు) చొప్పున 210 టీఎంసీలను బానకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు తరలించే దిశగా సమాయత్తమవుతోంది. ప్రాథమిక అంచనా ప్రకారం ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు విలువ రూ.60 వేల కోట్లకు పైబడి ఉంటుంది. ప్రభుత్వ ఆలోచనల గురించి ఈ నెల 21వ తేదీన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. గోదావరి నుంచి బానకచర్లకు జలాల తరలింపుపై జగన్ ప్రత్యేక దృష్టి సారించారని.. దీనిపై సోమవారం సమీక్షించనున్నారని ఈ నెల 27న తెలియజేసింది. సోమవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం జల వనరుల శాఖపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో గోదావరి నుంచి బానకచర్ల రెగ్యులేటర్‌కు జలాలను తరలించడంపై సుదీర్ఘంగా చర్చ సాగింది. దీనిపై జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వాప్కోస్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేసి త్వరలోనే అందించనుందని వెల్లడించారు.

### కేసీ కెనాల్, తెలుగుగంగకూ గోదావరి..

ఈ పథకం పూర్తయితే.. నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టులోని 9.61 లక్షల ఎకరాలను స్థిరీకరించడంతో సహా..సాగర్ రెండో దశలో భాగంగా ప్రకాశం జిల్లాలోని దర్శి, కనిగిరి నియోజకవర్గాల్లో మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలు కలుగుతుంది. అదేవిధంగా గుంటూరు, ప్రకాశం జిల్లాలో తాగు నీటి అవసరాలనూ తీర్చవచ్చు. మరోవైపు పులిచింతల, నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై ఆధారపడ్డ ప్రాంతాలకు బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయరును నిర్మించడం ద్వారా గోదావరి జలాలను నిల్వ చేసుకునే వెసులుబాటూ కలుగుతుంది. గత 15 ఏళ్లుగా గోదావరిలో నీటి ప్రవాహాన్ని ప్రమాణికంగా తీసుకుని 105 రోజుల్లో రోజుకు 1200 క్యూమెక్స్ (3.7 టీఎంసీ) ప్రవాహం ఉంటుందని వాప్కోస్ అంచనా వేసింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వెలిగొండ సహా కేసీ కెనాల్, తెలుగు గంగ ప్రాజెక్టు, ఎస్ఆర్‌బీసీ తదితర ప్రాజెక్టుల అవసరాల కోసం బానకచర్ల బ్యాలెన్సింగ్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీరందించేందుకు అవకాశముంటుంది.

### ఎత్తిపోత ఇలా..

ప్రాథమిక ఆలోచన ప్రకారం.. పోలవరం కుడి కాలువ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి.. అక్కడి నుంచి సాగర్ కుడికాలువకు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లి ప్రతిపాదిత బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు ఎత్తిపోస్తారు. బొల్లాపల్లి నుంచి వెలిగొండ రిజర్వాయరుకు నీటిని అందిస్తూ.. మరోవైపు నల్లమల అడవుల్లో టన్నెల్ తవ్వి.. దాని ద్వారా బానకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు తరలిస్తారు. ఈ మొత్తం ప్రక్రియలో 460 కిలోమీటర్ల మేర నీటిని గ్రావిటీ ద్వారా, కొన్న చోట్ల ఎత్తిపోతల ద్వారా పంపుతారు. వివిధ దశల్లో 230మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోస్తారు. ఈ పథకానికి 2100 మెగావాట్ల విద్యుత్ అవసరం. రూ.60 వేల కోట్లకు పైనే ఖర్చవుతుందని అంచనా. కరువు సీమ రాయలసీమకు సాగు, తాగు నీటిని తరలించేలా డీపీఆర్ సిద్ధం చేయాలని జగన్ సమీక్ష సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

---

# డిస్కౌంట్ల దందా బంద్!



● దివాలీ ధమాకా

దసరా సేల్స్... దీపావళి ధమాకా... న్యూ ఇయర్ షాపింగ్ ఫీవర్! పేరు ఏదైతేనేం... 'పండగ' వచ్చిందంటే చాలు ఆన్‌లైన్ షాపింగ్‌లో 'డిస్కౌంట్లు, ఆఫర్ల వరద'! కేంద్ర ప్రభుత్వం ఈ 'దందా'పై కన్నేసింది. నిబంధనలు కఠినతరం చేసింది. వాటిని పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. నిజంగానే ఈ నిబంధనలను అనుసరించడం అంటే... 'ఆఫర్ల'కు తెర దించడమే.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌పై రిటైలర్ల ఫిర్యాదు.. ఈ-ఆఫర్లపై కేంద్రం దృష్టి

- వివరాలు సేకరిస్తున్న కేంద్ర సర్కారు
- ఫిబ్రవరిలోనే కఠినమైన నిబంధనలు
- భారీ డిస్కౌంట్లు ఇవ్వడం కుదరదు
- వస్తువు ధరను ప్రభావితం చేయొద్దు
- సొంతంగా కొని అమ్మడంపై నిషేధం
- 'మధ్యవర్తి'గా మాత్రమే ఉండాలి

న్యూఢిల్లీ, అక్టోబరు 28: దసరా, దీపావళి కలిసి వచ్చిన ఈ అక్టోబరులో రెండు ఈ-కామర్స్ సంస్థల ద్వారా జరిగిన వ్యాపారం దాదాపు వందకోట్ల డాలర్లు! మన లెక్కల్లో చెప్పాలంటే... 7 వేల కోట్ల రూపాయలు! మొత్తం ఏడాది వ్యాపారంలో సగం... ఈ పండగ సీజన్‌లోనే జరుగుతుంది. అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) వరుస ఫిర్యాదుల నేపథ్యంలో ఈ-వ్యాపారంపై మోదీ సర్కారు దృష్టి సారించింది. మార్కెట్‌లో మరొకరికి అవకాశం లేకుండా, పోటీకి రాకుండా చేస్తున్న 'డిస్కౌంట్ దందా'కు కళ్లెం వేయాలని భావిస్తోంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల వ్యాపార పద్ధతి చట్ట విరుద్ధమని... వాటిపై చర్యలు తీసుకుంటామని గత వారం కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. డిస్కౌంట్ దందాపై దర్యాప్తు కూడా జరుపుతామని ప్రకటించారు. అదే జరిగితే... ఇకముందు, దసరా సేల్స్, దీపావళి ధమాకాలు, న్యూ ఇయర్ ఫీవర్లు ఉండకపోవచ్చు.

### ఆరా తీస్తున్నారు...

అసలు ఏమిటీ ఆఫర్లు? ఎవరు ఇస్తున్నారు? ఎలా ఇస్తున్నారు? అనే అంశాలపై కేంద్రం ఆరా తీస్తోంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలకు కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) ఒక ప్రశ్నావళి పంపి... సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది. మరీ ముఖ్యంగా తమ ప్లాట్‌ఫామ్స్ ద్వారా విక్రయాలు జరుపుతున్న ఐదు అతిపెద్ద విక్రేతల వివరాలు ఇవ్వాలని కోరింది. వీటి పై అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఇంకా స్పందించలేదు. ఈ-కామర్స్ సంస్థల ప్రతినిధులతోపాటు సీఏఐటీ సభ్యులతో కేంద్ర అధికారులు ఇప్పటికే పలు విడతలు చర్చించారు.

### 'ధర'ను ప్రభావితం చేయొద్దు

ఈ-కామర్స్ సంస్థలు ఉత్పత్తిదారుల నుంచి భారీ స్థాయిలో వస్తువులు కొనుగోలు చేసి, తక్కువ ధరకు విక్రయించేవి. ఉదాహరణకు... ఒక సెల్‌ఫోన్ మోడల్ ఫోన్లన్నీ తన ద్వారా మాత్రమే విక్రయించడంలాంటిది. డెలివరీ చార్జీల మినహాయింపు, క్యాష్‌బ్యాక్‌ల వంటి ఆఫర్లు! దీనిపై రిటైల్ వ్యాపారులు గగ్గోలు పెట్టడంతో కేంద్రం ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. దీని ప్రకారం... ఈ-కామర్స్ సంస్థలు విక్రయదారులకు, కొనుగోలుదారులకు మధ్య సంధానకర్తగా మాత్రమే ఉండాలి. తమ ప్లాట్‌ఫామ్ ద్వారా విక్రయించే వస్తువుల ధరలను ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగాకానీ ప్రభావితం చేయకూడదు. దీనివల్ల మార్కెట్‌లోని ఇతర వ్యాపారులకూ తగిన అవకాశం కల్పించినట్లవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ-కామర్స్ డీల్స్‌పై కాంపిటీషన్ కమిషన్ కూడా గట్టి నిఘావేసింది. కాంపిటీషన్ చట్టం 2002లోని నాలుగవ సెక్షన్‌ప్రకారం భారీ డిస్కౌంట్లు ఇవ్వడం కుదరదు. "ఈ కామర్స్ సంస్థల డిస్కౌంట్ల వల్ల ఇతరులకు వ్యాపారం లాభదాయకం కాకుండా పోతోంది. దీనిపై ఆయా సంస్థలకు ఆదేశాలు జారీ చేస్తాం"అని సీసీఐ ఛైర్మన్ అశోక్‌కుమార్ ఇటీవల తెలిపారు. అయితే... కేంద్రం వైఖరితో భారత్‌లో 2022 నాటికి ఈ-కామర్స్ వ్యాపారం 4600కోట్ల డాలర్లు తగ్గే అవకాశముందని 'ప్రైస్‌వాటర్ కూప్స్' విశ్లేషించింది.




### అవి కంపెనీల డిస్కౌంట్లే!

ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారమే తాము నడుచుకుంటున్నామని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ చెబుతున్నాయి. భారీ డిస్కౌంట్ దందా (ప్రిడేటరీ ప్రైసింగ్)కు తెరలేపామన్న ఆరోపణలను ఖండించాయి. "ఈ డిస్కౌంట్లు, ఆఫర్లు మేం ఇస్తున్నవి కావు. నేరుగా ఉత్పత్తిదారులే (బ్రాండ్‌లు) డిస్కౌంట్లు ఇస్తున్నాయి" అని తెలిపాయి.

### అమెజాన్ కన్నా మైక్రోసాఫ్ట్ ముద్దు!

- మైక్రోసాఫ్ట్ క్లౌడ్‌నే నమ్ముకున్న పెంటగన్
- రూ.70 వేల కోట్ల కాంట్రాక్టు అప్పగింత

శాన్‌ఫ్రాన్సిస్కో, అక్టోబరు 26: ప్రపంచమంతా తమ సమాచారాన్ని అమెజాన్ క్లౌడ్‌లో దాచుకుంటుంటే అమెరికా రక్షణ శాఖ పెంటగన్ మాత్రం తన సమాచారాన్ని దాచుకోవడానికి మైక్రోసాఫ్ట్‌ను ఎంచుకొంది. రూ.70 వేల కోట్ల విలువైన ఈ భారీ కాంట్రాక్టు అమెజాన్‌కే వస్తుందని అందరూ భావించారు. ఒరకిల్, ఐబీఎంలు మధ్యలోనే విరమించుకున్నాయి. బిడ్డింగ్ విధానాన్ని న్యాయస్థానంలో ఒరకిల్ సవాలు చేసి, ఓడిపోయింది. చివరికి అనూహ్యంగా కాంట్రాక్టు మైక్రోసాఫ్ట్ చేతికి చిక్కింది. ఏడాది కాలంగా పెంటగన్‌కు మైక్రోసాఫ్ట్ మిత్ర సంస్థగా మారింది. ప్రభుత్వంతో వ్యాపారం చేయడాన్ని సిబ్బంది వ్యతిరేకిస్తున్నా మైక్రోసాఫ్ట్ సంబంధం కొనసాగిస్తోందని పెంటగన్ ప్రతినిధి కొనియాడారు.

---

పాలకమండలీ..

# ఇదేం పద్ధతి?

- విశ్వవిద్యాలయాల చట్టాలకు విరుద్ధంగా నిర్ణయాలు
- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):విశ్వవిద్యాలయాల పాలకమండళ్ల(ఈసీ) సమావేశాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. వర్సిటీల చట్టాలు, కోర్టు తీర్పులను ఉల్లంఘిస్తూ సమావేశాలు నిర్వహిస్తుండటం గందరగోళానికి దారితీసే పరిస్థితి కనిపిస్తోంది. కోరం లేకుండా ఒకసారి, కోరంతో మరోసారి సమావేశాలు నిర్వహించడం, నిర్ణయాలు తీసుకోవడాన్ని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. అసలు పాలకమండళ్లలోని క్లాస్-2 మెంబర్లను రద్దు చేసిన తర్వాత నిర్వహిస్తోన్న సమావేశాలు విశ్వవిద్యాలయ చట్టానికి విరుద్ధమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈసీ సమావేశాల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోలేదంటున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే విశ్వవిద్యాలయాల పాలకమండళ్లలోని క్లాస్-2 మెంబర్ల(9 మంది) నియామకాన్ని రద్దు చేసింది. త్వరితగతిన క్లాస్-2 మెంబర్లతో ఈసీలను పునర్వ్యవస్థీకరిస్తే సమావేశాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందీ ఉండేది కాదు. కానీ ఇప్పటికీ ఆ పని చేయకపోవడంతో సమావేశాల నిర్వహణలో ప్రతిష్ఠంభన ఏర్పడింది. విశ్వవిద్యాలయ చట్టంలోని సెక్షన్-33 ప్రకారం.. పాత క్లాస్-2 మెంబర్లకు ఉద్వాసన పలికినప్పటికీ కొత్తవాళ్లను నియమించే వరకూ పాతవాళ్లే కొనసాగుతారు. ఆ నిబంధనను తుంగలో తొక్కి, ఎటువంటి సహేతుకమైన కారణాలు లేకుండానే క్లాస్-2 మెంబర్లను సింగిల్ జీవోతో రద్దుచేశారు. నాలుగు నెలలైనప్పటికీ క్లాస్-2 మెంబర్లను నియమించలేదు. కాకతీయ విశ్వవిద్యాలయం కేసులో 2018లో హైకోర్టు సింగిల్, డివిజినల్ బెంచ్ ఇచ్చిన తీర్పు ప్రకారం.. పాలకమండలి మెంబర్లంటే క్లాస్-1, క్లాస్-2 మెంబర్లు అని, సమావేశాల్లో ఇద్దరూ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. కానీ కోరం ఉంది కదా అని ప్రభుత్వానికి చెందిన క్లాస్-1 మెంబర్లతో మాత్రమే పాలకమండళ్ల సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. కనీస కోరం లేకుండానే గతంలో ఒకసారి పాలకమండళ్ల భేటీలు నిర్వహించారు. దానిని కోర్టులో సవాల్ చేయడంతో.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌ను ఈసీలో ఎక్స్ అఫిషియో మెంబరుగా చేరుస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసింది. దీంతో కోరం ఉందికదా అని ఇటీవల ఆచార్య నాగార్జున వర్సిటీ పాలకమండలి సమావేశం నిర్వహించారు. వెంటనే రెగ్యులర్ వీసీ నియామకానికి సంబంధించి సెర్చ్ కమిటీని నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ఆగమేఘాల మీద ఉత్తర్వులు జారీచేసింది. కోరం చూసుకున్నారే తప్ప అసలు క్లాస్-2 మెంబర్లు లేకుండా ఈసీ సమావేశాలే నిర్వహించరాదన్న నిబంధనను విస్మరించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపకులపతుల నియామకాలకు అర్హతల విషయంలో ఇష్టానుసారం మార్పులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. అర్హతలకు సంబంధించి ఆగస్టు 29న విడుదల చేసిన నోటిఫికేషన్ ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో ఉంచింది. కానీ ఆ మరుసటి రోజే... యూజీసీ నిబంధనల మేరకు పదేళ్లు ప్రొఫెసర్‌గా అనుభవం ఉండాలని అర్హతలను మార్చారు. యూజీసీ 2018 నిబంధనలకు లోబడకుండా ఇష్టానుసారం మార్చి నోటిఫికేషన్ విడుదల చేశారు.

---

# కక్ష సాధింపుతో కష్టాలు!

- మా వాళ్ల కోసమే రాజీనామా
- పార్టీకి, శాసనసభ్యత్వానికి కూడా..
- క్రియాశీల రాజకీయాలకూ గుడ్‌బై
- తొలి నుంచీ పలు పోరాటాలు చేశా
- వెనక్కివెళ్లే మనస్తత్వం నాకు లేదు
- కానీ నమ్మక ద్రోహులతోనే ఇబ్బంది
- చంద్రబాబుకు టీడీపీ ఎమ్మెల్యే వంశీ లేఖ

అమరావతి/విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గ రాజకీయాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ కలిగిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీకి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేయడమే గాకుండా.. క్రియాశీల రాజకీయాలకు కూడా దూరంగా ఉండదలిచినట్లు గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి కక్షసాధింపు ధోరణి వల్ల తనను నమ్ముకున్నవారంతా పీకల్లోతు కష్టాల్లో ఉన్నారని.. తాను క్రియాశీలంగా ఉండడం వల్ల వారి కష్టాలు రెట్టింపవుతున్నాయని తెలిపారు. అందుకే వారి కోసం తాను రాజకీయాల్లో క్రియాశీలంగా ఉండకూడదని నిర్ణయించుకున్నానని.. ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేస్తున్నానని పేర్కొంటూ పార్టీ అధినేత చంద్రబాబుకు దీపావళి రోజున లేఖ రాశారు. దీనికి చంద్రబాబు స్పందించి.. అండగా ఉంటాం.. పోరాడదామని ప్రతిలేఖ రాశారు. దానిపై వంశీ మరో లేఖను వాట్సాప్ ద్వారా పంపించారు. దానికీ స్పందించిన టీడీపీ అధినేత.. అన్ని విషయాల్లోనూ అండగా ఉంటానని, సమస్యలపై మద్దతిచ్చేందుకు పార్టీ ఎంపీ కేశినేని నాని, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణలను నియమిస్తున్నానని తెలిపారు. వారిద్దరూ మంగళవారం వంశీతో చర్చలు జరిపే అవకాశాలున్నాయి. వివరాలివీ..

### పార్టీతో మీకు చారిత్రక బంధం..

చంద్రబాబు వంశీకి వాట్సాప్‌లోనే తిరుగు లేఖ రాశారు. 'మీ రెండో లేఖ చదివాను. అన్ని విషయాలను నోట్ చేసుకున్నా. పార్టీతో మీకున్న చారిత్రక బంధం వాస్తవం. గతంలో అన్యాయానికి వ్యతిరేకంగా నా మద్దతుతో పోరాడారు. ఇప్పటి పోరాటంలో కూడా మీకు అండగా ఉంటా. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ వేధింపులపై పోరాటంలో అండగా ఉంటాం. దీనికోసం ఎంపీ కేశినేని నాని, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణలకు మీతో సమన్వయం చేసుకునే బాధ్యతల్ని అప్పగిస్తున్నా. అన్ని సమస్యలూ పరిష్కరిస్తానని మీకు మాటిస్తున్నా' అని పేర్కొన్నారు.

### అందుకే రాజీనామా..

'పార్టీలో ఇప్పటివరకు మీ నాయకత్వంలో పనిచేసే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. నాకు సాధ్యమైనంత మేరకు.. రెండో ఎజెండా లేకుండా మనస్సాక్షిగా పార్టీ కోసం పనిచేశా. పనులన్నీ కనురెప్ప కూడా వేయకుండా విజయవంతంగా పూర్తిచేశా. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక... వైసీపీ ఇన్‌చార్జి, కొందరు ఉద్యోగుల పక్షపాత వైఖరి వల్ల నా అనుచరులు, మద్దతుదారులు పీకల్లోతు కష్టాల్లో ఉన్నారు. నేను క్రియాశీలంగా ఉండడం వల్ల వారి కష్టాలు అనేక రెట్లు పెరిగిపోతున్నాయని భావిస్తున్నా. ఈ దృష్ట్యా రాజకీయాల నుంచి దూరంగా ఉండాలని, రాజకీయాలను వదిలేయాలని నిర్ణయించుకున్నా. టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నా..' అని వంశీ చంద్రబాబుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. టీడీపీ అధినేత దీనిపై స్పందిస్తూ.. 'వాట్సాప్ ద్వారా పంపిన మీ లేఖను చదివాను. ఈ విషయాలన్నీ వ్యక్తిగతంగా కూడా గతంలో నా దృష్టికి తెచ్చారు. టీడీపీలోనూ, ఎమ్మెల్యేగానూ మీరు సమర్థంగా పనిచేశారు. గన్నవరం వైసీపీ ఇన్‌చార్జి, కొందరు అధికారులు మీపైన, పార్టీ యంత్రాంగంపైనా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మీపై పెట్టిన కేసు కూడా దురుద్దేశపూర్వకంగా పెట్టింది. పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చే కార్యక్రమం అది. ఆ ప్రకారమే మన ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీనవర్గాల కోసం పనిచేసింది. ఇలాంటి కేసులను పార్టీ లాజికల్‌గా ఎదుర్కొంటుంది. మీరు రాజకీయాలను వదిలేయడం వల్ల పార్టీ మద్దతుదారులపై దాడులు ఆగవు. రాజకీయాల నుంచి వైదొలగడం, రాజీనామాలు సరైన పరిష్కారం కావు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలపై వేధింపులు కొనసాగుతున్నాయి. మనం ఐక్యంగా వీటిపై పోరాడాలి. మీకు, పార్టీ యంత్రాంగానికి జరిగిన అన్యాయంపైనా పోరాడాలి' అని సూచించారు.



### 13 ఏళ్లుగా మీ సలహా తీసుకుంటున్నా..

చంద్రబాబు పంపిన లేఖపై వంశీ మరోసారి వాట్సాప్‌లో లేఖ రాశారు. 'నేను రాసిన లేఖ మొత్తం చదివి స్పందించినందుకు చాలా సంతోషంగా ఉంది. మీ ఆశీస్సులతో గన్నవరం ఎమ్మెల్యేగా, పార్టీ నేతగా చేసిన సేవలను గుర్తించినందుకు ధన్యవాదాలు. గత 13 ఏళ్ల నుంచీ ప్రతి విషయం మీకు చెబుతూ.. మీ సలహా తీసుకుంటున్నా. గన్నవరంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచే అవకాశం ఉన్నా పార్టీ శ్రేయస్సు కోసం మీ మాట విని విజయవాడ ఎంపీగా లగడపాటి రాజగోపాల్‌పై పోటీచేశా. ఓడిపోయి ఐదేళ్ల విలువైన కాలం వృథా అయినా పశ్చాత్తాపపడలేదు. ఆ తర్వాత విజయవాడ నగర అధ్యక్షుడిగా నిజంగా జీవన్మరణ సమస్యను ఎదుర్కొన్నా. దేవుడి ఆశీస్సులతో విజయవంతంగా పూర్తిచేశా. ఆ తర్వాత ఒక నిర్దాక్షిణ్య ఐపీఎస్ అధికారి పార్టీ యంత్రాంగాన్ని వేధించడానికి వ్యతిరేకంగా పోరాడా. ఇలా అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలు, శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ పోరాడుతూ వచ్చా. నాపై ఒక క్రిమినల్ కేసు కూడా నమోదైంది. మన ప్రభుత్వ హయాంలోనే.. కాలువలపై నివసిస్తున్న వారి నివాసాలు తొలగిస్తుండడాన్ని ఆపినందుకు కొందరు అధికారులు దురుసుగా వ్యవహరించి ఈ కేసు పెట్టారు. అలా కేసు పెట్టినవారందరికీ గతంలో మీరే న్యాయం చేసి, ఆశీర్వదించారు. అన్యాయానికి వ్యతిరేకంగా నేను చేసిన పోరాటంలో నాకు మనస్ఫూర్తిగా మద్దతిచ్చినందుకు ఏం చెప్పాలో మాటలు రావడం లేదు. గత ఎన్నికల ముందు కూడా నాపై చాలా ఒత్తిళ్లు వచ్చాయి. కానీ పోరాడాను. పోరాటం నుంచి వెనక్కి వెళ్లే మనస్తత్వం లేనివాడిని. అయితే ఎదురుగా వచ్చే శత్రువును ఎదుర్కోవడం తేలిక. మనతోనే ఉండే నమ్మకద్రోహుల(బ్లాక్‌షీప్)తో పోరాడడమే కష్టం. మీడియా, ఇతరులు రకరకాల ఊహాగానాలు చేసే అవకాశం ఉన్నందున.. ఇంతకంటే ఎక్కువ ఈ వాక్యాన్ని పొడిగించదలుచుకోలేదు. నాపై ఇంత శ్రద్ధ చూపి మద్దతిస్తానన్నందుకు కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.

### వంశీకి కేశినేని, కొనకళ్ల ఆహ్వానం

చంద్రబాబు సూచనతో వంశీతో మాట్లాడేందుకు కేశినేని నాని, కొనకళ్ల నారాయణ రంగంలోకి దిగారు. కానీ వంశీ హైదరాబాద్‌లో ఉండటంతో సోమవారం ఆయనతో చర్చలు జరపలేకపోయారు. అయితే ఫోన్‌లో నారాయణకు వంశీ టచ్‌లోకి వచ్చారు. చర్చలకు తాను సిద్ధమేనని ఈ సందర్భంగా ఆయన చెప్పినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం వారిద్దరితో భేటీ అయ్యే అవకాశముంది.

### బీజేపీతో టచ్‌లో వంశీ, గంటా!

న్యూఢిల్లీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ (గన్నవరం), గంటా శ్రీనివాస రావు (విశాఖ ఉత్తరం) తమతో టచ్‌లో ఉన్నారని బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త రఘురాం తెలిపారు. వైసీపీ బెదిరింపులకు బెదరాల్సిన పనిలేదని, తమతో చేతులు కలిపితే అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సోమవారమిక్కడ ఆంధ్రభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వంశీ బీజేపీ, వైసీపీ నేతలతో సంప్రదింపులు జరిపాకే రాజీనామా చేశారని చెప్పారు. 'ప్రజల కోసం పనిచేస్తూ, రాజకీయంగా మచ్చలేని నాయకులు ఎవరొస్తామన్నా.. వారిని సాదరంగా మా పార్టీలోకి ఆహ్వానిస్తాం. ఎమ్మెల్యే వంశీ వైసీపీ బెదిరింపుల వల్లే పదవికి రాజీనామా చేయబోతున్నారా? ఇదే నిజమైతే వారి బెదిరింపులకు ఆయన భయపడాల్సిన అవసరం లేదు. బీజేపీలోకి వస్తే ఆయనకు అన్నివిధాలా అండగా ఉంటాం. మాజీ మంత్రి గంటా కూడా వైసీపీతోపాటు బీజేపీతోనూ చర్చలు జరుపుతున్నారు. అయితే వారిద్దరూ బీజేపీలో చేరడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి' అని రఘురాం వ్యాఖ్యానించారు. జగన్ సీఎం అయ్యాక వైసీపీలోకి కొత్తగా ఎవర్నీ చేర్చుకోనని, ప్రజలు తనను అఖండ మెజారిటీతో గెలిపించినందువల్ల కొత్త వారిని చేర్చుకోవలసిన అవసరం తనకు లేదని అసెంబ్లీలోనే ప్రకటించారని.. ఇప్పుడు మాట తప్పి టీడీపీ వారిని భయపెట్టి మరీ వైసీపీలోకి చేర్చుకోవాలనుకోవడమేమిటని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో కూడా వైసీపీ నేతల వల్ల టీడీపీ నేతలు ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం ఉందని, భయపెట్టి ఎంతమందిని పార్టీలోకి లాక్కుంటారని ప్రశ్నించారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో బీజేపీదే హవా అని వ్యాఖ్యానించారు.

---

# టార్గెట్ బాబు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నేతగా హోదా లేకుండా పోతుంది. వైసీపీ లక్ష్యం ఇదేనని సమాచారం. టీడీపీ ఎమ్మెల్యేల్లో వీలైనంతమందిని ఏదోరకంగా తమ దారిలోకి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ ఫిరాయింపు కాకుండా.. రాజీనామా చేయించే దిశగా వ్యూహం రూపొందించినట్లు తెలుస్తోంది. ఎవరైనా ఎమ్మెల్యే పార్టీ ఫిరాయించినా.. ఆయన అధికారికంగా తెలుగుదేశం సభ్యుడిగానే లెక్కల్లో ఉంటారు. అందుకే వైసీపీలోకి వస్తే రాజీనామాలు చేసి రావాలని, ఒకవేళ తర్వాత వద్దామనుకుంటే ముందు రాజీనామా చేయాలన్న దిశగా వ్యవహారాలు నడుస్తున్నాయని తెలుస్తోంది. దీనికోసం భూ లావాదేవీలు, వ్యాపారాలు, కాంట్రాక్టులున్న ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో ఏ అంశంపై కేసులు పెట్టడానికి అవకాశముందన్నదీ పరిశీలిస్తున్నారు. ఏమాత్రం చాన్సు దొరికినా కేసులు పెట్టే వ్యూహంతో ఉన్నారు. దీంతో ఏదో ఒకలా మనుగడ సాగించాలని అనుకుంటున్న కొందరు ఎమ్మెల్యేలైనా ఫిరాయింపు, రాజీనామాలకు సిద్ధపడతారని వైసీపీ పెద్దలు అంచనా వేస్తున్నట్లు సమాచారం.

### వ్యతిరేకత లేదని నిరూపించేందుకు ఉప ఎన్నికలకు సిద్ధం

వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే కొంత అసంతృప్తి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెట్టుబడులు, పీపీఏలు, ఇసుక కొరతతో లక్షలాది మంది కార్మికుల జీవితాలు దెబ్బతినడం, వారి ఆత్మహత్యలు, అభివృద్ధి పనులు ఆగిపోవడం, ఆర్థిక సంక్షోభం నెలకొనడం తదితర అంశాలతో ప్రభుత్వంపై అసంతృప్తి ఏర్పడిందని అంటున్నారు. అయితే ఇలాంటిదేమీ లేదని నిరూపించుకోవడానికి ఉప ఎన్నికలను ఆయుధంగా వాడుకుంటే బాగుంటుందనే ఆలోచన కూడా అధికార పార్టీలో ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా పోవడంతో పాటు.. ఉప ఎన్నికలు కూడా వస్తాయి. ఉప ఎన్నికల్లో సహజంగానే అధికార పార్టీకి పూర్తిస్థాయి ఆధిపత్యం ఉంటుంది. బలగాలన్నీ సమీకరించి ఉప ఎన్నికల్లో గెలిచి.. తమ ప్రభుత్వంపై అసంతృప్తి ఉందన్న వాదనను కొట్టిపారేయాలన్నది వైసీపీ ఎత్తుగడగా పేర్కొంటున్నారు. ఆ దిశగానే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విశ్వసనీయ సమాచారం. తాను తలచుకుంటే తెలుగుదేశం పార్టీ నుంచి ఫిరాయింపులు పెద్ద విషయం కాదని ముఖ్యమంత్రి జగన్ గతంలోనే అన్నారు. అయితే ఫిరాయింపులు వద్దని, రాజీనామా చేసే ఎవరైనా రావలసి ఉంటుందన్నది తమ విధానమని స్పష్టం చేశారు. ఇప్పుడు అదే వ్యూహానికి పదును పెట్టినట్లు సమాచారం. దసరా నాటికే కొందరిని ఈ వ్యూహానికి అనుగుణంగా ఆకర్షిస్తారని అనుకున్నా అది జరగలేదని... దీపావళి నాటికి వ్యూహాలు పదునెక్కాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గన్నవరం ఎమ్మెల్యే వంశీతో వైసీపీ మంత్రులు కూడా మాట్లాడారని.. దాని పర్యవసానమే టీడీపీకి.. శాసనసభ్యత్వానికి ఆయన రాజీనామా అని చెబుతున్నారు. మరికొందరితోను ఇలా సంప్రదింపులు జరపడం, వారికున్న బలహీనతల ఆధారంగా తమవైపు వచ్చేలా చేయడానికి మరిన్ని గట్టి ప్రయత్నాలు ప్రారంభమైనట్లు పలువురు పేర్కొంటున్నారు.

---

# అమ్మకానికి 'ఆప్తాల్మిక్'!

- 'కంటి వెలుగు'లో మరో దోషం
- కాంట్రాక్ట్ సంస్థలో దళారుల హవా
- పోస్టుకు రూ.1.50 లక్షల డిమాండ్
- అభ్యర్థులతో నేరుగా బేరం.. నమ్మి మోసపోవద్దు: కమిషనర్

అమరావతి/విశాఖపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కంటి వెలుగులో మరో దోషం బయటపడింది. ప్రభుత్వం చేపట్టిన ఈ పథకంలో అవినీతి బయటపడుతోంది. ఇప్పటికే 'కిట్ల' కొనుగోలులో మతలబు జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు ఏకంగా ఆప్తాల్మిక్ అసిస్టెంట్ పోస్టుల అమ్మకాలు జరుగుతున్నాయనే ప్రచారం సాగుతోంది. పోస్టుకు రూ.1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. 'కంటి వెలుగు' పథకం అమలు కోసం ప్రభుత్వం 300 మంది ఆప్తాల్మిక్ అసిస్టెంట్ పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను గుంటూరుకు చెందిన ఔట్‌సోర్సింగ్ సంస్థ టెండర్ ద్వారా దక్కించుకుంది. అయితే ఆప్తాల్మిక్ అసిస్టెంట్ పోస్టులను ఇప్పిస్తామని, దీనికి కొంత మొత్తం ఖర్చవుతుందని చెబుతూ కొంతమంది దళారులు జిల్లాల్లో బేరాలకు దిగుతున్నారు. పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న వారిని దళారులు నేరుగా సంప్రదిస్తున్నారు. దరఖాస్తు దారులు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు చెల్లిస్తే ఉద్యోగం ఇస్తామని, డబ్బు చెల్లించిన వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకోవచ్చునని ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో దళారులకు ఈ విధంగా కొంతమంది డబ్బులు చెల్లించి ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నట్లు సమాచారం. సదరు కాంట్రాక్ట్ సంస్థే దళారులను నియమించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభ్యర్థులను ఫోన్లలో సంప్రదిస్తున్న దళారులు ఔట్‌సోర్సింగ్ సంస్థ పేరు చెప్పడంతో పాటు సంస్థ అడ్రస్‌లు చెబుతుండడం గమనార్హం. అయితే, అభ్యర్థులు మాత్రం.. మేం దరఖాస్తు చేసుకున్నా ఉద్యోగం రాలేదని, మీరెలా ఇప్పిస్తారని ప్రశ్నిస్తుంటే.. దళారుల దగ్గర ఉన్న లిస్ట్ ప్రకారం వారి పేర్లును పరిశీలించి, ఎందుకు ఎంపిక కాలేదన్న విషయాన్ని స్పష్టంగా చెబుతున్నట్టు తెలిసింది. మరోవైపు సదరు సంస్థకు నెలకు రూ.15 వేలు ఆదాయం కూడా వచ్చే పరిస్థితి లేదు. కేవలం పోస్టుల భర్తీ సమయంలోనే కొంత మొత్తం వెనుకేసుకోవాలన్న ఉద్దేశంతో తక్కువకు కోట్ చేసినట్లు తెలిసింది.

ఎంపిక కమిటీ ఉంది.. సభ్యులే లేరు!

కంటి వెలుగు పథకం అమలుకు ప్రతి జిల్లాకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. కమిటీకి ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్, నోడల్ ఆఫీసర్‌గా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని నియమించింది. అయితే ఈ పోస్టుల భర్తీ ప్రక్రియకు సంబంధించి కమిటీలో సభ్యులెవరినీ నియమించలేదు. దీంతో సదరు కాంట్రాక్టు సంస్థకు చెందిన ప్రతినిధులే జిల్లాల వారీగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతుండడంతో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆప్తాల్మిక్ అసిస్టెంట్ పోస్టులకు కొన్ని అర్హతలను నిర్ణయించారు. అభ్యర్థులు ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ చదివి ఉండాలి. అదేవిధంగా పారామెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు లేదా, బీఎస్సీ(ఆప్టోమెట్రీ), డిప్లమో ఇన్ ఆప్టోమెట్రీ, డిప్లమో ఇన్ ఆప్టోమెట్రిక్ టెక్నీషియన్ కోర్సు చేసి ఉండాలి. పారామెడికల్ బోర్డులో తప్పనిసరిగా రిజిష్టర్ అయి ఉండాలి. అయితే, ఈ కోర్సులు చేసిన అభ్యర్థులు తక్కువ మంది ఉన్నారు. కానీ పదో తరగతి తరువాత, ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ప్రైవేటు సంస్థల్లో ఈ కోర్సు చేసిన అభ్యర్థులు రాష్ట్రంలో వేలాది మంది ఉన్నారు. వీరంతా ఆయా పోస్టులకు దరఖాస్తు చేయడంతో పాటు దళారుల ద్వారా ఉద్యోగాలను పొందేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటి వరకు సంస్థ 261 మందిని ప్రభుత్వానికి అందించింది. మిగిలిన 39 మంది ఎంపిక ప్రక్రియ ఇంకా జరుగుతోంది.

### దళారులను నమ్మొద్దు

దళారుల చేతుల్లో మోస పోవద్దని ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. పోస్టుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందన్నారు. ఇది కేవలం రెండున్నర నెలలు మాత్రమే ఉంటుందన్నారు.

*Printed and Published by* **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* **Editor : K. Srinivas,** *RNI No:3470/1960,* **Managing Director : Vemuri Radha Krishna, Founder :** *K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com